• కరువు • శ్రామిక మహిళలు

కార్మికలోకం

మే 2003 మాసపత్రిక వెల రు.5

మే 21న సమ్మె, జయప్రదం చేయండి...

మే దినోత్సవ శుభాకాంక్షలతో...

సిఐటియు

నెల్లూరు జిల్లా కమిటీ

మే- 2003

కార్మిక లోకం

సి.ఐ.టి.యు. ఆంధ్రప్రదేశ్ కమిటీ మాసపత్రిక

సంపుటి 19 సంచిక 5

విడి ప్రతి వెల : రూ. 5

సం॥ర చందా : రూ. 50

విషయ సూచిక

సంపాదకీయం ---------------- 1

మే 21 సమ్మె --------------- 4-5

మే డే ప్రతిజ్ఞ ------------------- 6

డాక్టర్-డాక్టర్ ------------------ 7

ఉద్యమవార్తలు ------------- 8,12

మసిబారిన బాల్యం కథ --- 10-11

వలస కార్మికుల వినతిపత్రం --------- 13

లాభాల వేటలో --------------- 15

మే డే ------------------ 16 -17

దేశం కోసం ----------------- 18

సినిమా -------------------- 19

కంపెనీ మృగరాజు ----------- 23

చట్టాల సవరణ ------------- 24

చాయ్‌బండి ---------------- 32

మేనేజర్

కార్మికలోకం

యన్.వి.బి. స్మారక కేంద్రం, 1-1-60/4,

ఆర్టీసీ క్రాస్ రోడ్స్, ముషీరాబాద్, హైదరాబాద్ - 20.

ఫోన్ : 7624502, 7612474

ఫ్యాక్స్ : 7610128

సంపాదక వర్గం

పర్సా సత్యనారాయణ

ఎం.ఎ. గపూర్, ఎస్. వీరయ్య

ఆర్. సుధాభాస్కర్, రోజా

జ్యోతి, టి.యస్.వి. రమణ

ఎడిటర్ : వై. సిద్ధయ్య

మేనేజర్ : పి.రాజారావు

సంపాదకీయం

మే 21 సమ్మె

పాలకులకు గట్టి హెచ్చరిక కావాలి !

కేంద్ర, రాష్ట్ర పాలకుల వినాశకర విధానాలకు వ్యతిరేకంగా మే 21న దేశ వ్యాపిత సమ్మె చేయాలని కార్మిక సంఘాల జాతీయ సంప్రదింపుల కమిటీ పిలుపునిచ్చింది. అత్యవసర సమస్యలపై జరుగుతున్న ఈ సమ్మె జయప్రదం కావాలి. ప్రపంచీకరణ వ్యతిరేక పోరాటంలో ఐక్య కార్మికోద్యమానికి ఈ సమ్మె మైలురాయి కావాలి.

మన పాలకులకు ప్రపంచబ్యాంకు నిషా నషాళానికి అంటింది. అంతా మనమంచికే నంటూ కాంగ్రెస్ ప్రపంచబ్యాంకు షరతులకు తలొగ్గింది. 2వ దశ సంస్కరణలను వాజ్‌పేయిగారి ప్రభుత్వం మరింత వేగంగా అమలుకు చేస్తున్నది. ఈ దివాళా కోరు సంస్కరణల అమలులో చంద్రబాబు గారు నేనే...నేంబర్ ఒన్ అంటున్నారు. సంస్కరణల రథ చక్రాల క్రింద నలిగిపోతున్న ప్రజలు- చిరుద్యోగులు, కార్మికుల, హాహాకారాలు పాలకుల చెవికెక్కడం లేదు. పలు రూపాలలో వారిని మభ్యపెట్టడమే పరిష్కారంగా పాలకులు చూస్తున్నారు. ప్రపంచబ్యాంకు దొరలను ప్రసన్నం చేసుకోవటమే దైనందిన కర్తవ్యంగా మారింది.

కేంద్ర కార్మిక వుద్యోగ సంఘాలు రూపొందించిన 8 డిమాండ్లతో పాటు మన రాష్ట్రంలో నెలకొన్న కరువు బాధితుల సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్ కూడా అత్యవసరమైనది. కోట్లాది వ్యవసాయ కార్మికులు, రైతులు, చేతివృత్తిదారులు, వలస కార్మికులు, పట్టణ పేదలను కృంగదీస్తున్న జీవన్మరణ సమస్యలివి. పనికోసం, తిండికోసం, త్రాగునీటికోసం వారి ఆక్రందనలను, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవటం శోచనీయం.

ఉద్యోగ, కార్మిక సంఘాల విజ్ఞప్తులను పాలకులు లక్ష్యపెట్టడం లేదు. ప్రధాన సమస్యలపై, పార్లమెంటు అసెంబ్లీలలో సవివరమైన చర్చకు అవకాశమే ఇవ్వడం లేదు. ఈ కాలంలో ప్రైవేటీకరణలకు వ్యతిరేకంగా హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్‌లలో జరిగిన సమ్మెలను, పోరాటాలను పాలకులు గమనంలోకి తీసుకోవటం లేదు. పాలకులు అనుచిత విధానాల వల్ల దేశ వ్యాపితంగా ట్రాన్స్‌పోర్టు సమ్మె జరిగింది. బిఎస్ఎన్ఎల్ కు పలు పార్లమెంటరీ కమిటీలను ప్రక్కన బెట్టారు. కేంద్ర ప్రభుత్వ విధాన నిర్ణయంలో అమెరికా వారి జోక్యం పెరిగింది.

కేంద్రంలో బిజెపి పాలకుల విధానాలు దేశసమైక్యత. సమగ్రతలను విచ్ఛిన్నం చేస్తున్నాయి. పాలకుల విధానాలకు బలై, అసంతృప్తి చెందిన ప్రజలను మతోన్మాదం వైపు పెడమార్గం పట్టిస్తున్నారు. మన రాష్ట్రంలో గతంలో హిందూపురం, ఇటీవల మొత్తం రాయలసీమ జిల్లాలలో ముస్లిం మైనారిటీలపై సంఘ్ పరివార్ శక్తుల వీరంగా ఆందోళనకరం. చంద్రబాబు ప్రభుత్వ రాజకీయ అవకాశవాదం విచ్ఛిన్నకర శక్తులకు వూతమిస్తున్నది. ఐక్యతను కాపాడుకోవటంలో కార్మికవర్గం అప్రమత్తంగా వుండాలి.

ఈ వినాశకర విధానాలకు చరమగీతం పాడాలని యావన్మంది ఉద్యోగులు కార్మికులు కోరుకుంటున్నారు. ఈ పూర్వరంగంలో పాలకుల దూకుడుకు కళ్ళెం వసేందుకై మే 21 సమ్మె వుద్దేశించబడింది.

ఊరందరిదీ ఒకదారీ వులిపికట్టేది వేరొకదారి. ఈ ధోరణిలో ఐఎన్‌టియుసి అధ్యక్షుడు సంజీవరెడ్డిగారు సమ్మెకు వ్యతిరేకంగా దుష్ప్రచారానికి దిగారు. రాజుకుమించిన రాజభక్తిని ప్రదర్శిస్తున్నారు. ఇది వామపక్ష కార్మిక సంఘాలు సమ్మెగా పెడమర్గాం పట్టిచటం క్షంతవ్యం కాదు. తాము విడిగా పోరాటం చేస్తామన్న వాదనతో బిఎంఎస్ సమ్మెకు దూరంగా ఉన్నది. ఇది బిజెపి ప్రభుత్వాన్ని కాపాడేందుకే. కార్మికవర్గాన్ని చీల్చేందుకే. వీరిరువురు ఒక ప్రధాన అంశాన్ని దాచేస్తున్నారు. గత 3,4 సం॥లోలుగా ప్రపంచ బ్యాంకు విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల ఐక్యవేదికలపై పలు సన్నాహాలలో పై రెండు సంఘాలు ఏదో ఒకటి మార్చి మార్చి వుంటున్నాయి. ఆ విధంగా సమ్మె నిర్ణయంలో పరోక్షంగా ఈ రెండు సంఘాలు భాగస్వాములే.

ఈ సమ్మెకు- రాజకీయ అనుబంధాలకు నిమిత్తం లేదు. దేశ సార్వభౌమత్వం, సమగ్రత, మా ప్రజల సంక్షేమన్ని కాంక్షించే వారందరూ ఈ సమ్మెను బలపరచాలి. బెంగాల్ ఐఎన్‌టియుసి విభాగం సమ్మెలో పాల్గొంటున్నట్లు ప్రకటించటం హర్షనీయం. గత సంవత్సరం ఏప్రిల్ 16 సమ్మెలో కూడా అనుంబంధాలతో నిమిత్తం లేకుండా కార్మికవర్గం పాల్గొని సమ్మెను దిగ్విజయంచేశారు.

రాజకీయ పార్టీల అండదండలు ఈ సందర్భంగా ఎంతైనా అవసరం. రాజకీయ పార్టీలు, పలు ప్రజాసంఘాలు కూడా ఈ సమ్మె పోరాటానికి మద్దతుగా రంగంలోకి దిగాలి. ఇది నేటి అవసరం.

కార్టూనీయం



వివిధ పత్రికల సౌజన్యంతో









అయోధ్యలో ఆసుపత్రి నిర్మించండి

అయోధ్యలో వివాదాస్పద స్థలంలో మందిరం ఉండేదా లేక మసీదు ఉండేదా అనే దానిపై గత కొన్ని దశాబ్దాలుగా అటు రాజకీయ పక్షాలు, ఇటు వివిధ మతవర్గాల వారి మధ్య ఎడతెగని వివాదాలు నడుస్తున్నాయి. సుప్రీం కోర్టు తీర్పు ఏ విధంగా వున్నప్పటికీ ఆ స్థలంలో గుడి నిర్మించాలా? మసీదు నిర్మించాలా? అనే వాదనతో కాలయాపనకు తావివ్వకుండా, అక్కడ అన్ని మతాల ప్రజలకు ఉపయోగపడే విధంగా ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించవలసిందిగా ఒక భారతీయ పౌరుడిగా విజ్ఞప్తి. ఈ విషయాన్ని రాజకీయ, మత నాయకులందరు సహృదయంతో ఆలోచించి ప్రజలకు ఉపయాగపడే విధంగా చేస్తే బాగుంటుంది. ప్రభుత్వం పునరాలోచించి ఒక మంచి నిర్ణయం తీసుకుంటే మతకలహాలు జరుగకుండా ఉండేందుకు అవకాశముంటుంది.

- కిషోర్ కుమార్, బళ్ళారి.

బాగ్దాద్ భవితవ్యం ఏమిటి?

ప్రాచీన ప్రపంచానికి నాగరికతను నేర్పిన, మెసపుటోమియా నాగరితగా పిలువబడిన ఇరాక్ నేడు అగ్రరాజ్యాల స్వార్థ పూరిత దురహంకారానికి బలైపోతున్నది. మధ్య ఆసియా ప్రాంతంలో పట్టు సాధించి క్రమంగా ప్రపంచాన్ని తమ గుప్పిట్లో పెట్టుకోవాలని అమెరికా తపిస్తున్నది. అమెరికాను ఎదిరించగల సత్తా, దమ్మూ, ఉన్న దేశాలు కూడా కిమ్మనకుండా ఉన్నాయి. జర్మనీ, ఫ్రాన్స్, రష్యా, చైనా లాంటి దేశాలు గోడమీద పిల్లిలా వ్యవహరిస్తున్నాయి.

మరోవైపు భూమండల మంతా ఈ అధర్మ యుద్ధాన్ని గర్హిస్తున్నారు. అందులో చిన్న పిల్లల దగ్గరి నుండి వయస్సు మళ్లిన వయో వృద్ధుల వరకూ ఉన్నారు. ప్రపంచంలోనే ప్రథమ విశ్వవిద్యాలయం గల బాగ్దాద్‌లో సమాసమీరా అనే ఒక కాలేజీ విద్యార్థిని సంకీర్ణ సైనికుడిని నిలదీసి 'ఇరాక్‌పై మీ దాడి ఏమిట'ని ప్రశ్నించి తన వాక్ స్వాతంత్ర్యాన్ని వినియోగించుకుని విద్యార్థి యువతకు కనువిప్పు కల్గించటం ఎంతో ప్రశంషనీయం.

- రాజేశ్వరి, సికింద్రాబాద్

అర్బన్ బ్యాంకుల అవినీతిని అడ్డుకోండి

అర్బన్ బ్యాంక్ పేరు వింటేనే ప్రజలు ఉలిక్కిపడుతున్నారు. ఎందుకంటే రోజూ ఎండనక, వాననక శ్రమించిన డబ్బులతో ఇల్లు కట్టుకుందామనో, కూతురి పెళ్ళి చేద్దామనో, తమ పిల్లలకు చదువు చెప్పించవచ్చుననో కోటి ఆశలతో ప్రజలు పొదువు చేస్తుంటారు. ఇతర బ్యాంకులతో పోలిస్తే కొద్ది హెచ్చు వడ్డీ వస్తుందన్న మధ్యతరగతి ఆశతో అర్బన్ బ్యాంకుల్లో డబ్బు దాచుకుంటున్నారు.

ముందు బాగానే బిజినెస్ చేసి వడ్డీలు, డిపాజిట్లు నకాలంలో చెల్లించి నమ్మకం ఏర్పరచుకొని మరిన్ని డిపాజిట్లను ఆకర్షించి, కోట్లాది రూపాయలను డైరెక్టర్లు, ఉద్యోగులు లోన్లు తీసుకొని బోర్డు తిప్పేస్తున్న దారుణాలు ఇటీవలి కాలంలో ఎక్కువయ్యాయి. ఎప్పుడు ఏ బ్యాంకులో ఏ కుంభకోణం బయటపడుతుందో, ఏ నిముషంలో తమ డిపాజిట్లకు నీళ్ళు వదులుకోవలసి వస్తుందోనని మధ్యతరగతి ప్రజలు నిద్రలేకుండా గడుపుతున్నారు.

కృషి బ్యాంకు యజమాని ఖుషీగా దేశం విడిచి వెళ్ళిపోయాడు. చార్‌మినార్ బ్యాంక్ అధిపతి పరలోకమే వెళ్ళాడు. వాసవి వారిని అరెస్ట్ చేశారు ఎందుకనో? ప్రూడెన్షియన్ బ్యాంక్ వారు పారిపోయారు.

డపాజిటర్లు డైరెక్టర్లను నిలదీస్తున్నప్పుడు వారిని రక్షిస్తున్న పోలీసులు, ప్రభుత్వము డిపాజిటర్ల డబ్బుకు మాత్రం మా 'బాధ్యత' లేదంటూ తప్పించుకోవటం వారి అసమర్థతా, బాధ్యతా రహిత్యం కాదా? ప్రభుత్వమే వారినీ, వారు చేసే వైట్‌కాలర్ నేరాలను తమ ప్రయోజనాల కోసం ప్రోత్సహిస్తుందేమోనని ప్రజల అభిప్రాయం. ఇప్పటికైనా మిగిలిన అర్బన్ బ్యాంకుల పనితీరు ఎలా ఉందో, కూలంకషంగా పరిశీలించి ప్రజలకు ఎప్పటికప్పుడు వాస్తవాలు తెలియజేయడం, బాగాలేని బ్యాంకుల గురించి కూడా తప్పుడు ఆడిట్ రిపోర్టులు ఇచ్చే అధికారులపై చర్యలు తీసుకోవడం ఎంతైనా అవసరం.

- రాఘవేందర్ రెడ్డి, హిమాయత్ నగర్.

మీరు కూడా మీ అభిప్రాయాలను, సమస్యలను ఈ కింది చిరునామాకు తెలియజేయవచ్చు.

డియర్ ఎడిటర్

C/o. 'కార్మిక లోకం' మాసపత్రిక

యన్.వి.బి. స్మారక కేంద్రం, 1-1-60/4,
ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, ముషీరాబాద్,
హైదరాబాద్ - 20.
ఫోన్: 7624502, 7612474

కథ హత్తుకునేలా వుంది

మీ పత్రికలో ఏప్రిల్ మాసపు శీర్షికలో చందు వ్రాసిన 'బిచ్చగాడు' కథ మనస్సుకు హత్తుకునే విధంగా ఉంది.

ఇటువంటి 'నీతి-అవినీతి'కి సంబంధించిన కథలను ప్రచురించి ఈ పత్రిక సర్వతోముఖాభివృద్ధి చెందాలని అకాంక్షిస్తూ.

సదా మీ పత్రికాభిమాని,

- అంజన్‌బాబు. జి, కరీంనగర్

పాఠకమహాశయులకు విజ్ఞప్తి

కార్మికలోకం పత్రిక రూపంలో, అందంగా విషయంలో నాణ్యంగా రూపొందించే ప్రయత్నం చేస్తున్నాం. మన పత్రికా రచనలో పాఠకులు భాగస్వాములను చేయాలని మా అకాంక్ష. అపుడే మన పత్రికను మీ ఆకాంక్షలకు అనుగుణంగా తేగల్గుతాము.

వ్రాయండి- వ్రాయించండి. అందుకు మీ వుత్తరాల కోసం ఎదురు చూస్తుంటాం.

★ లెటర్స్ టు ఎడిటర్, ఆరోగ్యం శీర్షికలకు తక్కువ వాక్యాలతో లెటరు వ్రాయండి. ఇతరులచే వ్రాయించండి. సద్విమర్శలు చేయండి.

★ కథలు, కవితలు, పాటలు, వ్యంగ్య రచనలు, కరువు, అమెరికా యుద్ధం, పోరాటాలు, ప్రభుత్వ విధానాలు వగైరా పలు అంశాలపై మీరు వ్రాయండి. వ్రాయగల ఇతరులచే వ్రాయించండి. మీ ప్రాంతంలో ప్రఖ్యాత రచయితలుంటే వారి అడ్రసులు ఫోన్ నెంబర్లు మాకు పంపండి.

★ రాష్ట్రంలో అనేక తరగతుల ప్రజలు పోరాటాలు చేస్తున్న కాలమిది. మీరు నిర్వహించే పోరాటాలు అనుభవాలు గురించి సంక్షిప్తంగా వ్రాసి కార్మికలోకానికి పంపండి. మీ అనుభవాలను ఇతరులకు పంచండి.

★ పంపే రచనలు ప్రతినెల 15వ తేదీలోగా మాకు చేరాలి. చక్కని దస్తూరితో, వల్లసిరాతో పేపరుకు ఒకవైపు వ్రాసి పంపండి.

ఎడిటర్
కార్మికలోకం

కవర్ స్టోరీ

మే 21న సార్వత్రిక సమ్మెకు కదలండి!

డబ్ల్యు ఆర్ వరదరాజన్

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మే 21న దేశ వ్యాపితంగా సాధారణ సమ్మె జరపాలని కార్మికవర్గం నిర్ణయించింది. మరోసారి కార్మికవర్గం వీధుల్లోకి వచ్చి ప్రభుత్వంతో పోరాడనుంది. ఎన్‌డిఏ ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలు ఇచ్చింది. వాటిలో ఏ ఒక్కటీ అమలు చేసిన



వాణిజ్యం - అన్నీ తీవ్ర సంక్షోభంలో పడ్డాయి. గ్రామీణ పేదలు కరువు కాటకాలతో అల్లాడు తున్నారు. ఆకలి చావులు పెరిగి పోతున్నాయి. ఉపాధి కల్పనలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఈ నిస్పృహతో వాజ్‌పేయి ప్రభుత్వం ప్రజల ప్రజాతంత్ర హక్కులపై పెద్దయెత్తున దాడిచేస్తోంది. దేశంలోని కార్మిక శ్రామిక జనావళిని లక్ష్యంగా పెట్టుకుని దాడులు సాగిస్తోంది. కార్మికవర్గాన్నే లక్ష్యంగా ఎంచుకోవడానికి కారణం ఎన్‌డిఏ ప్రభుత్వ దివాళాకోరు విధానాలకు వ్యతిరేకంగా ఈ వర్గం ముందుండి పోరాడటమే.

ఫిబ్రవరి 26న కార్మికులు పార్లమెంటుకు యాత్ర జరిపి "వినాశకర విధానాలను పూర్తిగా మార్చుకోవాలని, లేకుంటే యావత్ ప్రజానీకం యొక్క ఆగ్రహాన్నిచవిచూడాల్సి వస్తుంది" అని వాజ్‌పేయి ప్రభుత్వాన్ని గట్టిగా హెచ్చరించారు. అయినా ప్రభుత్వం ఈ విధానాలను పునఃపరిశీలిస్తున్న సూచనలేవీ కానరావడంలేదు. మార్చి 12న కార్మిక సంఘాల జాతీయ సంప్రదింపుల కమిటీ సమావేశమై ఫిబ్రవరి 26న లక్షలాది మంది కార్మికులు ప్రకటించిన 'డిక్లరేషన్' కనుగుణంగా మే 21న సార్వత్రిక సమ్మె జరపాలని నిర్ణయించింది. ఈ సమావేశం తన మద్దతును పునరుద్ఘాటించింది.

దురదృష్టకరం :

బిఎంఎస్, ఐఎన్‌టియుసిల నాయకత్వం ప్రస్తుత ఈ సమ్మెలో పాల్గొనరాదని నిర్ణయించాయి. ఇక్కడొక విషయం గుర్తుంచుకోవాలి. ఇప్పుడు ఏ డిమాండ్ల సాధన కోసం సమ్మె జరగనుందో సరిగ్గా అవే డిమాండ్లను గత రెండేళ్ళుగా ఇతర కార్మిక సంఘాలతో కలిసి ఈ రెండు కేంద్ర కార్మిక సంఘాలు ప్రభుత్వం ముందుంచుతూ వచ్చాయి. ఈ డిమాండ్ల సాధన కోసం దేశ వ్యాపిత సమ్మె జరపాలన్న నిర్ణయంలో వారు కూడా భాగస్వాములే. తరువాత అందరికీ ఆమోదయోగ్యమైన తేదీన సమ్మె జరిపేందుకు కూడా వారు అంగీకరించారు. 2002 జులై 15న సంయుక్త ప్రదర్శనల సందర్భంగా ఈ తేదీని వెల్లడించాలని కూడా అనుకున్నారు. అయితే ఆ కీలకమైన సమావేశానికి రాకుండా బిఎంఎస్ ఎగ్గొట్టింది. కాగా ఈ ఏడాది మార్చి 12న జరిగిన జాతీయ సంప్రదింపుల కమిటీ సమావేశానికి ఐఎన్‌టియుసి గైర్హాజరైంది. దీనికి ఏవేవో కుంటిసాకులు చెప్పాయి. దేశంలోని యావన్మంది కార్మికులు ఉమ్మడి కోర్కెల సాధనకు నిరంతరం సాగిస్తున్న ప్రచారోద్యమానికి కొనసాగింపుగానే మే 21న సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాము.

ఉధృత ప్రచారం :

దేశంలోని కార్మిక వర్గం యావత్తూ ఈ కార్యాచరణ పిలుపునందుకుని మే 21 సమ్మెను బ్రహ్మాండంగా జయప్రదం చేయగలరన్న విశ్వాసం మాకుంది. సమ్మెకు సంబంధించిన ఈ డిమాండ్లన్నిటిని దేశంలోని ప్రతి కార్మికుని వద్దకు తీసుకెళ్లేలా చూడాలి. ప్రచారాన్ని ఉధృతం చేయాలి. అన్ని యూనియన్ల వెనకవున్న కార్మికులందరికీ ఈ కార్యాచరణ సందేశం చేరేలా చూడాలి.

ప్రయివేటీకరణను ఆపాలి :

లాభాలను ఆర్జించి పెడుతున్న, ఆర్థికంగా బలిష్టంగా వున్న ప్రభుత్వరంగ సంస్థలను ముందుగా నిర్ణయించుకున్న 'కొనుగోలుదారులకు' కారుచౌకగా అమ్మేయడం ఎన్‌డిఏ ప్రభుత్వానికి రివాజుగా మారింది. ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణకు ప్రత్యేకంగా ఒక మంత్రిత్వశాఖను ఏర్పాటుచేసిన దేశం ప్రపంచంలో భారత్ ఒక్కటే. ప్రతి బడ్జెట్‌లోను ఇన్ని వేల కోట్ల ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటు వారికి అమ్మాలని లక్ష్యంగా నిర్ణయించారు. విలువైన జాతి సంపదను తమ కిష్టమైన కార్పొరేట్ లాబీలకు అప్పగిస్తూ స్కాములమీద స్కాములకు పాల్పడుతోంది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) చీవాట్లు పెట్టినా ప్రభుత్వం దులిపేసుకుంటోంది.

దేశ భద్రతతో ముడివడి వున్న కీలక, వ్యూహాత్మక రంగాలు - రక్షణ, చమురు, ఓడ రేవులు వగైరాలలో సైతం ప్రభుత్వ పెట్టుబడులను ఉపసంహరించు కుంటోంది. గుజరాత్ శాసనసభ ఎన్నికల్లో బిజెపి విజయం తరువాత ప్రయివేటీకరణ జోరును వాజ్‌పేయి ప్రభుత్వం మరింత పెంచింది. పాలక సంకీర్ణంలో భాగస్వాములు కొన్ని సుతిమెత్తగా వ్యక్తం చేసిన నిరసనలను కూడా అది లెక్కచేయడం లేదు. పెట్టుబడుల ఉపసంహరణ లేక ప్రయివేటీకరణ పేరుతో జాతి సంపదను లూటీ చేస్తోంది. కేంద్ర ప్రభుత్వంతోబాటు వివిధ రాష్ట్రాలు కూడా ప్రభుత్వరంగంలోని వివిధ విభాగాలను కార్పొరేటీకరిస్తున్నాయి. కార్పొరేటీకరణ అనేది ప్రయివేటీకరణ దిశగా వేసే తొలి అడుగు అని మరువరాదు. ఆంధ్రప్రదేశ్ వంటి

❑ కవర్‌స్టోరీ

రాష్ట్రాల్లో ఈ కార్పొరేటీకరణ ప్రక్రియ ఇప్పటికే జోరందుకుంది.

కార్మిక చట్టాల్లో వినాశకర మార్పులు :

రెండవ జాతీయ లేబర్ కమిషన్ నివేదికను సాధనంగా చేసుకుని కార్మికుల ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీసే విధంగా కార్మిక చట్టాల్లో అనేక మార్పులు తెస్తోంది. ఈ లేబర్ కమిషన్ సిఫారసుల ను అనుమతిస్తే దేశంలో కార్మికోద్యమం గొంతు నులిమేసినట్లే. కార్మికుల సామాజిక భద్రత పై వేటు పడుతోంది. ప్రస్తుత పారిశ్రామిక వివాదాల చట్టానికి, కాంట్రాక్టు కార్మికుల చట్టానికి సవరణలు ప్రతిపాదిస్తూ బిల్లులను కూడా ప్రభుత్వం రూపొందించింది. కార్మికులను రిట్రెంచ్ చేసేందుకు, పరిశ్రమలను మూసివేసేందుకు, కార్మికుల, కార్మిక సంఘాల ప్రజాతంత్ర హక్కులను హరించేందుకు యజమానులకు స్వేచ్ఛనిచ్చే పలు నిబంధనలను ఈ బిల్లుల్లో పొందుపరిచింది. కార్మికులు కష్టపడి సాధించుకున్న సంఘటిత హక్కు, బేరమాడే హక్కులను హరించి బానిసత్వ నిబంధనలను కార్మికులపై రుద్దేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

వ్యవసాయ కార్మికుల సమగ్ర చట్టం :

దేశంలోని మొత్తం కార్మికులలో 60 శాతం దాకా వ్యవసాయ కార్మికులే. ఇంత పెద్ద సంఖ్యలో వున్న కార్మికులకు చట్టపరంగా ఎటువంటి రక్షణ లేదు. వీరికి కనీస వేతనాలు కూడా లేవు. సరళీకృత ఆర్థిక విధానాల పర్యవసానంగా వ్యవసాయ రంగం సంక్షోభంలో పడింది. భూ సంస్కరణల గురించి అసలు మాట్లాడటమే మానేసింది. కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రవేశపెట్టి సన్న, చిన్నకారు రైతులను వారి సొంత భూములనుంచి తొలగించి వారి భూమిలోనే వారిని కూలీలుగా మారుస్తోంది. కరువు కాటకాలతో గ్రామీణ కూలీలు బతుకుతెరువు కోసం పట్టణాలకు వలసలు పోతున్నారు. వ్యవసాయ కార్మికుల సమగ్ర చట్టాన్ని ఇంకెంత మాత్రం జాప్యం లేకుండా తీసుకొచ్చేలా ప్రభుత్వంపై కార్మికోద్యమం ఒత్తిడి తేవాలి.

ఉద్యోగాలను హరించివేసే, నిరుద్యోగం :

1996 నుండి ఇంతవరకు పబ్లిక్, ప్రయివేటు సంఘటిత రంగాలలో ఉద్యోగావకాశాల పరిస్థితిలో చెప్పుకోదగిన మార్పు లేదని కేంద్ర ప్రభుత్వమే స్వయంగా తెలిపింది. అప్పటి కార్మికశాఖ సహాయ మంత్రి అశోక్ ప్రధాన్ పార్లమెంటులో ఒక ప్రశ్నకు లిఖిత పూర్వకంగా ఇచ్చిన సమాధానంలో 1995 నాటికి సంఘటిత రంగంలో మొత్తం ఉద్యోగాలు 2 కోట్ల 79 లక్షల 86 వేలు వుండగా 2000 నాటికి 2 కోట్ల 79 లక్షల 60 వేలకు తగ్గిపోయాయని పేర్కొన్నారు. 2002 మార్చి 31 నాటికి 4.23 లక్షల మంది ఉద్యోగులను విఆర్ఎస్ కింద సాగనంపిన విషయాన్ని కూడా మంత్రి అంగీకరించారు.

వాస్తవ పరిస్థితులిలా వుండగా ఇటీవల పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాని వాజ్‌పేయి సమాధానమిస్తూ ఏడాదికి కోటి ఉద్యోగాలు కల్పిస్తామన్న వాగ్దానాన్ని ఎన్‌డిఏ ప్రభుత్వం నెరవేర్చిందని చెప్పుకున్నారు. కేంద్ర బడ్జెట్‌కు ముందు విడుదలైన ఆర్థిక సర్వేలో ప్రభుత్వరంగ సంస్థల్లో ఉపాధి రేటు 0.9 శాతానికి పడిపోయిందని, ప్రయివేటు రంగంలో ఉపాధిరేటు కేవలం 0.1 శాతం మాత్రమే పెరిగిందని స్పష్టంగా పేర్కొన్నారు. కార్మిక సిబ్బందిని తగ్గించడం, ఖాళీలను భర్తీ చేయక పోవటం వంటి విధానాలను ప్రభుత్వం అనుసరిస్తోంది. అందుకే దేశంలోని విద్యార్థి, యువజనులనందరినీ సమీకరించి పనిహక్కు, నిరుద్యోగ భృతి సాధనకు ఉద్యమించేలా కార్మికవర్గం కృషిచేయాలి.

సమగ్ర సామాజిక భద్రత కల్పించాలి :

దేశంలోని కార్మికవర్గంలో మెజారిటీ కార్మికులు అసంఘటితరంగంలోనే వున్నారు. ప్రస్తుత సామాజిక భద్రత పథకాలు వారికి వర్తించడం లేదు. ప్రభుత్వం మొసలి కన్నీరు కార్చడం మినహా వీరికి చేసిందేమీలేదు. కార్మికులకు కాస్తా కూస్తో సామాజిక భద్రత చేకూరుస్తున్న ప్రస్తుత చట్టాలకు తూట్లు పొడుస్తున్నది. ప్రభుత్వ శాఖల్లో కొత్తగా చేర్చుకునే వారికి కన్సాలిడేటెడ్ ఫండ్ కింద, ఫించను పథకాన్ని వర్తింపజేయకుండా నూతన కంట్రిబ్యూటరీ పథకం కింద వీరిని చేరుస్తోంది. ఇఎస్ఐ హాస్పిటల్స్‌ను ప్రయివేటీకరించేందుకు ప్రయత్నిస్తోంది. పిఎఫ్, పెన్షన్ ఫండ్స్‌ను దగాకోరు స్టాక్ మార్కెట్ వైపు మళ్లిస్తోంది.

దిగుమతులపై ఆంక్షలను పునరుద్ధరించాలి:

ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) నిబంధనలకు తలొగ్గి చాలా వస్తువులపై వున్న పరిమాణాత్మక ఆంక్షలను గడువుకన్నా చాలా ముందుగా ప్రభుత్వం ఎత్తివేసింది. దీని ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థకు ఎనలేని హాని కలిగింది. దిగుమతి వస్తువులు మార్కెట్‌లో చౌకగా దొరకడం, దేశీయ సరుకుల ధరలు ఎక్కువగా వుండటం వంటి పరిస్థితులేర్పడ్డాయి. దీంతో వ్యవసాయ, సాంప్రదాయ, చిన్న తరహా పరిశ్రమలు దారుణంగా దెబ్బతిన్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు మాత్రం తమ ఉత్పత్తులకు ఇస్తున్న భారీ సబ్సిడీలను యథాతథంగా కొనసాగిస్తున్నాయి. మన ఉత్పత్తులపై ఇస్తున్న సబ్సిడీని బాగా తగ్గించాలని భారత ప్రభుత్వాన్ని అవి శాసిస్తున్నాయి. అంతర్జాతీయ వాణిజ్యమంతా అభివృద్ధి చెందిన దేశాలకే అనుకూలంగా వుంది. అందుకే దిగుమతులపై పరిమాణాత్మక ఆంక్షలను పునరుద్ధరించాలని యావత్ కార్మికవర్గం డిమాండ్ చేస్తోంది.

బోనస్ పై సీలింగ్ ఎత్తివేయాలి :

ప్రస్తుత బోనస్ చట్టంలో బోనస్ పొందేందుకు ఆదాయ పరిమితులను విధించారు. ఈ పరిమితుల వల్ల సంఘటితరంగంలో చాలామంది కార్మికులు బోనస్‌కు అర్హత కోల్పోతున్నారు. ఈ బోనస్ పరిమితి పెంపు విషయమై ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వం కార్మిక సంఘాల నుంచి, యాజమాన్యాల నుండి, రాష్ట్ర ప్రభుత్వాల నుండి అభిప్రాయాలు కోరుతున్నది. ఇది కేవలం కంటితుడుపు చర్య మాత్రమే. రెండవ జాతీయ లేబర్ కమిషన్ తన సిఫారసుల్లో ఈ బోనస్ పరిమితిని రు.2,500-రు.3,500 నుండి రు.3,500-రు.7,500లకు పెంచాలని సూచించింది. అసలు ఈ పరిమితే వుండరాదని కార్మిక వర్గం యావత్తూ ముక్త కంఠంతో డిమాండ్ చేస్తోంది.

పిఎఫ్ డిపాజిట్లపై 12% వడ్డీరేటు వుండాలి :

ప్రావిడెంట్ ఫండ్‌పై 12 శాతంగా వున్న వడ్డీ రేటును ప్రభుత్వం గత కొన్నేళ్ళుగా తగ్గిస్తూ ఇప్పుడు 8 శాతానికి కుదించింది. దీనివల్ల ప్రధానంగా నష్టపోయేది కార్మికులే. సంపన్నులకు కోట్లాది రూపాయల పన్ను రాయితీలు కల్పిస్తున్న ప్రభుత్వం కార్మికులను మాత్రం నిలువునా దగా చేస్తోంది. ప్రభుత్వం ఎన్ని రాయితీలిచ్చినా కొత్తగా పెట్టుబడులు వచ్చిందీ లేదు. ఉద్యోగావకాశాలు పెరిగిందీ లేదు. ఈ రాయితీలు యజమానులు మరిన్ని లాభాలు ఆర్జించేందుకు మాత్రమే ఉపయోగపడుతున్నాయి.

పైన పేర్కొన్న ఈ ఉమ్మడి డిమాండ్ల సాధన కోసం వివిధ పరిశ్రమలు, ప్రాంతాలు, రాష్ట్రాల్లోని కార్మిక సంఘాలన్నీ కలిసి సమిష్టిగా పోరాటం సాగించాలి. ఈ పోరాటాలన్నిటి పతాక సన్నివేశంగా మే 21న సార్వత్రిక సమ్మె నిలుస్తుంది. గనిలో, వనిలో, కార్ఖానాల్లో, ఆఫీసుల్లో, వ్యవసాయ క్షేత్రాల్లో పనిచేసే కార్మికులంతా వచ్చి ఈ ప్రధాన పోరాట స్రవంతిలో కలవాలి. కేంద్ర ప్రభుత్వం తన వినాశకర విధానాలను పునఃపరిశీలించుకునేలా కార్మికోద్యమం కలిసికట్టుగా ఒత్తిడి తేవాలి.

(వర్కింగ్ క్లాస్ సౌజన్యంతో)



మే డే ప్రతిజ్ఞ

☆ సామ్రాజ్యవాదాన్ని ఎదిరిద్దాం !

☆ పాలకుల ఆర్థిక, రాజకీయ విధానాలను ఓడిద్దాం !!

☆ మే 21 సమ్మెను జయప్రదం చేద్దాం

కార్మికవర్గ పోరాటాలకు సంబంధించినంత వరకు ప్రతి మేడేకు ఒక చారిత్రక ప్రాధాన్యత ఉం(టుం)ది. సామ్రాజ్యవాదం, ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదం బరితెగించి స్వతంత్ర దేశాలపై ఆక్రమణలు చేస్తున్న సమయం. మన దేశ పాలకులు ఆ అమెరికా మద్దతుతోనే నగ్నంగా పెట్టుబడిదారి అనుకూల విధానాలు అవలంబిస్తున్న నేపథ్యంలో 2003 మేడే అత్యంత కీలకమైనది. సామ్రాజ్యవాదాన్ని దానికి అనుకూలంగా వ్యవహరిస్తున్న భారత పాలక వర్గాలను ఎదిరించి ఓడిస్తామని, మనలాగే ప్రపంచవ్యాపితంగా తీవ్ర పోరాటాల్లో వున్న కార్మిక వర్గానికి, ఇతర కష్టజీవులకు సంఘీభావంగా నిలుస్తామని ప్రతిజ్ఞ తీసుకోవాలి. అందులో భాగంగా జరుగు మే 21 సమ్మె జయప్రదానికై కృషి చేయాలి.

బరితెగించిన అమెరికా కొమ్ములు విరగ్గొట్టండి!

ప్రపంచ వింతలు ఎన్ని అని గతంలో ఏ విద్యార్థినైనా అడిగితే టక్కున ఏడు అనేవాడు. ఇక నుండి ఆరే అనాలి. Hanging Gardens of Babylonia ఇరాక్‌పై అమెరికా దాడిలో నాశనం అయిపోయింది. మూడువారాల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన బాంబుల వర్షంలో (దీనికి అమెరికా పెట్టుకున్న ముద్దపేరు కార్పెట్ బాంబింగ్) 6, 7 వేల సం॥ల నాగరికతా చిహ్నాలు నేలమట్టమయి పోయాయి. 20వ శతాబ్దిలో మొట్టమొదటి స్వతంత్ర దేశంగా అవతరించిన ఇరాక్ 21వ శతాబ్దిలో మళ్ళీ వలస దేశంగా మారిపోయింది.

అంతర్జాతీయ సూత్రాలను, వాటిని అమలు జరిపే ఐక్యరాజ్య సమితిని అటకెక్కించింది. తాను నూక్లియర్ ఆయుధాల పర్వతాల మీద కూర్చొని, ఇరాక్ వద్ద మారణాయుధాలున్నాయి కాబట్టి, సద్దాం నియంత కాబట్టి ఆదేశం పై దాడి చేస్తానని గత కొన్ని నెలలుగా బెదిరించిన అమెరికా చివరికి అంత పనీ చేసింది. ఐక్యరాజ్య సమితి ఆయుధ తనిఖీ బృందం ప్రధాన అధికారి హన్స్‌బ్లిక్స్ ఇరాక్‌లో తమకు రసాయన ఆయుధం జాడ కన్పడలేదని చెప్పినా, బుష్ సామ్రాజ్య విస్తరణ కాంక్ష ముందు వినబడలేదు. ప్రపంచ ఆయిల్ నిల్వల్లో రెండవ స్థానంలో వున్న ఇరాక్‌ను ఆక్రమించు కోవటమే ప్రధాన లక్ష్యంగా ఈ దాడి సాగింది. రిటైర్డ్ సైనిక అధికారి మేజర్ జనరల్ జేగార్నర్‌ను తాత్కాలిక గవర్నర్‌గా నియమించింది. అమెరికా యుద్ధ రాకాసికి వందల కోట్ల డాలర్ల ఆయుధాలు అందించే “ఎల్-3 కమ్యూనికేషన్స్” సంస్థకు ఈగార్నల్ గారు ప్రధాన అధికారి కావటం కూడ ఈ నియామకానికి ముఖ్యకారణం.

పాఠశాలలో, ఆస్పత్రులు, నీటి సరఫరా వ్యవస్థలు మొ॥న వాటిని దెబ్బతీయకూడదన్న అంతర్జాతీయ సూత్రాలను అమెరికా కాలదన్ని, అమాయక పౌరులను ముఖ్యంగా స్త్రీలను పిల్లలను వధించింది.

ముఖ్యంగా మూడవ ప్రపంచదేశాలు అందునా ఆయిల్ వంటి ఇంధన నిక్షేపాలున్న దేశాలను కొల్లగొట్టడం నేటి ఏకధృవ ప్రపంచంలో అమెరికాకు సర్వసాధారణం అయిపోయింది. 80వ దశకంలో ఇరాన్, ఇరాక్ యుద్ధంలో సద్దాం కొమ్ముకాయడానికి అదే కారణం. సుమారు లక్ష మంది కుర్దులను సద్దాం ఊచకోత కొస్తుంటే అతనికి మరిన్ని ఆయుధాలిచ్చి సహకరించింది అందుకే. 1940వ దశకంలో ఇజ్రాయిల్‌ను సృష్టించిందే అందుకు. ఇటీవల వెనిజులాలో నేరుగా జోక్యం చేసుకుంది కూడ ఆ కారణంగానే. తన ఆయిల్ బేహారుల దాహం తీరాలంటే ప్రపంచంలోని ఆయిల్ నిక్షేపాలన్నీ తన అధీనంలో ఉండాలని అమెరికా అకాంక్ష. ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో 2001 చివర్లో ఆఫ్ఘనిస్తాన్‌ను ధ్వంసం చేసింది.

అమెరికా దుర్నీతిని ఆదేశ ప్రజల్లో సహా లక్షలాది మంది ప్రపంచ వ్యాపితంగా ఖండించారు. గతంలో ఎప్పుడూ లేనంత నగ్నంగా అమెరికన్ పాలకులు ఎక్స్‌పోజ్ అయ్యారు. బిన్‌లాడెన్ అయినా, సద్దా హుస్సేన్ అయినా అమెరికాకు మిత్రులుగా ఉన్నంతకాలం వారు ఎన్ని దుర్మార్గాలు చేసినా అమెరికా పాలకులకు ఆనందంగాఉంది. తమకు ఎదురు తిరగినపుడే వారు నియంతలని, దుర్మార్గులని, వారి వద్ద రసాయన ఆయుధాలున్నయని చెప్పటాన్ని యావత్ ప్రపంచం అసంహ్యించుకుంటోంది. కార్మికవర్గంలో సామ్రాజ్యవాద వ్యతిరేక తత్వాన్ని రేగ్గొట్టడానికి ప్రతి సిఐటియు కార్యకర్త కృషి చేయాలి.

జాతి వ్యతిరేక విధానాలను ఓడిద్దాం!

ప్రైవేటీకరణకు, అంటే వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఎంపిక చేసిన కొందరు పెట్టుబడి దారులకు కారుచౌకగా కట్టబెట్టేందుకు ఒక మంత్రినే కేటాయించిన ఘనత ఈ భూమండలంలో ఒక్క బిజెపి ప్రభుత్వానికే దక్కింది. మంచి లాభాల్లో వున్న కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఏ విధంగా ప్రైవేటీకరిస్తున్నారో బాల్కో, విఎస్ఎన్ఎల్ వంటి కేసుల్లో చూశాం. జాతి సంపదను కొందరు పెట్టుబడిదారులకు కట్టబెట్టే హక్కు ఈ ఎన్డీఏ ప్రభుత్వానికి ఎవరిచ్చారు? ఈ విధానాలను కార్మికవర్గం తిప్పికొట్టాలి.

అటు కేంద్ర ప్రభుత్వం, ఇక్కడ మన రాష్ట్ర ప్రభుత్వం రెండూ పెద్దయెత్తున ప్రభుత్వ శాఖల కుదింపుకు పూనుకుంటున్నాయి. గీతాక్రిష్ణన్ కమిటీ, గంగోపాధ్యాయ కమిటీ వంటివి అందుకనుగుణంగా సిఫార్సులిస్తున్నాయి. ప్రపంచబ్యాంకు వత్తిడి ఉండనే ఉంది. 31.3.2002 నాటికి కేంద్ర ప్రభుత్వరంగ పరిశ్రమల్లో 4.23 లక్షల మంది విఆర్ఎస్‌పై బయటికి పంపబడ్డారని ఇటీవల కేంద్ర మంత్రి ప్రకటించారు. బ్యాంకులు, ఇతర కేంద్ర ప్రభుత్వ శాఖల్లో వేలాది మంది ఉద్యోగులు బయటికి నెట్టబడ్డారు.

కొనసాగింపు 21వ పేజి...

డాక్టర్... డాక్టర్...

వడదెబ్బ

శరీరంలో ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించే వ్యవస్థలో వచ్చే తీవ్రమైన అలజడే వడదెబ్బ. దీన్నే హీట్‌స్ట్రోక్ లేదా సన్‌స్ట్రోక్ అని అంటారు.

ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు, ఆ ఎండల్లో శరీరంపై ధ్యాస లేకుండా తిరిగినప్పుడు వడదెబ్బ తగులుగుతుంది. ఒక్కోసారి పడగాడ్పులు వీస్తూ ఉంటాయి. వాటిని గమనించలేకపోతాం. బరువైన శారీరక శ్రమతో కూడిన వృత్తిపరమైన పనులు అధికంగా చేయడం, ఇలాంటి వాతావరణానికి అలవాటుపడే విధానాన్ని అలవాటు చేసుకోలేకపోవడం, చర్మంపై రక్తనాళాలు బాగా వ్యాకోచం చెందడం, శరీరం ఆ కుదుపును తట్టుకోలేక రక్తప్రసరణ వ్యవస్థ నీరసించడం వంటి కారణాల వల్ల వడదెబ్బ తగులుతుంది. ఈ వడదెబ్బ ఎక్కువగా సమశీతోష్ణ వాతావరణంలో తగులుతూ ఉంటుంది.

శీరరంలో నీటి శాతం తగ్గి, అధికంగా చెమటరావడం వల్ల గుండె, ఊపిరితిత్తుల మధ్య జరిగే ప్రసరణ వ్యవస్థలో సమతుల్యం దెబ్బతిని శరీరమంతా జరిగే రక్తప్రసరణ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటే సీరియస్ అయి రోగి ప్రమాదంలో చిక్కుకొంటాడు.

వడదెబ్బ లక్షణాలు :

ఇది ఒక్కసారిగా వస్తుంది. నీరసం, తలనొప్పి, బుర్రతిరగడం, జ్వరం, కళ్ళు తిరగడం, దప్పికతో నోరు ఆర్చుకుపోవడం, కాళ్ళు చేతులు పట్టేయడం, వాంతి వచ్చినట్లు ఫీలింగ్, గుండెదడ, చెమట కారి కారి నెమ్మదిగా శరీరం వేడి ఎక్కడం, కంటిపాపలు (ప్యూపిల్స్) తొందరగా ముడుచుకొని నెమ్మదిగా విచ్చుకోవడం, నాడి వేగం బాగా పెరిగి 160 దాకా వెళ్ళడం, ఊపిరితిత్తుల వేగం 20-30 దాకా వెళ్ళడం, అలాగే రక్తపోటు కొద్దిగా పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇందులో కొన్ని లక్షణాలు ఉన్నా ఎండాకాలంలో అయితే వడదెబ్బ తగిలినట్టే!

జాగ్రత్తలు :

వడదెబ్బ తగిలిన వారికి నిద్ర సంబంధమైన మందులు ఇవ్వకూడదు. చెమటలు ఎక్కువగా పట్టేవారికి, వాంతులు, విచేచనాలు అయ్యేవారికి, అలాగే ఆల్కహాల్ బాగా తీసుకొనేవారికి కూడా వడదెబ్బ లాంటి లక్షణాలు కన్పిస్తాయి. కనుక వీరూ జాగ్రత్తగా ఉండాలి. ఉక్కపోతగా ఉన్నప్పుడు శరీరంలో ఉష్ణోగ్రత పెరగనప్పటికీ, వడదెబ్బ లక్షణాలన్నీ వుంటాయి. కాబట్టి అన్ని జాగ్రత్తలు పాటించాలి. వేసవిలో నగరాలలో అయితే-

రాత్రి వేళల్లో కూడా విపరీమైన రేడియేషన్ ఉంటుంది. ఇంటికి వచ్చాక చన్నీటి స్నానం చేసి, చందనాన్ని అరగదీసి వంటికి రాసుకొంటే రేడియేషన్ నుంచి ఉపశమనం పొందవచ్చు.

చల్లటి శీతల పానీయాల జోలికి వెళ్ళకుండా, నిమ్మరసం, పుదీనరసం, కొబ్బరినీరు లాంటివి తీసుకుంటే ఎంతో మేలు చేస్తాయి.

ఇలాంటి జాగ్రత్తలు పాటిస్తూ రోజూ మనం తీసుకొనే ద్రవపదార్థాలను క్రమపద్ధతిలో పెంచుతూపోవాలి. ద్రవపదార్థాలు తీసుకుని యూరిన్ కలర్ ఎలా వుందో గమనించాలి. యూరిన్ రంగు బాగా ముదురు పసుపుపచ్చగా వుంటే ద్రవపదార్థాలు సరిపోలేదని అర్థం. చిరాగ్గా ఉంటే శరీరం ఉక్కపోతకి లోనైందని అనుకోవాలి. ఇందుకు చన్నీటి స్నానం సరిపోతుంది. వీటికి తోడు మసాలా, వేపుళ్ళు మానేసి నీరు నిండిన కాయగూరలు, ఆకుకూరలు, పచ్చిపులుసు లాంటివి తీసుకుంటే అవి ఎంతో మేలు చేస్తాయి. ❖



డా॥ కె.ఎస్. నాయక్
M.D., D.N.B. (Neph.)
గ్లోబల్ హాస్పటల్

● నా వయస్సు 35 సంవత్సరాలు. బరువు 70 కిలోలు. ప్రతిరోజూ నాకు కాళ్ళు, చేతులు తీవ్రంగా లాగుతాయి. పెయిన్ కిల్లర్లు వేసుకుంటే ఆ రోజుకు బాధ తగ్గుతుంది. మళ్లీ మామూలే. ప్రతిరోజూ పెయిన్ కిల్లర్ల వాడటం మంచిది కాదని అంటున్నారు. నా సమస్యకు పరిష్కారం తెలపండి?

- రజనీ, కాకినాడ

✓ మీరు చెప్పిన లక్షణాలను బట్టిచూస్తే మీరు అధిక బరువు ఉన్నట్లు అనిపిస్తోంది. ప్రతిరోజూ బాగా కాళ్ళు లాగుతున్నాయంటే శరీరం మీద అధిక బరువు ఉన్నట్లు అనుమానించాలి. పోషకాలు, విటమిన్లు, సమతుల ఆహారం తీసుకోని వారిలో కూడా కాళ్ళు చేతులు లాగే అవకాశం ఉంటుంది. మధుమేహం, శరీరంలో క్యాల్షియం నిల్వలు తక్కువగా ఉండటం వల్ల కూడా ఇలాంటి సమస్యలు వస్తుంటాయి. మధుమేహంగానీ, ఇతరత్రా జబ్బులేమైనా ఉన్నాయేమో నిర్ధారించుకుని దానికి సరైన చికిత్స తీసుకోవాలి. ఎత్తుకు సరిపడా బరువు ఉండేలా చూసుకుంటూ, పోషకాలు, విటమిన్లతో కూడిన సమతులాహారం తీసుకుంటే కాళ్ళు చేతులు లాగటమేనే బాధ తగ్గిపోతుంది. రక్తపరీక్ష చేయించుకొని రక్తహీనత సమస్య ఉందేమో తెలుసుకోవాలి. బరువు అధికంగా ఉండి పనిభారం ఎక్కువగా ఉన్నా కూడా ఇలాంటి సమస్యలు వస్తాయి. పెయిన్ కిల్లర్లు చీటికీమాటికీ వేసుకోవడం మంచిది కాదు. వీటివల్ల ఆసిడిటీ ఎక్కువై జీర్ణ వ్యవస్థకు సంబంధించిన సమస్యలు మొదలవుతాయి. పెయిన్ కిల్లర్ల వల్ల మూత్రపిండాలు కూడా దెబ్బతినే అవకాశం ఉందని గుర్తించాలి.

● నేను గర్భవతిగా ఉన్నప్పుడు మధుమేహం వచ్చింది. బీపీ కూడా ఎక్కువగా ఉండటం వల్ల సిజేరియన్ చేసి బాబును తీశారు. రెండేళ్ళ క్రితం వరకు నాకు మధుమేహం లేదు. ప్రస్తుతం షుగర్ 186గా ఉంది. ఈ వ్యాధి లేకుండా ఉండానికి ఎలాంటి పద్ధతులు పాటించాలి? నా బిడ్డకు ఈ వ్యాధి సంక్రమించే అవకాశం ఉందా?

- మాధవి, హైదరాబాద్

✓ గర్భధారణ సమయంలో మధుమేహం వస్తే దాన్ని 'జెస్టేషన్ దయాబెటిస్' అంటారు. ఇలా గర్భవతిగా ఉన్నప్పుడు మధుమేహం వచ్చి కాన్పు తర్వాత తగ్గిపోయినట్లయితే కొంతకాలం వరకూ ఉండకపోవచ్చు. కానీ అయిదేళ్లలోపు మళ్లీ కనిపించి, జీవితాంతం ఉండిపోయే అవకాశం కూడా ఉంది. ఇలా వచ్చే మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవటానికి- ఆహార నియమాలు, వ్యాయామమే కాకుండా ఇన్సులిన్ ఇంజక్షన్ కూడా తీసుకోవాల్సి ఉంటుంది. అయితే తల్లికి మధుమేహం ఉన్నా ఆమెకు పుట్టే బిడ్డలకు దయాబెటిస్ వచ్చే అవకాశం చాలా తక్కువ. ఇది గర్భం ద్వారా సంక్రమించే జబ్బుగానీ, ఇన్‌ఫెక్షన్ గానీ కాదు. నిజానికి- జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు దయాబెటిస్ వచ్చే అవకాశం ఉన్నవాళ్లకి గర్భం దాల్చినప్పుడు అది ముందుగానే బయటపడుతుంది. ఇలాంటి వారు గర్భందాల్చకపోయినా కొన్నేళ్ల తర్వాతైనా మధుమేహం వస్తుంది. గర్భం దాల్చినప్పుడు మాయలో ఉండే హార్మోన్లు రక్తంలోని ఇన్సులిన్‌కు వ్యతిరేకంగా పనిచేస్తాయి. ఫలితంగా ఎప్పుడో రావాల్సిన వ్యాధి వెంటనే బయటపడుతుంది. ❖

మీరు కూడా మీ ఆరోగ్య సమస్యలను ఈక్రింది చిరునామాకు తెలియ జేయవచ్చు.

డాక్టర్-డాక్టర్

C/o.'కార్మిక లోకం' మాసపత్రిక

యన్.వి.బి. స్మారక కేంద్రం, 1-1-60/4, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్,
ముషీరాబాద్, హైదరాబాద్-20. ఫోన్: 7624502, 7612474

ఉద్యమ వార్తలు

లారీల సమ్మెకు డిసిఎంల మద్దతు

లారీల సమ్మెకు మద్దతుగా ఏప్రిల్ 16న హైదరాబాద్ వి.ఎస్.టి. ఏరియా మినిగూడ్స్ వెహికిల్స్ ఒనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి పార్క్ నుండి ఇందిరాపార్కు వరకు ప్రదర్శన నిర్వహించారు. ఇందులో సిఐటియు నగర ఉపాధ్యక్షులు జి.రాంబాబు కార్యదర్శి ఎం.శ్రీనివాస్, మినివెహికిల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ఎస్.ఖాన్ ప్రసంగించారు. లారీ మోటార్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి కె.నర్సింగరావు నాయకులు గెలయ్య, మణీంద్ర, రాజు, రసూల్ ఖాన్, సయ్యద్ అస్లమ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలి.

కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని మార్చి 2న ఖమ్మం జిల్లా కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కోడేల శివప్రసాద్‌కు వినతిపత్రం అందేజేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సింగు నరసింహరావు, ఎ.జె.రమేశ్, డా॥కొప్పిశెట్టి సురేష్ తదితరులు ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు.

పి.ఎఫ్.పై వడ్డీ రేటు తగ్గించరాదు

ప్రావిడెంట్ ఫండ్ (పి.ఎఫ్) పై వడ్డీ రేటును తగ్గించవద్దని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు ఏప్రిల్ 16న హైదరాబాద్ కాచిగూడ పి.ఎఫ్ కార్యాలయం ముందు ధర్నా చేశాయి. ఈ ధర్నాలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, హెచ్ఎంఎస్, యుటియుసి (ఎల్.ఎస్) తదితర సంఘాల నాయకులు ప్రసంగించారు.

పి.ఎఫ్. పై ప్రస్తుత వడ్డీరేటు 9 శాతం నుండి 8 శాతంకు తగ్గించాలన్న కేంద్ర ప్రభుత్వ యోచనను మానుకొని 12 శాతానికి పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. యాజమాన్యం ఖాతకు జమ చేయకుండా దిగమింగిన సొమ్ము పై కట్టాల్సిన అపరాధపు వడ్డీలను, పరిహారాలను మాఫీ చేయాలన్న కార్మికశాఖ నిర్ణయం వల్ల 250 కోట్లు రూపాలను కార్మికులు నష్టపోతారని వారు తెలిపారు. ఇ.పి.ఎఫ్. నిధులను కార్మికశాఖ దుర్వినియోగం చేస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక ప్రతినిధులతో సిఐటియు, ఎఐటియుసి సంఘాలకు ప్రాతినిధ్యం లేకుండా చేశారని వారు విమర్శించారు. ధర్నాలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్.సుధాభాస్కర్, నగర అధ్యక్షులు ఎస్.నర్సింహ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జె.వెంకటేశ్, కార్యదర్శులు ఎస్.శ్రీనివాస్, జె.కె.శ్రీనివాస్, ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటి కార్యదర్శి చంద్రశేఖర రావు నగర కార్యదర్శి వి.ఎస్.బోస్, హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు నాయిన నర్సింహరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎన్.సుందరేషన్, ఐఎఫ్‌టియు నగర కార్యదర్శి సురేష్, యుటియుసి(ఎల్ఎస్) నగర కార్యదర్శి కె.సుధీర్‌లు పాల్గొని ప్రసంగించారు.

పోలీసుల, ప్రైవేట్ బస్సు యజమానుల జులూం



మన రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వరంగమైన ఎపిఎస్ఆర్టీసి ని ప్రైవేటుపరం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నది. అందుకు ప్రపంచబ్యాంకు వత్తిడి చేస్తున్నది.

ఈ దశలో ఆర్టీసి ఆదాయానికి గండికొడుతూ ఎలాంటి లైసెన్స్‌లు లేకుండా అక్రమంగా తిరుగుతున్న ప్రైవేట్ బస్‌లను స్టాఫ్ & వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు కార్యకర్తలు రాష్ట్రమంతా అడ్డుకున్నారు. హైదరాబాద్‌లో హయత్‌నగర్ వద్ద ఉద్యమ కారులపై పోలీసు పాశవికంగా లాఠీచార్జి చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య చెయ్యి విరిగింది. రాష్ట్ర నాయకులు బోగేశ్వరరావు తలపగిలింది. మరో నాయకుడు కె.పార్థసారధి గుండెపోటు వచ్చి ఆస్పత్రి పాలయ్యాడు. అనేక మందికి గాయపరిచారు. మహిళ కండక్టర్ల పట్ల పోలీసు అమానుషంగా ప్రవర్తించారు.

విజయవాడలో ప్రైవేట్ బస్ యాజమాన్య గుండాలు వుద్యమకారులపై కూడా బస్‌లు నడిపారు. సాహెబ్ తృటిలో ప్రాణాపాయం నుండ బయటపడ్డారు. పోలీసు అక్రమంగా లాఠీచార్జ్ జరిపి సిఐటియు జిల్లా నాయకులు ఆర్.రఘు, మాదాల వెంకటేశ్వర్లు, విష్ణు, దుర్గారావులను అరెస్టు చేసి ఈ సాయంత్రం వరకు విడుదల చేయలేదు.

ఈ అక్రమాలపై న్యాయవిచారణ జరిపించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాము.

❖

లేబర్ ఆఫీసు ముందు ధర్నా

తమ సమస్యలను పరిష్కరించాలని ట్రావెల్ కార్మికులు ఏప్రిల్ 16న హైదరాబాద్ లేబర్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఇందులో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి భూపాల్, నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌రెడ్డి, యూనియన్ నాయకులు కె.నర్సింగరావు పాల్గొన్నారు.



మేడే ప్రతిజ్ఞ (6 పేజీ తరువాయి భాగం)

మన రాష్ట్రంలో ఇప్పటికి 30 వేల మంది ఉపాధి కోల్పోయారు.

ఇవిగాక కేంద్ర ప్రభుత్వ విధానం వల్ల ఇతర దేశాల సరుకులు మన దేశంలోకి వెల్లువెత్తడం వల్ల వేల సంఖ్యలో పరిశ్రమలు మూతబడ్తున్నాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రతి సమావేశంలోనూ పారిశ్రామిక దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాలను దెబ్బతీస్తున్నాయి. క్లింటన్ భారతదేశ పర్యటన సందర్భంగా 1429 రకాల సరుకులపై పరిమాణాత్మక ఆంక్షలను మన ప్రభుత్వం ఎత్తి వేసింది. గడచిన రెండు సం॥ల కాలంలో ఇతర దిగుమతులు తగ్గగా, ఈ 1429 సరుకుల దిగుమతి 336% పెరిగింది. ఇవన్నీ ప్రధానంగా వ్యవసాయాధార పరిశ్రమలకు చెందినవి. వ్యవసాయ ఉత్పత్తులు అధికంగా వున్నాయి. గత రెండు సం॥ల్లో పెరిగిన రైతుల ఆత్మహత్యలకు, ఇదే ప్రధాన కారణం. ఈ పరిశ్రమల మూసివేతల వల్ల లక్షల సంఖ్యలో కార్మికులు నిరుద్యోగులౌతున్నారు.

ఒకప్రక్క కొత్తగా ఉద్యోగాలు రాకపోవటం, మరో ప్రక్క మూసివేతలు, రిట్రెంచ్‌మెంట్ల వల్ల ఉపాధి కోల్పోయిన కార్మికుల సంఖ్య పెరగటంతో పరిస్థితి దారుణంగా తయారౌతున్నది. తాజా ఎకనామిక్ సర్వేలో ప్రభుత్వరంగంలో ఉపాధి 0.9 శాతం తగ్గిందని ప్రైవేటురంగంలో 0.1.% మాత్రం పెరుగుదల ఉందని పేర్కొన్నారు.గ్రామీణ ఉపాధి అవకాశాలు ఇంకా దిగజారాయి. దీంతో పెద్దయెత్తున పట్టణాలకు వలసలు పెరిగాయి. దీంతో అసంఘటిత కార్మికుల జీవన ప్రమాణం ఇంకా దిగజారింది.

కార్మికోద్యమంపై దాడిని త్రిప్పికొడ్దాం!

పారిశ్రామిక వివాదాల చట్టానికి, కాంట్రాక్టు లేబర్ చట్టానికి యాజమానులకు అనుకూలంగా సవరణలు తెస్తున్నారు. ఆంధ్ర రాష్ట్ర అసెంబ్లీ మొన్నటి బడ్జెట్ సమావేశాల్లో కాంట్రాక్టు కార్మిక చట్టాన్ని సవరించింది. మొత్తం మీద విచ్చలవిడిగా కార్మికుల హైర్ అండ్ ఫైర్‌ను అనుమతించే ఈ చర్యలను ఐక్యంగా తిప్పికొట్టాలి. ఎక్కడ పడ్తే అక్కడ కాంట్రాక్టు కార్మికులను వినియోగించుకునేందుకు రంగం సిద్ధం అయ్యింది.

సంఘటిత రంగ కార్మికులకు బోనస్ చట్టం నిరుపయోగం అయ్యింది. సీలింగులను పెంచాలని ఎప్పట్నించో కార్మికోద్యమం చేస్తున్న డిమాండ్ చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లయింది. తాజాగా రెండవ లేబర్ కమిషన్ బోనస్ సీలింగ్‌ను రూ.2500 నుండి రూ.3500 కు పెంచాలనీ, జీతం అర్హతను రూ.3500 నుండి రూ.7500కు పెంచాలని చేసిన సూచనను సైతం పెట్టుబడిదారులు అంగీకరించక అమలు చేయటం లేదు. ఈ కాలంలో ఒక ముఖ్యమార్పు ఏమంటే త్రైపాక్షిక వేదికలను పాలకులు నీరుగార్చటం. మన రాష్ట్రంలో ఇంప్లిమెంటేషన్ అండ్ ఇవాల్యుయేషన్ కమిటీ వంటివి ఉన్నాయనే విషయమే పాలకులు మర్చిపోయారు. ఇటీవల చేసిన సవరణతో కాంట్రాక్టు కార్మిక సలహా బోర్డు రద్దయిపోయింది. కనీసవేతనాల బోర్డును తెలుగుదేశం నాయకుల వేదికగా మార్చారు. కేంద్రంలోనూ దాదాపు ఇదే స్థితి. ఇటీవల ఇపిఎఫ్ సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్ (సిబిటి) లో తమ తరుపున ఎవరు సభ్యులుగా ఉండాలో నిర్ణయించే అధికారం యూనియన్లకు లేదని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. లక్ష కోట్ల రూ॥లకు పైగా వున్న ఇపిఎఫ్ సొమ్మును షేర్ మార్కెట్‌కు తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఇందుకు అడ్డుగా వున్న సిఐటియు ప్రతినిధిని తప్పించి సిబిటిని పునర్నిర్మించింది. కార్మికుల భాగస్వామ్యం కూడా ఉండటంతో ఇంత పెద్ద మొత్తం ఎటువంటి స్కాంలు లేకుండా సమర్థవంతంగా నడుస్తోంది. భవిష్యత్‌లో అదీ ప్రమాదంలో పడ్తుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాల్లో తలపెట్టిన మార్పులను కార్మికోద్యమం గట్టిగా ప్రతిఘటించాలి. లేకుంటే దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న హక్కులు హరించుకుపోతాయి.

అతి దుర్మార్గమైన రెండవ లేబర్ కమిషన్ సిఫార్సుల అమలుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం అవుతున్నది. కార్మికవర్గం అప్రమత్తంగా ఉండి ఆ ప్రయత్నాల్ని త్రిప్పికొట్టాలి.

మతోన్మాదాన్ని ఎదిరిద్దాం!

బిజెపి క్రమంగా తన ముసుగు తొలగించుకుని అసలు రంగుతో బయటపడింది. గత 4 సం॥లుగా ఎన్డీఏ ఎజెండా అంటూ నాటక మాడింది. గుజరాత్ "ప్రయోగం" విజయవంతం అవటంతో హిందుత్వ నినాదాన్ని బహిరంగంగా సమర్థించుకుంటున్నది. ప్రవీణ్ భాయ్ తొగాడియా, అశోక్ సింఘాల్ వంటి వారు దేశంలోని కోర్టులు, చట్టాలు తమకేమీ వర్తించవన్నట్లు ప్రవర్తిస్తున్నారు. త్రిశూలాలు, గ్రండగొడ్డళ్ళు యథేచ్ఛగా పంపిణీ చేస్తున్నారు. 10 లక్షల మందితో సైన్యం ఏర్పాటు చేస్తామని ప్రకటిస్తున్నారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం మళ్ళీ ఎజెండా మీదికొచ్చింది. ఇరాక్‌పై అమెరికా దాడిని కేవలం ముస్లింలకు వ్యతిరేకంగా జరిగే యుద్ధంగా వీరు పరిగణించి దాన్ని బలపరుస్తున్నారు.

గుజరాత్ మారణకాండ ముస్లింలలో అభద్రతా భావాన్ని పెంచింది. క్రమంగా ముస్లిం మతోన్మాదం కూడా పెరుగుతున్నది. హిందూపుర్ ఘటన దాని పర్యవసానమే. ఈ రెండు మతోన్మాదాల యెడల కార్మికవర్గం జాగ్రత్తగా ఉండాలి. లేకుంటే ఆర్థిక విధానాల వ్యతిరేక పోరాటం బలహీనపడ్తుంది. చాపక్రింద నీరులా విస్తరిస్తున్న మతోన్మాద శక్తులను ప్రతి సిఐటియు కార్యకర్త అప్రమత్తులై ఎదిరించాలి.

పై కర్తవ్యాల సాధనలో ఒక కీలక ఘట్టం మే 21 అఖిల భారత సమ్మె కాంగ్రెస్ పాలనా కాలంలో జరిగిన సమ్మెలు అప్పట్లో ఆ ప్రభుత్వానికి ముకుతాడు వేశాయి. నూతన ఆర్థిక విధానాల వేగాన్ని ముఖ్యంగా కార్మికవర్గానికి సంబంధించినంత వరకు తగ్గించ గలిగాయి. బిజెపి పాలన మొదలైన తర్వాత రెండు ప్రధాన రాజకీయ పార్టీలు (బిజెపి, కాంగ్రెస్) కూడ ..... విధానాలను వేగంగా అమలు చేస్తున్నాయి. జనరల్‌గా పాలక పార్టీలన్నింటి మధ్య ఈ ఆర్థిక విధానాల అమల్లో ఐక్యత ఉంది. అందుకే కార్మికవర్గం నడుంబిగించాలి. ఇతర కష్టజీవుల్ని ఐక్యం చేయాలి.

ఆ ప్రస్థానంలో మే 21 సమ్మె ఓ మెట్టు. సమ్మెలో లేని కార్మికుల్ని సైతం ఒప్పించాలి. అఖిల భారత సమ్మెను పెద్ద ఎత్తున జయప్రదం చేయాలి.

– ఆర్.సుధాభాస్కర్

శ్రద్ధంజలి



ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య మృతికి 'కార్మికలోకం' ... సంతాపాన్ని ప్రకటిస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటుకు, సమైక్య రాష్ట్రం కోసం, రాష్ట్రంలో గ్రంథాలయ ఉద్యమ విస్తరణలోను, పెద్దయెత్తున జరిగిన సారా, మద్యపాన నిషేధం కోసం జరిగిన ఉద్యమలలోనూ ప్రముఖపాత్రను పోషించారు. తెలుగుతల్లి ముద్ద బిడ్డలో ఆయన ఒకరు.

కథ

మసిబారిన బాల్యం

రాంనగర్ చౌరస్తా నుంచి పార్సీగుట్టకు పోయే రోడ్డు ఇటు హిందువుల స్మశాన వాటిక, అటు పార్సీల స్మశాన వాటిక. ఈ రెండు స్మశానాలకు వేరు చేసే రోడ్డు వారగా కాటికాపరుల మల్లే సైలెన్సర్లు కాలుస్తూ ఇద్దరు పిల్లలు కనిపిస్తారు. వారి పేర్లు ఆదిల్, రబ్బానీ.

"చేతక్, లూనా, ఆటో, కెనెటిక్ హోండా.." అంటూ తాము చేసే పనేమిటో చెప్పేందుకు స్మశానపు గోడపై ఉన్న బోర్డు మీది అక్షరాలను చదివి చెబుతున్నాడు పదేళ్ల ఆదిల్. అతని మాటలను మధ్యలోనే కట్ చేస్తూ "అవన్నీ అక్కడ రాసుకున్నాయా?" అడిగాడు రబ్బాని విసుగ్గా.

"లేవా" ఒకింత విస్మయంగా అడిగాడు ఆదిల్.

"లేవు" అన్నట్లు తల పంకించి బట్టీలోంచి చేతక్ సైలెన్సరును ఒడుపుగా బయటికి లాగేసాడు రబ్బాని. ఇతనికి పదిహేనేళ్లు.

ఇంతకీ ఆ బోర్డుపై ఉన్నదేమిటి?

'అన్ని రకముల సైలెన్సర్లు కాల్చబడును' అని. అంతే!

తనకి చదవడం రాదనే సంగతి తేలిపోవడంతో ఆదిల్ కొంచెం నొచ్చుకున్నాడు.

ఆయిల్ మరకలతో నల్లబారిన ప్యాంటు జేబులో చేతులు దోపుకున్న ఆదిల్ "నాకూ చదువుకోవాలని ఉంది" అన్నాడు మెల్లగా.

"బడికి పోవాలని ఉంటుంది గానీ మా ఇంట్లో పంపరు" అని విరక్తిగా చెప్పాడు. వాళ్ల నాన్న టైలరట. ఆదిల్‌కు తమ్ములు, చెల్లెలు ఉన్నారట.

రబ్బాని వాళ్ళ నాన్న ఫ్యాన్లను బాగు చేస్తాడట. అతనికి తమ్ములు, చెల్లెండ్లు అని కూడా ఆదిల్ చెప్పాడు.

మీ అమ్మ కూడా ఏదైనా పని చేస్తుందా? అంటే, కడుపుల ఏమైనా పడాలంటే అమ్మ ఇంట్లో ఉండాలి కదా! అన్నాడు.

మేం మాట్లాడుకోవడం ఏమాత్రం ఇష్టం లేదన్నట్లు రబ్బాని గ్లేర్‌ని వేగంగా తిప్పసాగాడు. రబ్బాని తిప్పుతున్న వేగానికి బట్టిలోని బొగ్గులు ఖణఖణమని మండుతుంటే సైలెన్సరులోని ఆయిల్ కరిగి పొగలు పైకి చిమ్ముతున్నాయి.

"రబ్బానీ!.. నువ్ సైలెన్సర్లని ఎప్పటినుంచి కాలుస్తున్నావు" అడిగాను.

"యాడాదైంది" చెప్పాడు.

"మరి ఆదిల్"

ఈ మధ్యనే"

"ఇది వరకు ఇక్కడ పనిచేసే పిల్లలు ఏమైనారు?"

"వాళ్లని తీసేసారు. మేం చేరాము"

"మీ ఓనరు ఎవరు?"

"పాషా"

"ఎక్కడుంటాడు?"

"పార్సీగుట్ట చౌరస్తా దగ్గర. అక్కడ మెకానిక్ షాపు ఉన్నది"

"మీకెంత కూలీ ఇస్తాడు?"

ఈ ప్రశ్న అడిగేసరికి రబ్బాని ఒక్కక్షణం ఆగాడు. ఇంతలో ఆదిల్ ముందుకు వచ్చి "నాకు రోజుకు పది రూపాయలు, రబ్బానికి ఇరవై ఐదు రూపాయలు ఇస్తాడు" అని చెప్పాడు.

"పొద్దున పదకొండుకు వచ్చి పని మొదలు పెట్టాలి. ఆరింటికి పోవాలి. ఇంటికి పోయేటప్పుడు పైసలు ఇస్తాడు"

"అవును" అన్నట్లు తల ఊపాడు రబ్బాని.

*****

"ఇంతకి సైలెన్సర్లు ఎందుకు కాలుస్తారో చెబుతావా?" అడిగాను

"సైలెన్సరు మంచిగ ఫైర్ కావడానికి కాలుస్తం" ముక్తసరిగ చెప్పి ఊరుకున్నాడు రబ్బాని.

"మరికొంచెం" బతిమాలినట్లు అడిగాను.

"సైలెన్సర్‌లో ఆయిల్ నిండితే బండి ఉరకదు. పికప్ పడిపోతది. అందుకని వాటిని కాలుస్తం. ఆయిల్ కార్బన్‌గా సైలెన్సర్లకె పోతది. సౌండు కంట్రోలు చేసేందుకు సైలెన్సర్లల్ల ఫిల్టర్లుంటాయి. ఈ ఫిల్టర్లనే మఫ్లర్లని కూడా అంటారు. మఫ్లర్లకు రంధ్రాలుంటాయి. బండి నడువంగ నడువంగ ఆయిల్ నిండి ఈ రంధ్రాలు మూసుకుపోతాయి. పికప్ తగ్గిపోతుంది. అందుకే వాటిని కట్ చేసి కాలుస్తాం. క్లీన్ చేసి, వెల్డింగ్ చేసి ఫిట్ చేస్తాము. అదంతా మా ఓనరు చూసుకుంటాడు. మేం బట్టీమీద సైలెన్సర్లను కాల్చి క్లీన్ చేసిస్తాం. అంతే.."

మళ్లీ ఏం జ్ఞాపకం వచ్చిందో ఏమో.. "మూడుసార్లు కాలిస్తే సైలెన్సరు లైఫ్ అయిపోతది' అని చెప్పాడు



రబ్బాని.

ఇంతకీ వీర్ల సరంజామా స్వల్పమే. ఒక గుల్లేర్, ఇనుప రేకులతో తయారు చేసిన బట్టీ- దాని డోర్, కూర్చోవడానికి ఇనుప కుర్చీ చిమ్టా, పట్టీ, బొగ్గులు, అగ్గిపెట్టె, నీళ్లక్యాను-వీటన్నింటినీ వేసుకపోవడానికి ఒక తోపుడు బండి- ఇవీ ఈ పిల్లల సరంజామా!

ఒక హిందీ పాటను హమ్ చేసుకుంటూ గెల్లేర్‌ను మళ్ళీ వేగంగా తిప్పసాగాడు రబ్బాని. ఆ వేగానికి బొగ్గులోంచి మంటలు నాల్కలు చాపుతూ సైలెన్సర్లను ఆక్రమించసాగాయి. అది చూసిన ఆదిల్ బట్టీపై ఉన్న సైలెన్సరు విడిభాగాల మూతుల్లోకి బట్ట పీలికలను బట్టీలో దూర్చ సాగాడు. తీవ్రమైన వేడిమి వల్ల ఆ బట్ట పీలికలు వెంటనే బొగ్గు అంటుకుని మండిపో సాగాయి. సైలెన్సర్లు వేడిమికి కాగికాగి అందులోని నల్లటి ఆయిల్ బట్టీలోని బొగ్గులపై కారుతుంటే సుయ్.. సుయ్ మని శబ్దం రాసాగింది.

“సైలెన్సరు లోపలున్న ఆయిల్ కరిగి పోయేందుకే ఇలా బట్టపీలికలను వాడుతాము” తనలో తాను అనుకున్నట్లు చెప్పాడు ఆదిల్.

ఆదిల్ మాటి మాటికి చిమ్మాను చేతుల్లోకి తీసుకుని బట్టీలోని సైలెన్సరుని అటూ ఇటూ కదుపుతున్నాడు. సైలెన్సరు అన్ని భాగాలకు మంట తగిలేలా జాగ్రత్త తీసుకుంటున్నాడు. అకస్మాత్తుగా చిమ్టాను కిందకు విసిరేస్తున్నాడు. రెండు మూడు సార్లు చూసాకగానీ అర్థం కాలేదు. బట్టీ వేడిమి ఆదిల్ లేత చేతులని కాలుస్తోందని.

రబ్బాని మజీద్‌కు పోతాడు తెలుసా? అన్నాడు ఆదిల్.

“అవునా?” అడిగాను, అవును అంటూ “పొద్దున, రాతిరి మజీద్‌కు పోతాను.

“ఖురాన్ చదువుతాను” అన్నాడు.

“ఇక వేరే బడికి పోవా?” అడిగాను.

“ఎందుకూ” అర్థం కానట్టు అడిగాడు.

“చదువుకోవడానికి”

“ఖురాన్ చదివానుగా. ఇంకేం చదవాలి?” ఆశ్చర్యంగా అడిగాడు రబ్బాని.

నాకేం చెప్పాలో తెలియలేదు.

అదలా వుంచి “మరి ఈ పని బాగుందా?” అడిగాను మళ్లీ.

“.......”

మౌనమే సమాధానం.

నిజానికి వారికేం చెప్పాలో తెలియం లేదనిపించింది. ఇంతలో రబ్బానిని కుర్చీమీంచి లేపి ఆదిల్ గుల్లేర్‌ను తిప్పడానికి మారాడు.

రబ్బాని వయసులో ఆదిల్ కన్నా పెద్దవాడు. కాబట్టి ఏదైనా చెప్పాలంటే ఒకటికి పదిసార్లు ఆలోచించి మరీ చెబుతున్నాడు. ఆదిల్ హుషారుగా ఉన్నాడు. సమయం సాయంత్రం ఆరు కావస్తోంది. ఒక ఇంటికి వెళ్లడానికి బొగ్గులపై నీళ్ళు చిలకరించి ఆర్పుతున్నాడు. ఐదు నిమిషాల్లో అక్కడి సైలెన్సర్లు, సామానంతా తోపుడు బండిపై వేసుకుని యంజమాని షావుపైవు తోపుడు బండి నెట్టుకెళ్లసాగాడు రబ్బాని.

ఆదిల్ అక్కడే, నాతో మాట్లాడ్డానికా అన్నట్లు ఉన్నాడు.

దూరంనుంచి చేతిలో ఫ్లాస్కుతో “టీ...కాఫీ” అంటూ ఇరానీ కేఫ్ అబ్బాయి వస్తున్నాడు.

“సార్ ఛాయ్ తాగుదామా” అన్నాడు ఆదిల్.

“కాఫీ ఎప్పుడైనా తాగావా” అడిగాను

లేదన్నట్లు పెదవి విరిచాడు.

ఆ అబ్బాయిని రెండు కాఫీలు ఇవ్వమన్నాను.

ఇద్దరికీ ముందు రెండు ప్లాస్టిక్ కప్పులు ఇచ్చాడు. బ్రూ కాఫీ పొట్లం నుంచి ఆ కప్పుల్లో పౌడర్ చల్లి, ఫ్లాస్కులోంచి పాలు వంచాడు ఆ అబ్బాయి. మూడు రూపాయలు చేతిలో పెట్టగానే వెళ్లిపోయాడు.

ఒక్కగుక్క తాగి “సాబ్ కాఫీ మస్తుంది” అని పెదవులు చప్పరించాడు ఆదిల్. కాఫీ తాగగానే ఉత్సాహం ఎక్కువైందేమో “గిఫా..గిఫా” అంటూ గాలిలో పిడికిలి బిగించి కొడుతున్నాడు ఆదిల్.

“ఎవరిని కొడుతున్నావు?”

“మా ఓనర్ సాబ్‌ని” నవ్వుతూ అన్నాడు.

“ఎందుకూ?” అంటే, కుడిచేతిని వెనక్కు తిప్పి బెత్తెడంత గాయాన్ని చూపించాడు. ప్యాంటును పైకిలాగి మోకాలి వద్ద ఉన్న మరొక గాయాన్ని కూడా చూపించాడు.

“హోలీ తెల్లారి మా ఓనరు కొడుతుంటే తప్పించుకునేందుకు పరిగెత్తాను. కారుని తప్పించుకునేంతలో బజాజ్ చేతక్ కింద పడిపోయాను. ఇవీ దెబ్బలు మానుతున్నయి” చెప్పాడు ఆదిల్.

“ఎందుకు కొట్టాడు?” అడిగాను.

“రోజు కొడుతడు సార్. షర్బ్ తాగుతడు కదా!” అన్నాడు యధాలాపంగా.

“డిష్యూ..డిష్యూ..” ఈ సారి గాలిలో చేతులతోనే కాదు, కాళ్లతోనూ తంతున్నాడు.

నేనతన్నే చూస్తున్నానని గ్రహించి కాబోలు నవ్వేసాడు.

“నాకు తాకత్ బాగా వచ్చినంక, మీ అంత పెద్దయినంక పోలీసాఫీసరుని అయితను” అన్నాడు ఆనందంగా.

ఎందుకో నవ్వొచ్చింది. “సరే అయిదువులే” అంటూ ఆదిల్ భుజాన్ని తట్టి “నీ ఫోటోలు తీసుకోవడానికి రేపు వస్తాను” అని చెప్పి అక్కడినుంచి వెనుదిరిగాను.

*****

మరునాడు అక్కడికి వెళ్ళేసరికి పిల్లవాళ్లులేరు. ముప్పయేళ్ల యువకుడున్నాడు. అతను ఆ పిల్లల యజమాని- పాషా కొడుకు.

“పిల్లలను పని మాన్పించాము సార్. వాళ్లు బడికిపోతున్నారు. నేనూ, మా నాయిన ఈ పని చేస్తున్నాము. నాయిన ఇప్పుడే లంచ్‌కి పోయిండు (అప్పుడు సాయంత్రం ఐదు గంటలవుతున్నది) అని ఆదుర్దాతో, చేతులు కట్టుకుని చెప్పసాగాడు.

నా వెంట ఫోటోగ్రాఫర్, మరొక మిత్రుడు ఉన్నారు. మేమంతా చైల్డ్ లేబర్ డిపార్ట్‌మెంట్ నుంచి వచ్చామని అతని అభిప్రాయం. మరి కొన్ని క్షణాల్లో వారిని జీపులోకి తోసి పోలీస్ స్టేషన్‌కు నడువమంటామని బెదిరిపోతున్నాడు. మేం పత్రికల వాళ్లమని చెప్పినా వినలేదు.

“పిల్లల ఫోటోలు వేస్తే ఆఫీసర్లు ఐదొందల ఫైన్ ఏస్తారు సార్. ఆ తిప్పలు పడలేము. అసలే మన సి.ఎం. బాలకార్మికులతో పని చేయించ వద్దంటున్నడు సార్. ఇదంతా పేపర్ల వస్తే మా పని అయిపోతది సార్. పిల్లగాళ్లతో పని చేయించం సార్. మానేస్తం సార్” -వేడుకోలు.

ఇంతకీ ఆ పిల్లలెక్కడున్నారు?

“బడికి పంపించిన సార్. నిజం సార్. నమ్మండి. నిన్ననే వాళ్ల అమ్మనాన్నలతో మాట్లాడి పిల్లల్ని బడిలో చేర్పించినం. బడికి పోతే బియ్యం కూడా ఇస్తున్నారు సార్” అతను చెబుతూనే ఉన్నాడు. అతను ఒకవారం రోజుల పాటు ఆ పిల్లలని పనికి పిలవడని మాకు అర్థమైంది. వారం తర్వాత మళ్లీ మామూలే. ఈసారి పార్సీగుట్ట నుంచి వెళ్ళేటప్పుడు చూడండి. ఇద్దరు పిల్లలు సైలెన్సర్లని కాలుస్తూ కనిపిస్తారు. మిట్ట మధ్యాహ్నం లేత బాల్యం ఆ బట్టీ ముందు కాలుతూంటుంది. ఆదిల్, రబాని- వీరు కాకపోతే మరో ఇద్దరు పిల్లలుంటారు. ఈ కథ అలా కొనసాగుతుందంతే!

- ఫ్లక్స్

యుద్ధ పిపాసుల సరుకుల దగ్ధం

ఇరాక్‌పై అమెరికా దురాక్రమణను వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ఏప్రిల్ 23న నెల్లూరు పట్టణంలో అమెరికా బ్రిటన్ ఉత్పత్తులను దగ్ధం చేశారు. మద్రాసు బస్టాండ్, ఆత్మకూరు బస్టాండ్, వెంకటేశ్వరపురం సెంటర్‌లలో సిఐటియు అనుబంధ సంఘాల కార్మికులు ప్రదర్శనలు నిర్వహించి అమెరికా బ్రిటన్ ఉత్పత్తులను ఊరేగించి, అనంతరం దగ్ధం చేశారు. బుచ్చి, రాజుపాలెం, కావాలి, గూడూరు, ఆత్మకూరు, సూళ్ళూరు పట్టణాలలో జరిగిన ప్రదర్శనలో సిఐటియు కార్యకర్తలు పాల్గొన్నారు.

కనీసవేతనాలకై ధర్నా

కనీస వేతనాలకై యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖపట్నం ప్రాంతీయ కార్యవర్గ కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 17న విశాఖ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయం ముందు "ధర్నా" చేశారు.

ధర్నాలో గజిహి నోటిఫికేషన్ నెం.524 (స్కిల్డ్- వేతనం 3,400/-) అందరు ఇ.పి.డి.సి.ఎల్. పనిచేస్తున్న కాంట్రాక్టు లేబరుకు అమలు చేయాలని, షెడ్యూల్ ఆఫ్ రెట్స్ ఏరియా ఎలవెన్సులో కలిపి ప్రతీ సం॥ సకాలంలో అమలు చేయాలని, సెలవులు, నిర్ణీత పని గంటలు కాంట్రాక్టు లేబరుకు వర్తింప జేయాలని, కాంట్రాక్టరు మారినా పాత సిబ్బందినీ కొనసాగించాలని ఇఎస్ఐ, పి.ఎఫ్, ఇన్సూరెన్స్‌ను కాంట్రాక్టు లేబరుకు అమలు పరచాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సిఐటియు వైజాగ్ కమిటీ నాయకులు వై.రాజు, సంఘం గౌరవాధ్యక్షులు జి.ఎస్.రాజేశ్వర్రావ్, టి.కృపావరం, ఎం.నీలకంఠం, కె.భాస్కర్రావ్, కె.పి.సూర్యనారాయణ, సయ్యద్ అమానుల్లా, డి.కూర్మరావ్, పాల్గొని ప్రసంగించారు.

ప్రపంచబ్యాంకు విధానాలను సమైక్యంగా తిప్పికొట్టాలి

ప్రపంచబ్యాంకు విధానాల వల్ల నష్టపోతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు సమైక్యంగా వాటిని తిప్పికొట్టాలని ఐక్యవేదిక సదస్సులో పాల్గొన్న బి.వి.రాఘవులు ఉద్యోగులకు పిలుపునిచ్చారు.

"ప్రపంచబ్యాంకు విధానాలు-ఉద్యోగులపై ప్రభావం" అంశంపై ఏప్రిల్ 4న ఆదిలాబాద్ అంబేద్కర్ భవన్‌లో ఐక్యవేదిక ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఇందులో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.వి.రాఘవులు, ఎన్.అనంత్‌రావు (జెఎసి ఛైర్మన్), సిహెచ్ రమేష్ (మెడికల్), జి.రాములు (జెఎసి రాష్ట్ర కార్యదర్శి), కె.సత్యనారాయణ, ఎస్.శశికాంత్, యు.లక్ష్మయ్య, గంగాధర్, జి.శ్రీనివాస్, గణేష్, గోవర్ధన్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొని ప్రసంగించారు. టెలికాం, పోస్టల్, మెడికల్, బ్యాంక్ మొదలగు ఉద్యోగ కార్మికులందరు సదస్సులో పాల్గొన్నారు.

కనీసవేతనాలకై లేబర్ ఆఫీసు ముట్టడి

విద్యుత్ ఉద్యోగులు తమకు కనీసవేతనాలను అమలు చేయాలని ఇ.ఎస్.ఐ, పి.ఎఫ్. సౌకర్యం కల్పించాలని ఏప్రిల్ 14న యునైటెడ్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నెల్లూరు లేబర్ ఆఫీసును ముట్టడించారు.

స్కిల్డ్ వర్కర్స్‌కు రూ. 3,400ల వేతనం ఇవ్వాలని, ప్రస్తుత ఖాళీ పోస్టులలో తాత్కాలిక ఉద్యోగులను భర్తీ చేయాలని వారు అన్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన వారి కుటుంబ సభ్యులలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించాలని, సంస్థ ఇచ్చే నష్టపరిహారాన్ని రు. 1,00,000కు పెంచాలని వారు కోరారు. రూ. 2,00,000లకు కాంట్రాక్టరు ఇన్సూరెన్స్ చేయాలని ఫ్రాంచేజింగ్ అమలు జరిగినా, కాంట్రాక్టరు మారినా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ లేబర్ ఎన్.నరసింహులు కార్మికులతో మాట్లాడుతూ వారం రోజులలోపు జిల్లాలోని సంబంధిత ఎస్.ఇ.లను డివిజనల్ ఇంజనీర్లను మరియు యూనియన్ నాయకులను సమావేశపరిచి కనీసవేతన చట్టాన్ని అమలు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. యూనియన్ నాయకులు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కమీషనర్‌కు అందజేశారు.

ఈ కార్యక్రమంలో యు.ఎ.ఎ.యు. రాష్ట్ర అధ్యక్షులు దుగ్గిరాల సుబ్బారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి నారుకృష్ణయ్య, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఎస్.కె.రెహనాబేగం, యు.ఎ.ఎ.యు. రీజినల్ అధ్యక్షులు టి.వెంకట్రామిరెడ్డి తదితర నాయకులు పాల్గొని ప్రసంగించారు.

మెడికల్ రిప్రజెంటీటివ్‌ల రాష్ట్ర ర్యాలీ

కనీస వేతనాలు, కార్మిక చట్టాల అమలు కోసం, నకిలీ, నాసిరకం మందుల నరికట్టాలని ఎ.పి.మెడికల్, సేల్స్ రిప్స్ యూనియన్ ఏప్రిల్ 19వ తేదీన రాష్ట్ర వ్యాప్త ర్యాలీ చేసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి వెయ్యిమంది మెడికల్ రిప్స్ పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై నినాదాలు చేసారు. ర్యాలీ సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుండి ఇందిరాపార్కు వరకు సాగింది.

ర్యాలీ అనంతరం ఇందిరాపార్కు వద్ద జరిగిన సభలో మెడికల్ రిప్స్ ఆలిండియా ఫెడరేషన్‌ను ప్రధాన కార్యదర్శి కా॥డి.పి.దూబే, ఆలిండియా ఉపాధ్యక్షులు కె.రమేష్, రాష్ట్ర అధ్యక్షులు ఎ.జి.రాజ్‌మోహన్, ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్రమణ్యం, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎ.వి.నాగేశ్వర్రావు ప్రసంగించారు.



వి న తి ప త్రం

వలస కార్మికుల రక్షణకై సమగ్ర చట్టం తేవాలి

(వలస కార్మికుల సమస్యలపై రాష్ట్ర గవర్నర్ శ్రీ హెచ్ఎస్.బర్నాలా గారికి సిఐటియు రాష్ట్ర కేంద్రం 2003 ఏప్రిల్ 4న సమర్పించిన వినతి పత్రము సంక్షిప్తంగా)

ఆర్యా!

1991 తర్వాత మన రాష్ట్రంలో అమలు జరుగుతున్న ప్రపంచబ్యాంకు విధానాలకు, డబ్ల్యుటివో ఒప్పందాలు తోడై గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడింది. వ్యవసాయరంగం కుప్ప కూలింది. గత 2 సం॥లుగా రాష్ట్రంలో నెలకొన్న కరువు "గోరు చుట్టుపై రోకటి పోటులా" గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నడ్డివిరిచింది.

గ్రామీణ ప్రాంతంలో 34% గా వున్న వ్యవసాయ కార్మికులు, 20%గా వున్న చిన్న, మధ్యతరగతి రైతాంగానికి, చేతి వృత్తుల వారికి పనులు లేవు. ఆదాయాలు లేవు. కొనుగోలు శక్తి పడిపోయింది. వ్యవసాయాధారిత బియ్యం, ఆయిల్, పప్పులు వగైరా మిల్లులు మూతబడ్డాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని కార్మికులపై కూడా కరువు ప్రభావం పడింది. హమాలీ, భవన నిర్మాణం, రిక్షా, ఇటుక బట్టీలు వగైరా పనులు తగ్గిపోయాయి.

కరువు పీడితులు పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరి వీరిని అయోమయంలో పడేసింది. వీరికి పనులు కల్పించటం కోసం కేంద్రం కేటాయించిన 31 లక్షల టన్నుల బియ్యం కరువు పీడితులకు చేరలేదు. అధికార పార్టీ కాంట్రాక్టర్లు, యంత్రాల యజమానుల పరమైనాయి. దిక్కుతోచని స్థితిలో వున్న వూరు వదలి పనులకోసం పరుగులు తీస్తున్నారు.

బ్రతుకు భారమై వ్యవసాయేతర పనుల కోసం పెద్దయెత్తున కుటుంబాలతో సహా పట్టణాలకు వలసలు వెళుతున్నారు. 2002 అక్టోబరు తర్వాత 40 లక్షల మందికిపైగా గ్రామాల నుండి పట్టణ ప్రాంతాలకు వలసలు పోయినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనలు వెల్లడిస్తున్నాయి. హైదరాబాద్‌నగరానికి వారానికి కనీసం 3-4 వేల మంది రాష్ట్రం నలుమూలల నుండి వలసవస్తున్నారు. పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. మండల, జిల్లా కేంద్రాలు, హైదరాబాద్ నగరానికి వలసలు పెరిగాయి. కొందరు మద్రాసు, బెంగుళూరు, బొంబాయి, షోలాపూర్, గుజరాత్, గోవా వంటి సుదీర్ఘ ప్రాంతాలకు వలసలు పోయారు. మరికొందరు 'గల్ఫ్' దేశాలకు పనులకోసం వలసలు వెళ్ళారు.

వలస కార్మికుల సమస్యలు : హైదరాబాద్ నగరంతో సహా పలు జిల్లాలలో సిఐటియు గా వలస కార్మికుల సమస్యలపై సర్వే జరిపాము. మేము గుర్తించిన కొన్ని ప్రధాన వివరాలు.

రోడ్డు ప్రమాదాలు : లారీలు, ట్రక్కులు, ఆటోలపై పనులకోసం పట్టణాలకు వెళ్ళే క్రమంలో రోడ్డు ప్రమాదాలు జరిగి కుటుంబాలకు కుటుంబాలే చనిపోతున్నారు. అనేక మంది వికలాంగులౌతున్నారు.

ప్రారంభం నుండి అగచాట్లు: నగరానికి వలసవచ్చాక 10-15 రోజులు పనిరదొరకక, నిలువనీడలేక అల్లాడిపోతున్నారు. వీరిని ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవటం లేదు. పేవ్‌మెంట్లు పై ఉండొద్దని పోలీసులు వేధిస్తున్నారు. పట్నంలో అద్దెలు చెల్లించలేక చెరువు కట్టలు, రోడ్ మారిజన్‌లు, ఖాళీ జాగాలలో గుడారాలు, గుడిసెలు వేసుకొని బ్రతుకులీడుస్తున్నారు. ఈ స్థితిలో వేరేదారిలేక సంఘవిద్రోహశక్తులను, బ్రోకర్‌లను ఆశ్రయిస్తున్నారు. ఈ కార్మికుల నిస్సహాయ స్థితిని వారు తమ కనుకూలంగా మార్చుకుంటున్నారు.

పనిలో పోటీ - తగ్గిపోతున్న కూలి : గతంలో వారానికి రెండు లేదా

మూడు రోజులు సునాయాసంగా పనిదొరికేది. కరువు తీవ్రమయ్యాక కూలీల సంఖ్య పెరిగింది. కూలి కూడా దొరకడం లేదు. రూ.100-120 లు ఉన్న రోజుకూలి ఇప్పుడు రూ.70/-లకు పడిపోయింది. స్త్రీలకు ఇంతకంటే తక్కువ కూలి ఉంది. సాంప్రదాయకంగా భవన నిర్మాణం పనులు చేసే కార్మికులు ఇప్పుడు ఏ పని దొరికినా చెయ్యడానికి సిద్ధపడుతున్నారు.

ఆకలి- అప్పులు : చాలీచాలని ఆదాయాలతో చాలా మంది రెండు పూటలా తిండి తినడం లేదు. కొందరు ఒక్కపూటకే సర్దుకుంటున్నారు. అత్యధికులు బ్రతకటం కోసం అప్పులు చేస్తున్నారు. కుటుంబ పెద్దలు పనికిపోవటాన్ని ఆసరా చేసుకొని కొందరు ఆకతాయిలు ఆడపిల్లలపై అత్యాచారాలకు, అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా మద్దూరు మండలం నుండి హైదరాబాద్ క్వారీ పనులకోసం కార్మికులు వెళ్ళగా- గుడిసెల వద్ద కాపలా కోసం వున్న పిల్లలు నల్గురు దగ్గరి చెరువులో పడి చనిపోయారు. వారి కుటుంబాలకు ఎలాంటి నష్టపరిహారం లేదు.

ఆత్మహత్యలు : ఆకలికి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. 27.03.2003 రాత్రి అద్దెకుంటున్న ఇంట్లో ఫ్యానుకు వురేసుకుని చనిపోయారు. వారి ఒక్కనొక్క బిడ్డ అనాథగా మిగిలింది. ప్రభుత్వ సహాయం లేదు. "పనులు దొరకలేదు. తిండిలేదు. ఆకలితో అలమటిస్తూ ఆత్మహత్య చేసుకుంటున్నాము" అక్కడ దొరికిన వుత్తరంలో వ్రాసి వుంది.

పేదరికం- ప్రయోగ సంస్థల నిర్వాకం : ఇటీవల కాలంలో హైదరాబాద్ నగరంలో షుమారు 12 మందుల కంపెనీల లేబోరేటరీలు వలసకూలీలపై ప్రయోగాలు చేస్తున్నాయి. ఆకలిని తట్టుకోలేక, కుటుంబ సభ్యుల దీనావస్థను చూడలేక ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టడానికైనా వారు సిద్ధపడుతున్నారు.

రక్షణ లేని మహిళా కార్మికులు : ఉదా : మహబూబ్‌నగరుకు చెందిన నారమ్మ (35సం॥) అనే మహిళను సంవత్సరం క్రితం కూకట్‌పల్లి ప్రాంతానికి కూలికోసం తీసుకెళ్ళి అత్యాచారం జరిపి హత్య చేశారు. ఏడాది గడుస్తున్నా దోషిని పోలీసులు పట్టుకోలేకపోయారు. దుండగులతో పోలీసులు చేతులు కలిపి ఉండొచ్చని తోటి కూలీలు అనుమానిస్తున్నారు. ఈమెకు ఇద్దరు ఆడపిల్లలు. ఈ కుటుంబానికి ప్రభుత్వం నుండి ఎలాంటి ఆర్థిక సహకారం ఇవ్వలేదు.

గత ఏడాది కాలంగా పనులు లేక పొట్ట గడవక ఆకలికి తట్టుకోలేక వ్యభిచార వృత్తిలోకి పెద్ద సంఖ్యలో మహిళా కూలీలు దిగుతున్నారు. చిక్కడపల్లి అడ్డలో 200 మంది మహిళల్లో 50 మంది వరకూ ఈ వృత్తిలోకి దిగబడినట్లు తెలుస్తున్నది. నగరంలో ఒక అడ్డాలో ప్రారంభమైన ఈ వృత్తి దాదాపు 15 అడ్డాల వరకు ప్రాకిందని సమాచారం.

డిమాండ్స్:

1. వలస కార్మికుల రక్షణకు సమగ్ర చట్టం చేయాలి. **2.** హైదరాబాద్ మరియు రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలన్నింట వలస కార్మికులకు గుర్తింపు కార్డు లివ్వాలి. **3.** 'పనికోసం ఆహారం' పథకం ద్వారా గ్రామాలలో పని అవసరమైన వారందరికీ పనులు కల్పించాలి. తాగేందుకు మంచినీరు అందించాలి. వలసలు నివారించి పట్టణాలపై వత్తిడి తగ్గించాలి. జలయజ్ఞం, నీరు-మీరు, వనసంరక్షణ సమితి వగైరా పథకాల నిధులు వినియోగించి చెరువులు, కాలువలు, పూడిక తీయించే పనులు కల్పించాలి. చెరువు భూములు కబ్జా కాకుండా ఫెన్సింగ్ పనులు చేపట్టాలి. దోభీగాట్ల నిర్మాణం చేపట్టి నీటి వసతి కల్పించి రజకులకు పనులు కల్పించాలి. మిషన్ల వినియోగాన్ని నిషేధించి, మనుషులకు పని కల్పించాలి. **4.** కనీసవేతనాలు రాష్ట్రమంతా అమలు జరపాలి. నాన్ షెడ్యూలు సంస్థలలో జిల్లా కలెక్టర్లు ప్రకటించిన కనీసవేతనాలు అమలు పరచాలి. **5.** వలస కార్మికులకు రాష్ట్రకేంద్రం, జిల్లా కేంద్రాలలో ఉచిత వసతి సౌకర్యం కల్పించాలి. పట్టణాలలో అద్దెలు చెల్లించగల ఆర్థిక స్తోమతు వారికి లేదు. అక్కడ వైద్యం, మంచినీరు, శానిటేషన్ వగైరా కనీసవసతులు కల్పించాలి. **6.** వలస కార్మికులకు ఉచిత బియ్యం, కిరోసిన్ కూపన్లు ప్రభుత్వం అందించాలి. **7.** వలస కార్మికులు అడ్డాలపై రక్షణలేదు. నిర్ధిష్ట పనికి, నిర్ధిష్ట కూలి ఇప్పించాలి. యజమానులపేర్లు, అడ్రసు, ఫోన్ నెంబర్లతో సహా ప్రభుత్వ ఏజెన్సీలు నమోదు చేయించాలి. పని చేయించుకొని కూలి ఇవ్వని వారి నుండి కూలి ఇప్పించాలి. **8.** అడ్డాపై పనికోసం వున్న మహిళా కార్మికులకు భద్రత కల్పించాలి. పనికోసం తీసుకెళ్ళి మానభంగాలు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలి. పనికోసం తీసుకెళ్ళి అత్యాచారం జరిపి హత్య చేసిన యజమానులను గుర్తించి, పోలీస్ స్టేషన్‌లో పెండింగులో వున్న కేసులు పరిష్కరించాలి. వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలి. **9.** ఆడపిల్లలపై అఘాయిత్యాలు : పనికోసం తల్లిదండ్రులు పెద్దలు బయటికి పోయాక, గుడిసెకు కాపలాగా వున్న ఆడపిల్లలపై అసాంఘిక శక్తుల అఘాయిత్యాలను అరికట్టాలి. **10.** గ్రామాలలో బ్రతకలేక పనుల కోసం పట్టాణలకు వస్తూ, రోడ్డు ప్రమాదాలలో పెద్ద సంఖ్యలో చనిపోయిన, వికలాంగులైన వారికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి. **11.** నెలల పర్యంతం వలసలు వచ్చి బ్రతుకుతున్న వారి స్వగ్రామంలోని ఇళ్ళకున్న కరెంటు సర్వీసులు డిస్‌కనెక్ట్ చేయరాదు. కరెంటు వినియోగించని కాలానికి కరెంటు బిల్లులు రద్దు చేయాలి. **12.** రోజు పనికోసం గ్రామాల నుండి పట్టణాలకు వచ్చిపోయే వారికి రైల్వేలలో ఉచిత పాసులు ఇవ్వాలి. ఎ.పి.యస్.ఆర్.టి.సి.లో కూడా చార్జీలలో రాయితీలు ఇవ్వాలి. **13.** మధ్యాహ్న భోజన పథకం ఎండకాలంలో కూడా కొనసాగించాలి.

అభినందనలతో,
(ఎస్.వీరయ్య)
ప్రధాన కార్యదర్శి

కరువు సహాయనిధి

సీఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుపై రాష్ట్రంలోని పలు జిల్లాలలో కార్మికులు, ఉద్యోగుల నుండి కరువు సహాయనిధిని సేకరించారు. రాష్ట్ర కేంద్రానికి ఏప్రిల్ 30 నాటికి అందిన వివరాలు క్రింది నిస్తున్నాం. దాతలకు, నిధి సేకరించిన నాయకులు, కార్యకర్తలకు సిఐటియు రాష్ట్ర కమిటీ అభినందనలు తెల్పుతున్నది. సేకరించిన నిధిని వెంటనే రాష్ట్ర కేంద్రానికి పంపి సహాకరించ వలసిందిగా కోరుతున్నాము.

కరువు సహాయనిధి

హైదరాబాద్ సిఐటియు సిటి	24771.00
మహబూబ్‌నగర్ సిఐటియు	5230.00
ఆర్టీసి నెల్లూరు	2500.00
కరీంనగర్	1350.00
తూర్పు గోదావరి	4830.00
గుంటూరు	13945.00
తెనాలి	9042.00
కర్నూల్	10500.00
క్రిష్ణ	38960.00
ప్రకాశం	8400.00
భవన నిర్మాణ కార్మిక సంఘం	1418.00
ఎన్‌టిపిసి	4536.00
ఖమ్మం ఆర్టీసి మధీర డిపో	1000.00
విశాఖ	75710.00
శ్రీకాకుళం	6000.00
ఆర్ & బి భీమవరం	500.00
అనంతపురం సిఐటియు	3270.00
ఇరిగేషన్ అనంతపురం	516.00
బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా	14833.00
మొత్తం :	**227311.50**

ఎఐఐఇఎ ఇన్సూరెన్స్ యూనియన్ నిర్వహిస్తున్న అంబలి కేంద్రాలు

అనంతపురం జిల్లాలో జిఐసి 3 గంజి కేంద్రాలు	మహబూబ్‌నగర్ జిల్లాలో ఎల్‌ఐసి 3 గంజి కేంద్రాలు
1. గార్లదిన్నే మండలం, తిమ్మంపేట గ్రామం, తేది. 18.4.2003 **(2)** ఆత్మకూరు మండలం, సింగంపల్లి గ్రామం 26.4.2003 **(3)** ఆత్మకూరు మండలం, సింగంపల్లి తండా 27.4.2003	**1.** మహమ్మద్ హుస్సేన్ పల్లి గ్రామం, ఖిల్లా ఘనపురం మండలంలో, తేది : 23.4.2003 **(2)** వేపూరు గ్రామం- తేది 27.04.2003 **(3)** గొర్లఖాన్ దొడ్డి గ్రామం, గట్టు మండలం తేది :1.5.2003

వాస్తవ గాథ

లాభాల వేటలో సంక్షేమం బలి



అది పాండిచ్చేరీ ప్రభుత్వ ఆస్పత్రిలోని వార్డ్ నెం.108. 21 ఏళ్ళ సుమతి ఊపిరి అందక, మాట్లాడకలేక, కూర్చోలేని స్థితిలో తీవ్రమైన బాధతో ఆఖరి శ్వాసకోసం నిరీక్షిస్తోంది. ఆమె స్నేహితురాళ్ళు మరో ఆరుగురు కూడ ఇంచుమించు అదే స్థితిలో అదే వార్డులో ఉన్నారు. వీరందరూ 'సిలికోసిస్' అనే వృత్తిపరమైన జబ్బుకు గురయ్యారు. ఎక్కువసేపు ఇసుకలో పనిచేయటం వల్ల ఊపిరితిత్తులు చెడిపోయి సిలికోసిస్ వ్యాధి సంక్రమిస్తుంది. గత ఎనిమిది మాసాలలోను ఈ జబ్బు 8 మంది ప్రాణాలను బలితీసుకుంది. వీరంతా పాండిచ్చేరీ సమీపంలోని విల్లియనూరు, అరుంపార్థపురం గ్రామస్థులు. ఇదే గ్రామాలకు చెందిన ఎంతో మంది మహిళలు వివిధ స్థాయిల్లో ఈ వ్యాధితో పోరాడుతున్నారు.

ఈ రెండు గ్రామాల్లో ప్రతి ఇంట్లో కనీసం ఒక మహిళ ఛాతీనొప్పి, దగ్గు, ఊపిరి అందక పోవటం, ఆకలి లేకపోవటం, బరువు కోల్పోవటం వంటి ఏదో ఒక రుగ్మతకు గురయ్యారు. వీరందరూ గాజు గ్లాసులు తయారు చేసే ఫ్యాక్టరీలోని 'ఇసుక ప్లాంట్', 'బాబ్‌హౌస్' అనే రెండు డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ పాండిచ్చేరికి 15 కి.మీ. దూరంలో ఉంది.

సివికోసిన్ బాధితులందరికీ ఫ్యాక్టరీ యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలని, వారికి వైద్య సహాయం అందించాలని సిఐటియు నాయకత్వం డిమాండ్ చేస్తోంది. అయితే పాండిచ్చేరీ ప్రభుత్వం, ఫ్యాక్టరీ యాజమాన్యం, వైద్యుల రిపోర్టు కోసం ఎదురుచూస్తున్నారు. సిలికా వద్ద పనిచేయటం వల్లనే ఈ వ్యాధి సోకిందని నిరూపణ అయితేనే తాము పరిహారం చెల్లిస్తామనేది వారి వాదన.

అయితే దీనికి ముందు జరిగిన చరిత్రని మనం తెలుసుకోవాలి. 1992లో బిల్ట్ గాజు గ్లాసుల కంపెనీ పాండిచ్చేరీలో ఫ్యాక్టరీ పెట్టటానికి ప్రభుత్వ అనుమతి కోరింది. ప్రజలకు ఉద్యోగం, ప్రభుత్వానికి ఆదాయం వస్తుందనే ఉద్దేశ్యంతో వెంటనే పర్మిషన్ జారీ చేశారు. ఈ ఫ్యాక్టరీలో సిలికాన్ ఇసుక, క్వార్ట్జ్, కాల్‌సైట్ అనే పదార్థాలు వాడబడతాయి. ఇక్కడ మొత్తం 1500 మంది పనిచేస్తారు. వీరిలో అత్యధికులు కాంట్రాక్ట్ కార్మికులు, ఈ కాంట్రాక్ట్ కార్మికులలో కూడా మహిళలే అధికం. వీరందరూ పాండిచ్చేరీ చుట్టుప్రక్కల గ్రామాలకు చెందినవారు. పురుషులు లోడింగ్, అన్‌లోడింగ్ పనిచేస్తే, మహిళలు ఇసుక నుండి సిలికా వేరు చేసే చోట్ల, సిలికాను విభజించే చోట, తయారైన వస్తువుల పాకింగ్ విభాగంలోను పనిచేస్తారు. ఇది చాల ప్రమాదంతో కూడుకున్న పని. అయితే వారెవ్వరికీ ఈ విషయం తెల్వదు. వారి అజ్ఞానాన్ని ఆసరా చేసుకున్న యాజమాన్యం కనీసమైన రక్షణ చర్యలు కూడా తీసుకోలేదు. సిలికా శరీరంలోకి పోకుండా మాస్క్‌లను సైతం ఇవ్వలేదు. కార్మికులు తమకు రోజుకు వస్తున్న రూ.14 నుండి రూ.24 వేతనానికే సంతోషపడిపోయారు. కొంతమంది మహిళలు వరుసగా రెండు షిప్టులు కూడా చేసేవారు.

ఈ ఫ్యాక్టరీ నుండి గాజు సామాన్లను గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేసేవారు. ఒకటి రెండు సంవత్సరాలు వారికి పెద్ద సంఖ్యలో ఆర్డర్లు వచ్చాయి. తర్వాత దుబాయ్‌లోనే గ్లాస్ ఫ్యాక్టరీలు పెట్టడంతో వీరి బిజినెస్ తగ్గిపోయింది. దీనితో బిల్ట్ కంపెనీ తన ఫ్యాక్టరీని అమెరికాకు చెందిన ఓవన్స్ బ్రోక్‌లే ఇండియా లిమిటెడ్‌కు అమ్మివేసింది. ఈ క్రమంలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు రూ.24 నుండి రూ.33కి పెంచారు.

ఇక్కడ నుండి అసలు కథ ప్రారంభమైంది. 1999లో చాల మంది కాంట్రాక్ట్ మహిళలు అనారోగ్యం బారినపడ్డారు. వీరందరూ ఛాతీనొప్పి ఊపిరి అందకపోవటం, బరువు కోల్పోవటం వంటి ఒకే రకమైన బాధలను వ్యక్తం చేసేవారు. అనారోగ్య కారణంగా పనికి రాలేకపోయేవారు. 2000 సం॥లో యాజమాన్యం ఫ్యాక్టరీని ఇసుకప్లాంట్‌ను, బాబ్‌హౌస్‌ను యంత్రాల ద్వారా ఆటోమెట్ చేయాలని నిర్ణయించింది. ఫలితంగా ఎక్కువరోజులు గైర్హాజరులో ఉన్న మహిళల కాంట్రాక్ట్ రద్దు చేయటానికి పూనుకుంది. మిగిలిన వారిని ఇతర డిపార్ట్‌మెంట్లకు బదిలీ చేసింది. తర్వాత ఆర్డర్లు లేవనే కారణంతో హిందూస్తాన్ నేషనల్ గ్లాస్‌వర్క్స్ అనే పెద్ద కంపెనీకి అమ్మేశారు. దానితో ఈ గ్లాస్ కంపెనీ పేరు 'ఏస్ గ్లాస్ కంటైనర్స్ లిమిటెడ్'గా మారింది.

తాము చేస్తున్న పని వల్లనే తమకు ఈ సిలికోసిస్ వ్యాధి సోకిందని ఈ మహిళలు కనుక్కోలేకపోయారు. వీరికి ఉన్న వ్యాధి లక్షణాల వల్ల డాక్టర్లు క్షయ వ్యాధిగా భావించి దానికి మందులు ఇచ్చారు. ఎప్పుడైతే ఒకే వీధిలోని అయిదుగురు మహిళలు ఒకే రకంగా చనిపోయారో, అప్పుడు వారికి తమ పనికి, జబ్బుకు ఉన్న సంబంధం అర్థమైంది. ఈ విషయం బయటపడిన తరువాత చనిపోయిన వారిలో కవిత మొట్టమొదటి మహిళ. సిలికోసిస్ జబ్బును నయం చేసుకునే ప్రక్రియలో చాలసార్లు వివిధ రకాల ఆపరేషన్లు చేయించుకోవలసి వస్తుంది. ప్రతిసారి కనీసం రూ7000/- ఖర్చు పెట్టాలి. వారికున్న ఉన్న కొద్దీ గొప్పో వస్తువులు అమ్ముకున్నా అప్పులు చెయ్యక తప్పట్లేదు. అప్పులు పెరిగిపోతున్నాయే తప్ప ఆరోగ్యం మెరుగు పడట్లేదని వారి కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు.

“మాకు సిలికా వల్ల ఏర్పడే ప్రమాదం గురించి ముందే తెలిసినట్లైతే వేలకు వేలు ఖర్చుపెట్టి చనిపోవడం కంటే మా స్వంత డబ్బులతోనే రూ.350/- ఖర్చు పెట్టి రక్షణకోసం మాస్కులు కొనుక్కునే వాళ్ళం” అని అనసూయ ఎంతో దయనీయంగా అన్నది. ఆమె కూడ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ జీవితానికి విముక్తి ఎప్పుడా అని ఎదురుచూస్తోంది.

సిలికాన్ ఫ్యాక్టరీ వల్లనే తమకు వ్యాధులు కలుగుతున్నాయని గ్రహించిన వెంటనే కార్మిక మహిళలు కాంట్రాక్టర్‌ను కలవటానికి ప్రయత్నించి విఫలులయ్యాయి. చాల కొద్ది మందికి మాత్రం ఇఎస్ఐ కార్డులు లభించగా, మిగిలిన వారందరూ భారీ అప్పు చేసి వైద్యం చేయించుకుంటున్నారు.

ఇంత జరుగుతున్నా లేబర్ డిపార్ట్‌మెంట్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. తమ ఫ్యాక్టరీలో ఈ విధమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు ఫ్యాక్టరీ యాజమాన్యం తమకు తెలియజేయనే లేదని లేబర్ కమిషనర్ వాదిస్తున్నారు. అయితే సిఐటియు జిల్లా కార్యదర్శి దురై ఆర్ముగం తాము 1998లోను, 1999లోను లేబర్ డిపార్ట్‌మెంట్‌కు తెలియజేశామని, అయితే అప్పటి యాజమాన్యంపై చర్య తీసుకోవటంలో వారు వైఫల్యం చెందారని అన్నారు.

- పద్మశ్రీ

స్పెషల్ స్టోరీ

మేడే

అమెరికాలోని చికాగో నగరంలో

పనిగంటల తగ్గింపు వంటి తమ కనీస హక్కుల కోసం కార్మికుల ఉద్యమం ఉప్పెనలా లేచి **117** సంవత్సరాలు గడిచింది. ఈ శతాబ్ద కాలంలో పాలకవర్గల్లోనే కాకుండా, కార్మిక వర్గాల్లో కూడా ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. నిరంకుశ రాజ్యాలు పతనమై, ప్రజాస్వామ్య దేశాలు వెలిశాయి. కార్మికులు పలు హక్కులు, సౌకర్యాలు మేడే స్ఫూర్తితో పోరాడి సాధించుకున్నారు. ఈ సరళీకృత విధానంలో కార్మికులు గత కాలంలో సాధించిన హక్కులు, సౌకర్యాలు కోల్పోతున్నారు. కాలచక్రాన్ని వెనక్కి తిప్పాలని పాలకులు కుట్రలు పన్నుతున్నారు. అందుకు కార్మికోద్యమంపై నిర్బంధం ప్రయోగించి అణిచెయ్యటాన్ని ఒక సాధనంగా ఉపయోగిస్తున్నారు. ఆర్టీసి సమ్మె సందర్భంగానైతేనేమీ, బొగ్గు గని కార్మికుల పోరాటంలోనైతేనేమీ....ప్రభుత్వ మూకలు, కార్మికుల ఇండ్ల మీదా, భార్యాబిడ్డలమీదా పైశాచికంగా దాడులు జరిపాయి. అక్రమ కేసులు బనాయించి శిక్షలు విధించారు. ఇవే విధానాలు ఆ మేడే నాడు అంటే.... మే **1886**లో కూడా జరిగాయి. వాటిని ఈ మేడే సందర్భంగా మననం చేసుకుందాం.

అది మే 1886... రాత్రి పూట.... చికాగో నగరపు పడమర భాగంలో 'హే' మార్కెట్ అల్లకల్లోలంగా వుంది. పోలీసులు అక్కడ సమావేశమైన కొద్ది మంది కార్మికులను చెదరకొడుతున్నారు. హఠాత్తుగా పోలీసుల మధ్య ఒక బాంబు పేలింది. వెంటనే పోలీసులు కాల్పులు ప్రారంభించారు. ఆ కాల్పుల్లో అనేక మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. రెండువందల మందికి పైగా గాయపడ్డారు. ఒక పోలీసు ఉన్న చోటనే చనిపోయాడు. అప్పుడు చికాగోలో మాత్రమే కాక, దేశమంతా ఒక ఉన్మాదస్థితి ఏర్పడింది. అరాచకవాదులపై నేరమారోపించారు. బాంబు సంఘటనకు చెందిన ఆధారము ఏదీ లేకపోయినా, తోచిన రీతిలో విచారణ జరిపారు. ఏడుగురికి మరణశిక్ష, ఒక్కరికి 15 సంవత్సరాలు ఖైదు. ఆల్బర్ట్‌పార్సన్స్, ఆగస్ట్‌స్పీన్, సామ్యుయెల్ ఫీల్డన్, మైకేల్ ష్వాబ్, అడాల్ఫ్‌ఫిషర్, జార్జిఎంజెల్, లూయీలింగ్ లకు మరణశిక్ష, ఆస్కార్ నీబేకు జైలుశిక్ష విధించారు.

సంఘటనకు ముందు:

1886 మే 1వ తేదీకి కొద్దిమాసాల ముందు నుంచీ ఆడా, మగా, నల్లా, తెల్లా, నిపుణులూ, సామాన్యులు, స్థానికులు, వలసవచ్చిన వారు, సంఘటితులూ, కానివారూ... అందరూ అన్ని రకాల కార్మికులూ... పని గంటల తగ్గింపు కోసం జరిగే పోరాటంలోకి లాగబడ్డారు. "ఎక్కడ చూసినా '8 గంటల' వని ఆందోళన

❑ స్పెషల్ స్టోరీ

కనబడుతోంది" అని ఒక కార్మిక పత్రిక రాసింది. ఆ పోరాంలో 2.5 లక్షల మంది ప్రవేశించారు. ఆ వెల్లువ ఎంత శక్తివంతమైనదంటే 30 వేల మంది కార్మికులు ప్రత్యక్ష పోరాటం లేకుండానే '8 గంటల పనిదినం' పొందగలిగారు.

ఒక్క చికాగోలోనే 4 లక్షల మంది ఉద్యమం లోకి వచ్చారు. 45 వేలకు పైగా కార్మికులకు సమ్మె అవసరం లేకుండానే '8 గంటల పనిదినం' వచ్చేసింది. ఆ తర్వాత..."కర్మాగారాలు, యంత్రాల పొడవైన గొట్టాల నుంచి పొగ సుళ్ళు తిరుగడం లేదు. గందరగోళ వాతావారణం రాజ్యమేలుతోంది" అని ఒక చికాగో పత్రిక వ్యాఖ్యానించింది.

ఆరోజు ఏమైందంటే!....

ఇంచుమించు పదిగంటలైనపుడు పార్సన్స్, ఫీల్డెన్‌ను సభకు పరిచయం చేశాడు. ఫీల్డెన్ పది నిముషాలు మాట్లాడగానే తుఫాను సూచనలు కనబడి జనం అంతా రక్షణ కోసం వెదకటం మొదలుపెట్టారు. అక్కడ అప్పుడు 200 మందికంటే ఎక్కువ లేరు. ఫీల్డెన్ ఉపన్యాసం ముగిస్తున్నాడు. హఠాత్తుగా బోన్‌ఫీల్డ్, విలియంవార్డ్‌ల నాయకత్వంలో 180 మంది పోలీసుల దళం ఉపన్యాసకుని వైపు రాసాగింది. పోలీస్ ట్రక్ వాగన్ రెండు మూడు గజాల దూరంలో ఆగిపోయింది. కెప్టెన్‌వార్డ్ సభికులవైపు తిరిగి ఉన్న వారున్నట్లు వెళ్ళిపోవలసిందిగా ఆజ్ఞాపించాడు. ఒక్కక్షణం ఆగి తిరిగి అదేరకంగా ఆజ్ఞాపించాడు. ఫీల్డెన్ "మేము శాంతియుతంగానే ఉన్నాము కదా" అని అభ్యంతర పెట్టాడు. అప్పుడే అతడూ, స్పీస్ మొదలైనవారూ వేదిక నుంచి కిందికి దిగుతున్నారు.

అదేక్షణం పోలీసుల మధ్య ఒక బాంబు పడింది. దానితో పోలీసులు ప్రేక్షకులపై కాల్పులు మొదలుపెట్టారు. పోలీసుల గుండ్ల వలన ఎంతమంది మరణించారో, ఎంతమంది గాయపడ్డారో... సరిగా తెలియదు, తెలియలేదు. మతయాన్‌బేగన్ అనే పోలీసు అక్కడే మరణించాడు. మరో ఆరుగురు తరువాత చనిపోయారు.

చికాగో నగరమంతా విధ్వంస పాలన ప్రారంభమైంది. పత్రికలు, చర్చి అధికారులు ఆ బాంబు సోషలిస్టులూ, అనార్కిస్టులూ, కమ్యూనిస్టులూ విసిరారని చెబుతూ ప్రతీకారాన్ని రెచ్చగొట్టారు.

కార్మిక నివాస ప్రాంతాలన్నిటిపై దాడి జరిపి పోలీసులు తమకు తెలిసిన అనార్కిస్టులను, సోషలిస్టులను అరెస్టు చేశారు. సభా స్థలాలు, అచ్చు ఆఫీసులు, కొందరి గృహాలు బలవంతంగా సోదాచేయబడ్డాయి. "వారంటు లేకుండా ఇళ్ళపై దాడులు జరిగాయి. ఆధారాలకోసం ఇళ్ళను చిందరవందర చేశారు. అనుమానితులను కొట్టారు. తీవ్ర హింసలపాలు చేశారు. సోషలిజం, అనార్కిజం అనే పదాలకు అర్థం తెలియని అమాయక పౌరులను పోలీసులు హింసించారు. పోలీసులకు అనుకూల సాక్ష్యం ఇవ్వడానికి కొందరికి లంచం ఎరగా చూపారు." అని రాశాడు ప్రొఫెసర్ విష్. ప్రభుత్వ ఎటార్నీ సెర్చ్ వారంట్లను గురించి అడిగితే "ముందు దాడి జరపండి, చట్టం సంగతి తరువాత చూసుకోవచ్చు" అని బహిరంగంగా చెప్పాడు.

మే 27వ తేదీన 31 మంది మీద నేరం ఆరోపించబడింది. మతయాస్, బేగన్ ఆ హత్యకై కుట్రలో భాగస్వాములని వారిపై ఆరోపణ. వారిలో 8 మందిమీదే విచారణ జరిగింది. చాలా మంది అప్రూవర్‌లుగా మారి రక్షణ పొందారు. రూడోల్ఫ్‌స్నాబెల్ట్ అనే వ్యక్తి అరెస్టయి, ఆ వెంటనే విడుదలై, తరువాత ఎన్నటికీ కనబడకుండా పోయాడు.

రుజువులు లేని ఆరోపణ :

నిందితులలో ఎవరైనా బాంబు విసిరినట్టుగానీ, పెట్టినట్టుగానీ ప్రభుత్వం రుజువులేమీ చూపించలేకపోయింది. అలాగే బాంబు విసరడం విషయంలో ఏ రకమైన సంబంధాన్ని నిందితులకు అంటగట్టలేకపోయింది. అసలు ఈ చర్యను ఏ రకంగానైనా నిందితులు సమర్థించినట్టుగానీ, ప్రోత్సహించినట్టుగానీ ప్రభుత్వం రుజువు చేయలేక పోయింది. నిజానికి నిందితులలో ముగ్గురు మాత్రమే స్పీస్, పార్సన్స్, ఫీల్డెన్-బాంబు పేలిన ప్రదేశంలో ఉన్నారు. ఆ క్షణాన ఉన్నది స్పీస్, ఫీల్డెన్‌లు మాత్రమే. ఉపన్యాసకులు హింసను ప్రోత్సహించినట్లు ఆధారం చూపించలేక పోయినారు. అసలు ఆ ఉపన్యాసాలన్నీ చాలా "సాధువుగా" ఉన్నాయని మేయర్ చెప్పాడు. విధ్వంసాన్ని గురించి ఆలోచించిన దాఖలాలు కూడా లేవు. పార్సన్స్ తనతోపాటు తన భార్యను, ఇద్దరు పిల్లలను సభకు తీసుకువచ్చాడు.

నన్ను ఉరితీసి వారిని వదలండి!...

ముద్దాయిల్లో ఇద్దరు- ఫీల్డెన్, ష్వాబ్- తమను రక్షించమని గవర్నర్‌కు వినతి పత్రం రాసారు. స్పీస్ తనను ఉరితీసి మిగతావారిని విడుదల



చేయవలసిందిగా గవర్నరును కోరాడు. వారు ముగ్గురూ గవర్నరుకు రాసిన లేఖలో "ఆత్మరక్షణ విషయంలో మినహా మేమెప్పుడూ హింసను ప్రబోధించలేదు.... మేమన్నదీ, చేసిందీ ఏదైనా... అది బహిరంగంగానే జరిగింది. మేము చట్టవిరుద్ధమైన పనిని దేన్నీ బలపరచలేదు; అందుకు ఏ తంత్రాలు పన్నలేదు. ప్రస్తుత సామాజిక వ్యవస్థను విమర్శించేటప్పుడు... రాతలోనూ.... ఉపన్యాసాల్లో అసమానతలను బహిర్గతం చేసేటప్పుడూ..... ఏ చట్టాన్నీ మేము ధిక్కరించ లేదు" అని రాసారు.

జడ్జి గారీ, ప్రాసిక్యూటర్ గ్రిన్నల్ కూడా ష్వాబ్, ఫీల్డెన్‌లకు క్షమాభిక్ష పెట్టమని అడిగారు. వారిని యావజ్జీవ ఖైదుకు తగ్గించారు. ఉరితీయడానికి ముందు రోజు లింగ్ బాంబు నోట్లో పేల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పార్సన్సు, స్పీస్, ఎంజెల్, ఫిషర్...లను 11-11-1887న ఉరితీసారు. అధికారులు శవాలను అయిన వారికిచ్చారు. చికాగో చరిత్రలో ఒక పెద్ద ఊరేగింపు జరిగింది. శవవాహక శకటం నడిచిన దారిలో దాదాపు 5 లక్షల మంది నిలిచి ఉన్నారని అంచనా. వాల్డీమ్ శ్మశానంలో ఆ అయిదు శవపేటికలనూ- లింగ్‌తో సహా- తాత్కాలికంగా ఖననం చేశారు. అక్కడకు దాదాపు 25 వేల మంది హాజరయ్యారు. 12-11-1887న ఆ శవపేటికలను శాశ్వత సమాధుల్లో పాతిపెట్టారు. వాల్డీమ్ శ్మశానంలో వారి స్మారక చిహ్నాం ఆవిష్కరించబడింది.

ఈ సంఘటన అనంతరం అంతర్జాతీయ కార్మిక ప్రతినిధులు సమావేశమై ప్రతి సంవత్సరం మే 1వ తేదిని కార్మికవర్గ దీక్షా దినంగా పాటించాల ని నిర్ణయించారు. ఆ మేరకు అప్పటి నుంచి 117 సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా యావన్మంది కార్మికులు, కష్టజీవులు మేడేని దీక్షా దినంగా జరుపుకుంటున్నారు.

- పి.శ్రీనివాస్

తీర్మానం

దేశం కోసం.... "PEOPLE FOR INDIA"

(ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 19వ మహాసభల సందర్భంగా 'పీపుల్ ఫర్ ఇండియా' తీర్మానం సారాంశం...)

AIIEA 19వ మహాసభలలో కొన్ని సంచలనాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. అన్ని నిర్ణయాలలో కెల్లా అత్యుత్తమ నిర్ణయం- దేశంలోని 2048 బ్రాంచి సెంటర్లలో "PEOPLE FOR INDIA" వేదికలను ఏర్పాటు చేయడం.

సమస్యల మూలాన్ని కనిపెట్టాలి : మన రంగానికే పరిమితం చేసిన పోరాటాల వలన మనం తాత్కాలిక విజయాలు సాధించినా అవి శాశ్వత పరిష్కారాలు మాత్రం కావు. నేడు మన ముందున్న సమస్యలు ఏ ఒక్క రంగానికో పరిమితమైనవి కావు. వాటి పరిష్కారం కోసం అన్ని రకాల ప్రజలతో కలసి.. మనం మన రంగం పరిధి నుంచి బయటపడి, విశాల ఐక్యపోరాటాలు చేపట్టాలి. ముందు మనం వివిధ రంగాల సమస్యలకు మూలాలను కూలంకషంగా అర్థం చేసుకోవాలి. ఆ సమస్యలకు పరిష్కార మార్గాల్ని తెలుసుకోవాలి.

ఆ సమస్యలు ప్రజలనందర్ని బాధిస్తున్నవి. ఏ సమస్య కూడా ఏ ఒక్క రంగానికే చెందినది కాదు. కొన్ని సమస్యలు సంఘటిత రంగంలోని కార్మికులకంటే అసంఘటితరంగ కార్మికులకు ఎక్కువ నష్టాన్ని కల్గిస్తున్నాయి. నేటి ఆర్థిక విధానాల దుష్ప్రభావాలు సంఘటిత రంగం మీద కంటే కూడా అసంఘటిత రంగం మీదనే తీవ్రంగా వున్నాయి.

ప్రజలతో మమేకం కావాలి : మనం మన పరిశ్రమకే పరిమితమై పోరాటం చేస్తే లాభం లేదు. దీనివలన మనకు మరికొన్ని నష్టాలు కూడా వున్నాయి. మనం ప్రజలతో కలసి పోరాడకుంటే అసంఘటిత రంగంలోని ప్రజలు మనల్ని అపార్థం చేసుకుంటారు. మనం జీతభత్యాలు సంపాదించుకుంటూ సమాజంలో మంచి జీవనం గడిపే వారమని, అందుకే మనం వాళ్ళతో కలవమని వారు అనుకుంటారు. మనల్ని స్వార్థపరులని కూడా భావిస్తారు. పాలకవర్గాలు కూడా మన మీద ద్వేషం కలిగేలా ఇటువంటి వాదనలను వారి మనస్సుల్లో జొప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. అందువలననే మనం గత కొద్ది సంవత్సరాలుగా ముందు కార్మికవర్గంలో, ఆ తర్వాత ప్రజలలో విశాల ఐక్యత సాధించేందుకు కృషి చేస్తున్నాము.

ఇటువంటి విశాల ఐక్యతను సాధించేందుకై మనం ఎన్నో ప్రచారాలు, పోరాటాలు చేపట్టాం. ప్రజలలో ఒక అవగాహనను పెంచేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశాము. కానీ ఇప్పటి వరకూ మన ప్రయత్నాలలో మనం సంపూర్ణ సఫలీకృతులం కాలేదు.

ఈ పథకం వుద్దేశ్యమేమిటి? అందువల్లనే AIIEA 19వ మహాసభ "PEOPLE FOR INDIA" కమిటీలను ఏర్పరచాలని నిర్ణయం తీసుకుంది. తద్వారా మనం ఇప్పటివరకు సాధించలేకపోయిన AIIEA సుందర స్వప్నాన్ని కనీసం ఇప్పటికైనా నిజం చేద్దాం. పదండి అసలు యొక్క ముఖ్యోద్దేశ్యమేమిటి! తెలుసుకుందాం!

కొన్ని సమయాల్లో ఉద్యోగులుగా మనం చాలా గొప్ప అవగాహన కలిగిన వారమనే అభిప్రాయంలో వుంటాం. మనం భారతదేశ పౌరులమనే సంగతి మర్చిపోతూంటాం. ఈ దేశ పౌరులము కాబట్టే మనకు కార్మిక హక్కులంటూ కొన్ని ఏర్పడ్డాయి. మన హక్కులకు చట్టపరమైన భద్రత ఏర్పడ్డది. రాజ్యాంగం ఏర్పరచిన పౌర హక్కులే మన కార్మిక సంఘానికి పునాది. మనకున్న చట్టపరమైన భద్రత భారతదేశ పౌరులుగా మనకు లభించింది.

మనం ఈ సువిశాల భారతదేశంలోని పౌరులమని మనం భావించాలి. అప్పుడు మాత్రమే మనం కార్మికులుగా మన సంఘజీవనంలో రావాల్సిన కొన్ని మార్పులు తేచ్చే క్రమంలో మన పాత్ర ఏమిటో, సాధ్యాసాధ్యాలేమిటో బాగా అర్థం చేసుకోగలం.

నేటి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు పూర్తిగా రాజకీయ దురుద్దేశ్యాలతో కూడినవి. వీటి వలన ప్రజాస్వామ్య హక్కులు కాలరాయబడుతున్నాయి. ఇప్పుడున్న హక్కులు చాలా అమూల్యమైనవి.. కానీ వాటిని మనం నిరంతర పోరాటాల ద్వారా కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీలయినంత వరకూ అవి బూర్జువా, పెట్టుబడిదారీ వర్గాలకు అనువుగా వున్నాయి. ఇటీవలి కాలంలో సామ్రాజ్యవాదుల ఒత్తిడికి లొంగి ఆ చట్టాలను కూడా సవరణలు చేస్తున్నారు. ప్రజాస్వామ్యం పై దాడి రోజురోజుకీ తీవ్రమౌతున్నది. దానికి తోడు ఇటీవలి కాలంలో మతోన్మాదమనే మహమ్మారి ప్రభుత్వ ఆధ్వర్యంలో పెట్రేగిపోతున్నది.

మన ప్రధాన కర్తవ్యం: ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలు, దేశంలోని అన్ని వర్గాల ప్రజలను, ఉద్యోగులను, రైతులను, మధ్యతరగతి వారిని, మేధావులను, సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులను నాశనం చేస్తున్నాయి. మేధావి వర్గంలో కొంతమంది వీటన్నిటికీ అతీతంగా వున్నారు. మరికొంత మంది ఈ అనర్థాలన్నిటినీ పూర్తిగా అర్థం చేసుకున్నా, ఏం చేయాలో, ఎలా చేయాలో తెలియక నిరుత్సాహంతో కొట్టుమిట్టాడుతున్నారు. కొంతమంది ప్రజలకు ఈ అనర్థాలన్నీ అర్థం కావు. మరికొంతమంది అసలు పట్టించుకోరు. అతికొద్ది మంది మాత్రమే మన ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యాలకు భంగం వాటిల్లినదని అర్థం చేసుకొన్నారు. వీరందరినీ ఐక్యపరచి, వారందరిలో ఈ దుష్పరిమాణాల గురించి అవగాహన కలిగించి, నేటి పరిస్థితులలో వారి బాధ్యతలను తెలియజేయటమే మన ప్రధాన కర్తవ్యం.

కార్మికవర్గంలో ఐక్యతను సాధించడమనేది నిర్విరామంగా చేయాల్సిన ప్రక్రియ. ఇందులో మనం విజయం సాధించాలి. అనేక మంది ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకతను బహిరంగంగా వ్యక్తీకరించడం లేదు. ఒకవేళ వ్యక్తీకరించినా అవి వారి వారి రంగాలకే పరిమితమై ఉన్నాయి. ఈ వ్యతిరేకతలన్నింటికీ ఒకరూపం గల్పించి, ఐక్యవేదిక ద్వారా వ్యక్తీకరించాలి. తద్వారా ఎంతో బలమైన శక్తిగా మనం రూపొందగలము. ప్రపంచీకరణ వ్యతిరేక వుద్యమానికి ఒక సరైన దిశ నేర్పరచగలిగితే మనం ఒక తిరుగులేని ప్రజా పోరాట శక్తిగా రూపొందగలము. ఇదే మన "PEOPLE FOR INDIA" కమిటీల ముఖ్యోద్దేశ్యము.

మూలం దోపిడీ వ్యవస్థ:

ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడే కొన్ని రంగాల ప్రజలను కలిపే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ వారు దేశ రాజకీయా లకు దూరంగా ఉండాలని అనుకుంటున్నారు. ఈ ఆలోచనే ఆసంబద్ధం. ప్రమాదకరం. రాజకీయాలకు దూరంగా ఉండి సమస్యకు పరిష్కార మార్గం కనుగొనాలంటే సాధ్యంకాదు. ఈ సమస్యలన్నీ దోపిడీ వ్యవస్థ నుంచి ఉత్పన్నమయినవి. సమస్యలకు మూలమైన వ్యవస్థను మార్చే ప్రయత్నం

(కొనసాగింపు 22వ పేజిలో)



సినిమా

అందని 'హరివిల్లు'

హరివిల్లు అపురూపంగా లభించే ప్రకృతి సహజమైన అద్భుత దృశ్యం. దానిని స్వంతం చేసుకోవడం ఎవరివల్ల కాదు. ఆ మనోహర దృశ్యం చూసినపుడు పొందే మధురానుభూతిని మాత్రమే ఎవరైనా స్వంతం చేసుకోగలరు. ఆ అనుభూతినే ఇతరులతో పంచుకుంటూ అవ్యక్తానందం పొందుతారు.

అలాగే ఎవరి జీవితం వారిది. ఎవరి అనుభూతులు వారివి. ఒకరి జీవితాన్ని మరొకరు స్వంతం చేసుకోలేరు. కాని ఒకరి అనుభూతులు , భావాలు మరొకరికి పంచుకుంటూ ఒకరికొకరు దగ్గరవుతారు. మానసికంగా సన్నిహితులౌతారు. అప్పుడే ఆత్మీయత అనుబంధాన్ని పెంచుకుంటారు. అదే జీవిత పరమానంద భరితం అవుతుందనే సునిశితమైన సందేశాన్ని ఇటీవల విడుదలైన హరివిల్లు చిత్రం అందిస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వంచే వినోదపు పన్ను మినహాయించబడిన ఈ చిత్రానికి నిర్దేశకులు శ్రీ బి. నర్సింగరావు.

నర్సింగరావు పేరు వినగానే మాభూమి, దాసి, మట్టి మనుషులు, రంగులకల వంటి అవార్డు చిత్రాలు గుర్తుకు వస్తాయి. సినీ కళావిలువలతో పాటు సామాజిక విలువలకు కూడా అత్యంత ప్రాధాన్యతనిచ్చే అతికొద్ది దర్శకులలో శ్రీ నర్సింగరావు ఒకరు. కాని అంత ఆశతో వెళ్ళిన ప్రేక్షకులకు ఈ చిత్రం మాత్రం నిరాశ కల్గించిందని చెప్పక తప్పదు.

ఇది బాలల చిత్రం. 12ఏళ్ళ పాత్ర రవి (సాయి శుభకర్) చిత్ర కథానాయకుడు. రవి తండ్రి ఉన్నత ఉద్యోగి (భానుచందర్) సంపన్న కుటుంబం. తల్లి (హరిత) ఇంటిపట్టునే ఉంటుంది.

చిత్ర ప్రారంభంలోనే రవికి క్యాన్సర్ వ్యాధి వస్తుంది. తాను బ్రతికేది కొంతకాలమనే విషయం రవికి కూడా తెలుస్తుంది. దాంతో ఇంట్లో ఓ భయంకరమైన గంభీరమైన వాతావరణం నెలకొంటుంది.

రవిని ఎలాగూ బ్రతికించుకోలేము అనుకుని దు:ఖాన్ని దిగమింగుతూ ఉన్న కొద్దిరోజులైనా రవిని ఎలా ఆనందంగా ఉంచాలా! అనేదే రవి తల్లి తండ్రుల తపన. రవికి చావు గురించి తెలిసినప్పటి నుండి అదోరకమైన పిచ్చిభయం వెంటాడుతుంది. ఇందుకు ప్రతీకగా ఓ పిచ్చివాని పాత్ర కన్పిస్తుంది. ఏమీ తోచదు. అయినా ఆనందం కోసం తన స్వంత ప్రపంచాన్ని నిర్మించుకునేందుకు నిత్యం ఘర్షణకు పడుతుంటాడు. తల్లిదండ్రుల

నుండి ఇతరుల నుండి ఆ ఆనందాన్ని పొందలేడు. అదిగో అప్పుడే తన ఏకాంత ఎడారిలోకి ఒయాసిస్‌లా గౌరి (నిత్య) అనే పని పిల్ల ప్రవేశిస్తుంది.

చిత్ర నిర్మాత శ్రీ డి.రామానాయుడు, ఫోటోగ్రఫి శ్రీ ఎ.కె. బీర్ పాత్రోచిత నటనలు పుష్కలంగావున్నా అర్ధవంతంగా, ఆకర్షణీయంగా మలచడంలో దర్శకుడు సాఫల్యం కాకపోవడం వలన సామాన్య ప్రేక్షకుడికి హరివిల్లు చిత్రం అందకుండా పోయింది.

\- శైలి.

ప్రేక్షకుడి సహనానికి పరీక్ష 'జానీ'

'దర్శకత్వం ఎలా చేయకూడదో నేర్చుకోవాలనుకునే వారు ఈ సినిమా చూడాలి'

'సామాన్య తెలుగు ప్రేక్షకుడికి అర్థం కాని, అక్కరలేని చిత్రం'

'జానీ' చిత్ర సమీక్షపై ప్రముఖ సినిమా వెబ్‌సైట్లు చేసిన వ్యాఖ్యలు అవి. పవన్ కళ్యాణ్ రెండేళ్లపాటు శ్రమించి, దర్శకత్వం వహించి, స్క్రీన్ ప్లే రాసి, నటించిన 'జానీ' ప్రేక్షకులకు మాత్రం పెద్ద నిరాశను మిగిల్చింది. ఈ చిత్రంలో సందేశం ఏమీ లేదు. ప్రేక్షకుణ్ని మెప్పించే వినోదమూ లేదు.

తండ్రి ఉండికూడా అనాధగా పెరిగిన జానీ ఓకరాటే కోచ్. మరోక అనాధ అయిన శాంతి (రేణు దేశాయ్) ప్రేమలో పడతాడు. పెళ్ళైన కొద్ది రోజులకే శాంతికి బ్లడ్ క్యాన్సర్ ఉన్నట్లు బయటపడుతుంది. వ్యాధి ముదరడంతో వైద్యానికి లక్షల రూపాయలు ఖర్చు అవుతాయి. కరాటే వీరుడైన జానీ ముంబాయి హర్బర్‌లో ముష్టి యుద్ధాల్లో గెలిచి ఆ డబ్బుతో భార్యను బతికించుకుంటాడు. కథ చిన్నదే అయినా సినిమా మొదటి అర్థభాగం ముగిసే దాకా అసలు కథేంటో ప్రేక్షకుడికి అర్థం కాదు.

చిత్రం మొదటి భాగం చాలా నెమ్మదిగా నడువగా, రెండో అర్థభాగంలో ప్రేక్షకుడికి నరకం కనిపిస్తుంది! చిత్రంలో సెట్టింగ్‌లు నెటివేటికి చాలా దూరంగా ఉన్నాయి. కొన్ని సన్నివేశాల చిత్రీకరణ గమనిస్తే హాలీవుడ్ చిత్రాలను మక్కీకి మక్కి అనుకరించినట్లు ఉంటుంది. ఇంగ్లీషు, హిందీ సంభాషణలు ఎక్కువగా ఉన్నాయి. మొత్తం మీద సంభాషణలే తక్కువ కాగా ప్రేక్షకుడు హాయిగా, బిగ్గరగా నవ్వుకునే ఒక్క డైలాగు కాని, సన్నివేశం కానీ లేవు. సంభాషణలు ఎక్కువగా పూర్తి తెలంగాణా యాసలో ఉండడం, రికార్డింగ్ సరిగ్గాలేకపోవడంతో కొన్ని సన్నివేశాల్లో డైలాగులు అర్థం కాలేదు.

రమణ గోగుల అందించిన పాటలు అన్నీ బాగానే ఉన్నాయి. అయితే కొన్ని పాటల కోసం కావాలని సన్నివేశాలను కల్పించినట్లు అనిపిస్తుంది. ఈ సినిమా మొత్తం మీద చెప్పుకోదగినది ఫోటోగ్రఫీ. శ్యామ్‌లామ్, చోటా కె.నాయుడు సంయుక్తంగా అందించిన ఫోటోగ్రఫీ చాలా క్వాలిటీగా ఉంది. అయితే చిత్రకథతో సంబంధం లేకుండా, చిత్ర గమనానికి అవసరం లేని ఫోటోగ్రఫీ అక్కడక్కడా కనిపిస్తుంది. విజయ్, రిడ్లే సమకూర్చిన థ్రిల్స్ మరో మంచి అంశం. ముఖ్యంగా చిత్రం చివర్లో విదేశీ ఫైటర్లతో రిడ్లే అందించిన థ్రిల్స్ యాక్షన్ చిత్రాలు ఇష్టపడే ప్రేక్షకులను బాగా అలరిస్తాయి.

\- గమిడి శ్రీనివాస్

❑ లీగల్‌నోట్స్

కంపెన్‌సేషన్ ఇచ్చినా ఉద్యోగం కూడా ఇవ్వాలి.

ఢిల్లీ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్‌లో ఉద్యోగి కుల్‌దిప్ సింగ్. ఆమె ప్రమాదంలో గాయపడ్డది. అందుకుగాను ఆమెకు 33,125 రూ.లు చెల్లించారు. అలాగే వర్క్‌మెన్ కంపెన్‌సేషన్‌గా 70,941.60 రూ.లు చెల్లించారు. 33,125 రూ.లను మెడికల్ ఖర్చులుగా ఇచ్చారు. కానీ ఆమెకు ఉద్యోగం ఇవ్వడానికి కార్పొరేషన్ నిరాకరించింది.

Persons with Disabilities (Equal Opportunities, Protection of Rights and Full Participation) Act 1995- Sec.47- ప్రకారం కంపెన్‌సేషన్ ఇచ్చినప్పటికి కార్పొరేషన్లో ఉద్యోగం ఇవ్వాలని వివాదం నడిచింది. ఒకవేళ కార్పొరేషన్‌లో ఖాళీలు లేకపోతే ఒక సూపర్ న్యూమరీ ఖాళీని సృష్టించి అందులో ఆమెకు ఉద్యోగం ఇవ్వాలని ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చింది.

గతంలో ఇటువంటి వివాదంలోనే సుప్రీంకోర్టు (కున్వర్ పాల్ సింగ్ V ఢిల్లీ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ సివిల్ అప్పీల్ నెం.1864/2000, స్పెషల్ లీవ్ పిటిషన్ (సి) 7997/1999లో ఇచ్చిన తీర్పును బట్టి ఈ తీర్పు ఇవ్వబడింది.

ఆమెకు క్లాస్ IV ఉద్యోగం 8 వారాలలో ఇవ్వాలని ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చింది.

ఆధారం : C.W.No.1137/1996 dt August 13, 2002) LLJ 672

❖

వినిమయ ధరల సూచిక (2001-2002)
(బేస్ 1982=100)

సెంటర్ సీరిస్	జనవరి 2002	ఫిబ్రవరి 2003	ఫ్యాక్టర్
ఆలిండియా	483	484	4.93
హైదరాబాద్	478	481	5.23
గుంటూరు	488	495	5.60
గూడూరు	462	464	4.33
విశాఖపట్నం	476	475	4.64
వరంగల్	512	523	4.48
కొత్తగూడెం	496	491	-
రాష్ట్ర సీరిస్			(1960=100)
విజయనగరం	420	420	-
రాజమండ్రి	467	468	4.62
విజయవాడ	453	453	-
ఆదోని	479	479	4.38
ఎన్ఎస్‌బి కాంప్లెక్స్	474	474	4.76
ఎంజిపి కాంప్లెక్స్	460	461	-
ఎ.పి	-	-	4.97

సమాచారం వనరు : డైరెక్టరు ఆఫ్ ఎకనమిక్స్ & స్టాటిస్టిక్స్ - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము జారీ చేసినది.
ది లేబర్ బ్యూరో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా

చదవండి చదివించండి
వర్కింగ్ క్లాస్
సిఐటియు జాతీయ మాసపత్రిక

రిటైర్ అయిన సింగరేణి ఉద్యోగులు పెన్షన్ స్కీమ్ గురించి తరచు ప్రశ్నిస్తున్నారు. అందువలన వారికి ఈ స్కీమ్ ఎలా వర్తిస్తుందో తెలియపరచటానికి ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను యధాతధంగా ఈ క్రింద ఇస్తున్నాం.

Coal Mines Pension
(Amendment) Scheme, 2002

Notification No.G.S.R. 482 (E) dated 08-07-2002)
[Gazette of India, Extra-ordinary, Part II, Section 3(ii), Page 2, [No.311] dated 08-07-2002]

In exercise of the powers conferred by Section 3-E of the Coal Mines Provident Fund and Miscellaneous Provisions Act, 1948, 1948 (46 of 1948), the Central Government hereby makes the following amendments to the Coal Mines Pension Scheme, 1998 namely :-

1. (1) This Scheme may be called the Coal Mines Pension (Amendment) Scheme, 2002.
2. In the Coal Mines Pension Scheme, 1998, in paragraph 4, after sub-paragraph (2A), the following shall be inserted namely:-

"(2B) An ex-employee who had not opted for the Coal Mines Family Pension Scheme, 1971 but was covered by the Coal Mines Provident Fund Scheme and had superannuated within April 1, 1994 to March 31, 1998 may opt for Pension under the provisions of this Scheme within a period of nine months from the date of this notification in the Official Gazette and he shall be deemed to have become the member of the Scheme from the date of his exercising the option in Form PS-1:

Provided that an ex-employee exercising the option under the provisions of this sub-paragraph shall have to deposit in the Pension Fund either in cash or by transfer from his Provident Fund account to the Pension Fund the arrears equivalent to the amounts specified in Clauses (b), (c), (d) and (e) of paragraph 3, along with interest from the 1st day of March, 1971 till the date of exercising the option in respect of arrears;

(i) Specified in Clause (b) at the rate admissible from time to time to the monies in Coal Mines Provident Fund;

(ii) Specified in Clause (c) and (d), at the rate of twelve percent per annum; and

(iii) Specified in Clause (e) as such rate as the Central Government from time to time, credited interest in respect of its contribution to the Coal Mines Family Pension Scheme, 1971."

❖

మ
హా
స
భ
లు

కేంద్ర చట్టాన్ని అమలు చేయాలి.

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర 3వ మహాసభల పిలుపు

ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర 3వ మహాసభలు నెల్లూరు ఎస్.కె.ఖాజామియా, ఎస్.కె ఖాదర్ మస్తాన్ నగర్‌లో మార్చి 31 నుండి ఏప్రిల్ 1 వరకు జయప్రదంగా జరిగాయి. 18 జిల్లాల నుండి 190 మంది ప్రతినిధులు సభకు హాజరయ్యారు. ఫెడరేషన్ సీనియర్ నాయకులు సుబ్బన్న జెండా ఆవిష్కరణ చేశారు. అఖిలభారత అధ్యక్షులు ఆర్.సింగరవేలు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వీరయ్యలు ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఆహ్వానసంఘం గౌరవాధ్యక్షులు జక్కా వెంకయ్య స్వాగతోపన్యాసం చేశారు. కార్యదర్శి నివేదికను భూపాల్ ప్రవేశపెట్టారు.

ప్రతినిధుల సభకు ఆర్.కోటంరాజు, పి.సుబ్బన్న, పి.ఎల్లయ్య, పోలేశ్వరరావు, కిల్ల నర్సింహరావులు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఫెడరేషన్ మాజి ప్రధాన కార్యదర్శి ఉమమహేశ్వరరావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు నారుక్రిష్ణయ్య సభలో ప్రసంగించారు. యుఎఎయు రాష్ట్ర అధ్యక్షులు సూరిబాబు, మెడికల్ రిప్స్ నాయకులు శ్రీనివాసరావు, శ్రామిక మహిళల నాయకురాలు రెహనబేగం, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర డిప్యూటి జనరల్ సెక్రటరీ దశరధ రామయ్యలు సందేశాలు ఇచ్చారు.

ఈ మహాసభలో క్రింది తీర్మానాలను ఆమోదించారు.

ఇరాక్‌పై అమెరికా అక్రమ దాడిని ఖండించాలని, కరువు సమస్యను పరిష్కరించాలని, భవన నిర్మాణ కార్మికులకు సమగ్రశాసనం చేయాలని, 2వ లేబర్ కమిషన్ సిఫార్సులను ఉపసంహరించాలని తీర్మానాలు చేశారు.

నెల్లూరు పట్టణంలో 2000 మందితో ప్రదర్శన జరిగింది. నర్తకిసెంటర్ ఫలణి ప్రాంగణంలో బహిరంగసభ జరిగింది. ఈ సభలో ఎస్.వీరయ్య, ఆర్.సింగారవేలు, వి.ఉమామహేశ్వర రావు, జక్కా వెంకయ్య, ఆర్.కోటం రాజు, చిట్టేటి రమణారెడ్డి, నారు క్రిష్ణయ్య, డి.సుబ్బన్న, ఎం.గురవయ్య, భాస్కర్, భూపాల్ ప్రసంగించారు.

నూతన నాయకత్వం :

రాష్ట్ర అధ్యక్షులు **ఆర్.కోటంరాజు**, ప్రధాన కార్యదర్శి **భూపాల్**, ఉపాధ్యక్షులు **పి. నరసింహారావు, హరినాధరావు, పి.ఎల్లయ్య, కో-ఆప్షన్**, సహాయ కార్యదర్శులు **పోలేశ్వరరావు, ఓ.గోవిందరాజు, జమాల్ , యాదగిరి**, కోశాధికారి **ఎం.గురవయ్య**, 23 మందితో వర్కింగ్ కమిటీ సభ్యులు.

విరాళాల సేకరణ

మహాసభల సందర్భంగా ప్రతినిధులు ప్రజల నుండి గంజి కేంద్రాల సహాయం కోసం నిధి సేకరణ జరిపారు. విరాళంగా వచ్చిన రూ.1418లు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వీరయ్యగారికి అందించారు.

సమ్మె జయప్రదానికై రాష్ట్ర సదస్సు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక, పారిశ్రామిక విధానాలను తిప్పికొట్టాల్సిందిగా ఏప్రిల్ 20న సుందరయ్య కళానిలయంలో జరిగిన కేంద్ర కార్మిక సంఘాల రాష్ట్ర సదస్సు పిలుపునిచ్చింది.

సిఐటియు, ఎఐటియుసి, హెచ్ఎంఎస్, యుటియుసి(ఎల్ఎస్), ఐఎఫ్‌టియు, ఎఐఎఫ్‌టియు, ఎఐఐఇఎ, బిఇఎఫ్ఐ రాష్ట్ర ప్రభుత్వ రంగ కార్మికుల ఫెడరేషన్ ఎంప్లాయిూస్ యూనియన్ వంటి అనేక సంఘాలు సమిష్టిగా ఈ సదస్సును నిర్వహించాయి.

ముందుగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్.వీరయ్య తీర్మానం ప్రవేశపెడ్తూ పాలకులు ఎంత తీవ్రంగా ఈ విధానాలను ప్రవేశపెడ్తున్నారో అంత కంటే తీవ్రంగా ప్రతిఘటన కూడా వస్తోందని మే 21 సమ్మెలో ఐఎన్‌టియుసి, బిఎంఎస్‌లు కల్సి రాకపోవటం దురదృష్టకరమని వారు అనుయాయులు కూడా పాల్గొనేలా అందరూ కృషి చేయాలని సదస్సులో పాల్గొన వక్తలు కోరారు.

ఈ నెలాఖరు కల్లా జిల్లా సదస్సులు పూర్తి చేయాలని, ముఖ్యమైన కేంద్రాల్లో సదస్సు మే మొదటి వారంలో పారిశ్రామిక/ మండల సదస్సులు జరపాలని, మే 6న అన్ని పరిశ్రమల్లో సమ్మె నోటీసులు ఇవ్వాలని వారు తెలియజేశారు.

ఈ తీర్మానాన్ని బలపరుస్తూ ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ పి.నాగేశ్వరరావు, హెచ్ఎంఎస్ రాష్ట్ర నాయకులు సుదర్శన్, ఐఎఫ్‌టియు నాయకులు రవి, ఎఐఎఫ్‌టియు నాయకులు చంద్రన్న, యుటియుసి(ఎల్ఎస్) నాయకులు సుధీర్ ప్రసంగించారు.

ఎఐఐఇఎ అఖిల భారత ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ , బిఇఎఫ్ఐ ఎపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వి.మాధవరావ్, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిూస్ యూనియన్ రాష్ట్ర నాయకులు పి.అశోక్ బాబు, రాష్ట్ర ప్రభుత్వరంగ పరిశ్రమల ఉద్యోగుల ఫెడరేషన్ నాయకులు ఖాన్ గారు, ఏపిఎంఎస్ఆర్‌యు నాయకులు హెచ్ నిర్లేకర్‌లు సమ్మెకు మద్దతు తెలియజేశారు.

సదస్సు

ట్రావెల్ కార్మికుల జిల్లా సదస్సు

హైదరాబాద్ సబర్బన్ ప్రాంతాలలో పనిచేసే ట్రావెల్స్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని ఏప్రిల్ 12న సుందరయ్య కళానిలయంలో జరిగిన సదస్సు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

సదస్సు కార్మికుల సమస్యలపై చర్చించి క్రింది డిమాండ్లను ఆమోదించింది.

ట్రావెల్స్‌లో కార్లు, టాటా సుమోలు, మినీ బస్సుల డ్రైవర్లు రోజుకు 14 గంటల నుండి 18 గంటలు పనిచేస్తున్నారు. జీతం అతి తక్కువగా రూ. 1800/- నుండి రూ. 2,000/-లు మాత్రమే ఇస్తున్నారు. సమయానికి పేమెంటు చెల్లించమని యజమానులను అడిగితే పనిలో నుండి తీసివేస్తున్నారు. కొట్టడం, పోలీస్‌స్టేషన్‌లో అబద్దపు కేసులు బనాయించడం రివాజుగా మారింది. ప్రభుత్వం జారీ చేసిన జి.వో.నెంబర్ 81 ప్రకారం భారీ వాహనాలు లారీ, బస్సులను నడిపే డ్రైవర్లకు నెలకు కనీస జీతం రూ. 3,890.50 పై.లు, మీడియం వాహనాలైన డి.సి.ఎం., మినీ బస్సుల డ్రైవర్లకు నెల జీతం రూ. 3,352.50 పై., లైట్ వెహికిల్స్ అయిన కార్లు, టాటా సుమోలు, జీపులను డ్రైవర్లకు నెల జీతం రూ. 2,989.50పై ఇవ్వాలి. కానీ ఏ ట్రావెల్స్‌లోను కనీసవేతనాలు అమలు చేయటం లేదు. ఇ.ఎస్.ఐ., పి.ఎఫ్., 8 గంటల పని, బోనస్, సెలవులు, అదనపు పనికి రెట్టింపు వేతనం తదితర చట్టపరమైన సౌకర్యాలేమీ అమలు జరగటం లేదు.

ప్రమాదాల్లో కాళ్ళు, చేతులు కోల్పోయినా, చనిపోయినా ఇటు యజమానులుకాని అటు ప్రభుత్వం కాని పట్టించుకోవడం లేదు. యాక్సిడెంట్ జరిగిన సందర్భంగా బండిని విడిపించుకోవడంలో ఉన్న శ్రద్ధ డ్రైవర్లను విడిపించడంలో యజమానులు కనబరచడంలేదు.

ఈ సదస్సులో సిఐటియు నగర అధ్యక్షులు ఎస్.నరసింహారెడ్డి, కార్యదర్శి ఎం.శ్రీనివాస్, మోటార్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి కె.నర్సింగరావు, జి.అప్పారావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఆటో కార్మికుల జిల్లా సదస్సు

ఏప్రిల్ 5న మెదక్ జిల్లా సంగారెడ్డిలో ఆటో కార్మికుల జిల్లా సదస్సు సిహెచ్ నర్సింహులు అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సుకు భూపాల్ హాజరై ప్రసంగించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జె.మల్లిఖార్జున్, కార్యదర్శులు కె.రాజయ్య, బి.మల్లేష్ తదితరులు ప్రసంగించారు. సదస్సులో సంగారెడ్డి సదాసివపేట, జహీరాబాద్, ఝరసంఘం, టెక్మాల్, అల్లాదుర్గం తదితర ప్రాంతాల కార్మికులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం జిల్లా కమిటీలు ఎన్నుకోవడం జరిగింది.

ఫోర్ సీటర్స్ కమిటీ అధ్యక్షులుగా **జె.మల్లిఖార్జున్**, వర్కింగ్ ప్రెసిడెంట్ **శ్రీనివాస్‌గౌడ్**, ప్రధాన కార్యదర్శి **తాహెర్‌పాషా**, కోశాధికారి **నవాజ్** మరియు 20 మంది కమిటీ ఎన్నికైంది. ❖

దేశం కోసం ..... (18వ పేజి తరువాయి భాగం)

చేయకుండా పరిష్కార మార్గాలను వెతకడమంటే రోగ నిర్ధారణ చేయకుండా... రోగాన్ని నయం చేయాలనుకోవడం లాంటిది. అందులోనూ శాశ్వత పరిష్కారం అసలు సాధ్యం కాదు. ఒక ధృడమైన రాజకీయ సైద్ధాంతిక అవగాహనతో మనం ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నించాలి.

శాశ్వత పరిష్కారం ఏమిటి? ఈ వ్యవస్థలో దోపిడీ వర్గమే సమస్యలను సృష్టిస్తుంది. వాటి పరిష్కారానికి కొన్ని చిట్కాలను వారే సూచిస్తుంటారు. అవి ప్రజలను మభ్యపరచడానికి తప్ప మరొకందుకు కాదు. వరద ఉధృతండా వచ్చినపుడు గేట్లు ఎత్తేసి చేతులు దులుపుకున్నట్లుగా ఉంటుందే తప్ప, వరద ఉధృతం లేకుండా వుండేందుకు శాశ్వత పరిష్కారం మాత్రం కనుక్కోకపోవడం లాంటిది. ప్రజా సమస్యలకు శాశ్వతంగా పరిష్కార మార్గం చూపరన్న మాట. ఆ శాశ్వత పరిష్కారం ఏమిటనేది ప్రస్తుతం మనముందున్న ప్రశ్న? ఆ ప్రశ్నకు జవాబు నిచ్చి ప్రజల సమస్యలకు పరిష్కారాలు కనుగొనడమే మన "PEOPLE FOR INDIA" యొక్క ప్రధాన కర్తవ్యం. ఇందుకు మనం విస్తృత ప్రచారాలు, పోరాటాలు చేపట్టాలి. బలమైన ఐక్యపోరాటాలను నిర్మించగలిగితే ప్రజల యొక్క వివిధ సమస్యలకు మనం పరిష్కారాలను చూపగలం.

స్థానికం పరిస్థితుల కనుగుణంగా ప్రచారాలు, సదస్సులు జరుపుతూ కార్యక్రమాలు జరుపుకోవాలి. ఏవో కొన్ని సమస్యలు దేశమంతటికీ సంబంధించినవిగా ఉండొచ్చు. కానీ ఎక్కువ సమస్యలు స్థానిక పరిస్థితులకు సంబంధించినవిగా వుంటాయి. అందుకే మన కమిటీలు స్థానికంగా స్వతంత్ర కార్యాచరణను రూపొందించు కోవాలి.

"PEOPLE FOR INDIA" ఫోరమ్స్ ద్వారా అన్ని రకాల ప్రజాస్వామ్య వాదులను, తాడిత, పీడిత ప్రజానీకాన్ని, దేశభక్తులను ఒకచోట చేర్చి, మన విస్తృత ఐక్యత దెబ్బతగలకుండా, సైద్ధాంతిక పోరాటానికి వేదికలు నిర్మించాలి.

ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పడాలి : ప్రపంచీకరణ విధానాల వలన బాధితులైన ప్రజలందరూ నేడు ప్రపంచవ్యాప్తంగా పోరాడుతున్నారు. ఈ పోరాటాలు ముఖ్యంగా సంపన్న దేశాలలో భారీ యెత్తున జరుగుతున్నాయి. ఈ పోరాటాలు రోజురోజుకీ విస్తృత పోరాటాలుగా రూపొందుతున్నాయి. ముఖ్యంగా దక్షిణ అమెరికాలో ప్రజా పోరాటాలు చాలా పెద్దయెత్తున జరుగుతున్నాయి. బ్రెజిల్, వెనిజులా, ఈక్వెడార్ లాంటి దేశాలలో ఈ పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా ప్రజాస్వామ్యవాదుల ఆధ్వర్యంలో ప్రభుత్వాలే ఏర్పడ్డాయి. ఇలాంటి రాజకీయ ప్రత్యామ్నాయాలకు దారితీసే ప్రజాపోరాటాలను మన దేశంలో కూడా చేపట్టాల్సిన అవసరం వుంది.

ప్రంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా మనం జరిపిన సుదీర్ఘ పోరాటాల ఫలితంగా ప్రజలతో మనకు మంచి సంబంధ బాంధవ్యాలు ఏర్పడ్డాయి. ఇతర కార్మిక ప్రజాసంఘాల మద్దతును మనం కూడ గట్టుకోగలిగాము. ఈ అనుభవాలు ఇటువంటి విస్తృత ఐక్యవేదికల నిర్మాణానికి మనకు తోడ్పడుతాయి.

కల నిజం కావాలి : ఇదంతా ఒక కలలా అన్పించవచ్చు. జగత్తులో ఇప్పటి వరకూ సాధించిన గొప్ప గొప్ప కార్యాలన్నీ కలలలోంచి ఉద్భవించినవేనని మనం గుర్తుంచుకోవాలి. పెద్ద పెద్ద నదీ ప్రవాహాలు కూడా ముందు చిన్న చిన్న సెలఏరులుగా ప్రారంభమైనవే. ఆ స్వప్నాన్ని ఆచరణలో పెట్టి విజయం సాధించాల్సిన బాధ్యత మనందరిదీ. ఈ సుందర స్వప్నాన్ని, అంకురిత దీక్షతో, ఆత్మస్థైర్యంతో ఆచరణలోపెట్టాలి. విజయాన్ని సాధించి, భారత కార్మికోద్యమ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయాన్ని సృష్టిద్దాం! ఈ విజయాన్ని సాధించాలంటే, ప్రజల మద్దతు తప్పవేరే దారిలేదు. ఇదే మన ధ్యేయం. ఇదే మనముందున్నబృహత్తర కర్తవ్యం.

అంతిమ విజయం మనదే... LONG LIVE AIIEA ❖



బాలలోకం

- భూపాల్

"కంపెనీ మృగరాజు"

(ఇరాక్ పై అమెరికా దురాక్రమణ తరువాత)

ఒకనొక అడవిలో ఒక సింహం వుండేది. అది అడవిలోని జంతువులను యదేచ్ఛగా వేటాడి తినేది. సింహం ఏరోజుదేని మీద వడి చంపుతుందోనని ఆ అడవిలోని జంతువులన్నీ ప్రాణాలరచేతపట్టుకొని జీవించాల్సి వచ్చేది. ఒకరోజు అడవిలోని జంతువులన్నీ సమావేశమై ప్రశాంతంగా జీవించడానికి మార్గం ఏమిటా అని ఆలోచించాయి. సింహం వేటమానుకొంటే తప్ప ప్రశాంతంగా జీవించే అవకాశం లేదనే నిర్ణయానికి వచ్చాయి. జంతువులన్నీ కలిసి సింహం దగ్గరకు వెళ్ళి తమ సమస్య చెప్పి వేటాడటం మానుకోమన్నాయి. మరి తనకు ఆహారమో అని ప్రశ్నించింది సింహం. తామే వంతుల ప్రకారం పంపుతామని చెప్పాయి జంతువులు. నాలుగురోజులకొకసారి సింహానికి అవసరమైనంత ఆహారం పంపేందుకు ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం సింహానికి ప్రయాసలేకుండా ఆహారమూ దొరికింది. ఇతర జంతువులూ ప్రశాంతంగా జీవించాయి. ఇలా అనేక సంవత్సరాలు జరిగింది.

ఇటీవల కాలంలో సింహం మళ్ళీ వేటాడటం ప్రారంభించింది. నాలుగు రోజుల కొకసారి జంతువులు పంపే ఆహారాన్ని తింటూనే మరికొన్నింటిని రోజూ వేటాడుతున్నది. అది వేటాడే జంతువుల నంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. నమన్య మళ్ళీ మెుదటికొచ్చింది. మళ్ళీ అడవిలోని జంతువులు సమావేశమయ్యాయి. మన ఒప్పందానికి విరుద్ధంగా సింహం వేటాడుతున్నది అన్నది ఒక జంతువు.గతంలో నాలుగు రోజులకొకసారి వేటాడేది. ఇప్పుడు రోజూ వేటాడుతున్నది అన్నది మరొకటి. ఒకరోజు వేటాడిన దానికంటే తరువాత రోజుల్లో రెండు, మూడురెట్లు వేటాడుతున్నది అన్నది ఇంకొకటి. ఇది మన మృగరాజు స్వభావానికి విరుద్ధం కదా! ఇలా ఎందుకు జరుగుతున్నది అని తర్కించుకున్నాయి. ఎవరైనా ఈ రహస్యం తెలిసిన వాళ్ళు చెప్పమని అధ్యక్షస్థానంలో ఉన్న జంతువు అడిగింది. కుందేలు ముందుకు వచ్చి నేను చెబుతాను అంది. జంతువులు అన్నీ కుందేలు చెప్పే విషయాలు చెవులు రిక్కించుకొని వింటున్నాయి.

'మన మృగరాజుకు' 'బహుళజాతి కంపెనీల ఆకలి' అనే జబ్బు వచ్చింది. ఇది సహజమైన ఆకలి లాంటిదికాదు. సహజమైన ఆకలి అయితే ఆహారం తింటే తగ్గుతుంది. ఆహారం అరిగిన తరువాత ఆకలవుతుంది. మళ్ళీ తింటారు. తినే తిండి పరిమాణంలో పెద్ద తేడా ఉండదు. బహుళజాతి కంపెనీల ఆకలి అలాంటిది కాదు. ఆ కంపెనీలకు మార్కెట్లు కావాలి. వాటిని తిరిగి పెట్టుబడిగా పెట్టాలంటే మరిన్ని మార్కెట్‌లు కావాలి. ఈ మార్కెట్ దాహానికి అంతులేదు. మార్కెట్‌లను స్వాధీనం చేసుకునేందుకు ఆయా దేశాలను నయానో, భయానో తమవశం చేసుకుంటాయి. "అంటే ఈ రకమైన ఆకలి ఉన్నవాళ్ళు తినే కొద్దీ మరింతగా ఆకలి పెరుగుతుందన్న మాట. ప్రతిరోజూ గతంకంటే మరింత ఎక్కువ తినాల్సి వస్తుంది. ఈజబ్బే మన మృగరాజుకు పట్టుకుంది" అని చెప్పింది. ఈ పద్ధతే కొనసాగితే మరికొన్ని రోజుల్లో మనమంతా మృగరాజుకు ఆహారం అయిపోతాము కదా! మనల్ని మనం రక్షించుకోవాలంటే మార్గం ఏమిటి అని ప్రశ్నించాయి. "అసలు ఆహారమే దొరక్కుండా చేస్తే నరిపోతుంది'' అంది కుందేలు. జంతువులన్నీ దానికి అంగీకరించాయి.

ఇందుకు రెండు మార్గలు అనుసరించాలని సభ నిర్ణయించింది. ఒకటి ఇప్పటివరకు స్వచ్ఛందంగా పంపుతున్న ఆహారాన్ని తక్షణం నిలిపివేయాలి. రెండోది మృగరాజు వేటకు బయల్దేరితే జంతువులన్నీ కలిసి దానిని ఎదర్కోవాలి. ఈ రెండు పద్ధతులూ ఏకకాలంలో అమలు జరపాలని సభ తీర్మానించింది. జంతువులన్నీ కలిసి అమలు జరిపాయి. అనతికాలంలోనే తిండిలేక, ఓపికనశించి, చిక్కిశల్యమై ఆకలితో చచ్చింది మృగరాజు. పీడవిరగడయిందని అడవిలోని జంతువులన్నీ పండుగ జరుపుకున్నాయి. తరువాత ప్రశాంతంగా జీవించాయి.

ఈ విషయం అనోట అనోట మనుషులకు తెలిసింది. ప్రస్తుతం బహుళజాతి కంపెనీల ప్రయోజనం కోసం అమెరికా తదితర దేశాలు చేస్తున్న దాడులకు కూడా ఇదే పరిష్కారం కాబోలని ఆలోచించడం మొదలెట్టారు.

- వై.నేతాజీ

మే దినోత్సవ శుభాకాంక్షలతో...

విజయ ఎలక్ట్రికల్స్ ఎంప్లాయీస్ యూనియన్

(సిఐటియు అనుబంధం), రి.నెం. ఎ-948

ఇ.నెం. 7-1-307/17/10/ఎ/1, సుభాష్‌నగర్, సనత్‌నగర్,

హైద్రాబాద్ - 500 018. ఎ.పి.

ప్రెసిడెంట్	:	బి.ఎన్. సుదర్శన్
వైస్ ప్రెసిడెంట్	:	టి. సత్యనారాయణ సింగ్
జనరల్ సెక్రటరీ	:	ఎం. తాతయ్య
జాయింట్ సెక్రటరీ	:	పి. శ్రీనివాస రెడ్డి
		టి. కుమార్ స్వామి
ఆర్గనైజింగ్ సెక్రటరీ	:	కె. తిరుపతి
		టి.వి. మోహనరావు
ట్రెజరర్	:	పి. సుబ్బారావు
అసిస్టెంట్ ట్రెజరర్	:	వి. మాధవ్ కుమార్
ఎగ్జిక్యూటివ్ మెంబర్స్	:	కె. బాల్ రాజ్
		టి. బాల రాజ్
		జి. నర్సింహ

కార్మిక హక్కులను కాలరాచే చట్టసవరణలు

బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఒకవైపున కార్మిక చట్టాలలో మార్పులు కార్మిక సంఘాలతో చర్చించే చేస్తామని చెబుతూ మరోవైపున కార్మిక చట్టాలలో కార్మికులకు నష్టదాయకమైన సవరణలను చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నది. అవి చాలవన్నట్లు మరిన్ని సవరణలను రూపొందించడానికి గ్రూఫ్ ఆఫ్ మినిస్టర్స్‌ను (మంత్రుల బృందాన్ని) ఏర్పాటు చేసింది. వాళ్ళు పారిశ్రామిక వివాదాల చట్టం మరియు కాంట్రాక్టు కార్మికుల చట్టంలో సవరణల ముసాయిదాను రూపొందించారు. ఇవి పూర్తిగా కార్మిక హక్కులను కాలరాచేవిగా ఉన్నాయి.

<u>వాటి వివరాలు :</u>

1. పారిశ్రామిక వివాదాల చట్టంలో ప్రస్తుతం ఒక పరిశ్రమలో రిట్రెంచ్‌మెంట్ మరియు మూసివేతను అమలు జరపడానికి కార్మికుల సంఖ్యపై ఆధారపడి ముందస్తూ అనుమతి పొందే నింధన ఉన్నది. దీనిని తొలగించాలని సవరణ ప్రతిపాదిస్తున్నది.

2. కాంట్రాక్టు కార్మిక చట్టంలో "నాన్-కోర్ జాప్స్" నిర్వచనాన్ని మార్చి పరిశ్రమలోని 80% పనులు ఈకోవ క్రింద వచ్చేలా చేస్తున్నారు.

ఈ క్రింది "నాన్ కోర్ జాప్స్"లో కాంట్రాక్టు కార్మికులను నియమించ వచ్చు అనే సవరణ ప్రతిపాదిస్తున్నారు. **1.** ప్లాంటు, మెషినరీల మెయింటెనెన్సు, సర్వీసింగ్ మరియు రిపేరు చేసే పనులు. **2.** బిల్డింగ్స్, రోడ్డులు, వంతెనల నిర్మాణం మరియు మెయింటెనెన్స్. **3.** తోటల పెంపకం. **4.** సరుకులు, ముడిసరుకులు, లోడింగ్ మరియు అన్ లోడింగ్ **5.** హాస్పిటల్స్, విద్యాలయాలు, శిక్షణ సంస్థలు, అతిధి గృహాలు మరియు క్లబ్‌ల నిర్వహణ **6.** స్వీపింగ్, క్లీనింగ్, డస్టింగ్ మరియు వ్యర్థ పదార్థాల సేకరణ బయటికి పడవేయడం. మొదటి సవరణతోనే 80% పనులలో కాంట్రాక్టు కార్మికులను పెట్టవచ్చు.

రెండవ లేబర్ కమిషన్ నాన్ కోర్ జాప్స్‌లో కాంట్రాక్టు కార్మికులను నియమించ వచ్చని అదే విధంగా కోర్ జాప్స్‌లో కూడా కొన్ని ప్రత్యేక పరిస్థితులలో కాంట్రాక్టు లేబర్‌ను నియమించవచ్చని ప్రతిపాదించింది. ఇప్పుడు ఈ సవరణతో పరిశ్రమలు కాంట్రాక్టు కార్మికులతో నిండిపోతాయి. పర్మినెంటు కార్మికులు కొన్ని పనులలోనే ఉంటారు.

వీటితో సరిపెట్టక మరో ప్రమాదకరమైన సవరణను కూడా ప్రతిపాదించింది. ఒక పరిశ్రమలో నిర్ణీత కాలపరిమితిలో అదనపు పని చెయ్యాల్సి ఉంటే ఆ పనికి కాంట్రాక్టు కార్మికులను వినియోగించవచ్చని సెలవిచ్చింది. ఇక ఈ పేరుతో యజమానులు ఒకే ఆవరణలో రెండు రకాల కార్మికులతో పని చేయించుకుంటారు. ఒక్కరు పర్మినెంటు కార్మికులు రెండవ వారు ఏ హక్కులేని కాంట్రాక్టు కార్మికులు. ఇక పర్మినెంటు కార్మికులు అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కులకు పెద్ద ప్రమాదం వచ్చిపడినట్లే. కాంట్రాక్టరు తన కార్మికులకు నిర్ణీత కాలంలో వేతనాలు చెల్లించకపోయినా, తక్కువ వేతనాలు చెల్లించినా, పని స్థలంలో భద్రతకు ఏర్పాటు చేయకపోయినా అసలు యజమానిదే బాధ్యతగా ఇంతకాలం ఉన్నది. ప్రధాన యజమాన్యపు బాధ్యతను తొలగిస్తూ సవరణను ప్రతిపాదిస్తున్నారు. ఇక పరిశ్రమలలో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం ఏర్పడుతుంది. లైసెన్స్ లేకుండానే కాంట్రాక్టర్లు పనులు చేయించవచ్చనే మరో సవరణ ప్రతిపాదిస్తున్నారు.

ఈ సవరణలను ప్రస్తుత పార్లమెంటు సమావేశంలో ప్రతిపాదిస్తారు. అంటే బానిస విధానం అమలుకు అనుమతి కోరుతున్నారు. ❖

మే దినోత్సవ శుభాకాంక్షలతో...

సిఐటియు

గుంటూరు పట్టణకమిటీ

మే దినోత్సవ శుభాకాంక్షలతో...

సిఐటియు

పశ్చిమగోదావరి జిల్లా కమిటీ

అధ్యక్షులు : చింతకాయల బాబూరావు
ఉపాధ్యక్షులు : ఆర్. సత్యనారాయణ రాజు
ప్రధాన కార్యదర్శి : కె. రాజారామ్మోహనరాయ్

ప॥గో॥ జిల్లా సహకార సంఘాలు మరియు రూరల్ బ్యాంకు ఉద్యోగుల యూనియన్ పశ్చిమగోదావరి జిల్లా కమిటీ

అధ్యక్షులు: వి.వి.కృష్ణయ్య కార్యదర్శి: టి. కిషోర్

ఏలూరు పట్టణ కమిటీ

అధ్యక్షులు: పి. సూర్యప్రకాశరావు
కార్యదర్శి: బి. సోమయ్య

జంగారెడ్డి గూడెం డివిజన్ కమిటీ

అధ్యక్షులు: ఎ. శ్యామలారత్నం
కార్యదర్శి: సి. మాణిక్యాలరావు

తాడేపల్లిగూడెం టౌన్ కమిటి

అధ్యక్షులు: ఎస్. రంగారవు కార్యదర్శి: సి.ఎస్. పుల్లారెడ్డి

ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ పశ్చిమగోదావరి జిల్లా కమిటీ

అధ్యక్షులు: ఎ. శ్యామలారత్నం కార్యదర్శి: పి. భారతి

ఆర్టీసి స్టాఫ్ & వర్కర్స్ ఫెడరేషన్ (రీజియన్ కమిటీ), పశ్చిమగోదావరి జిల్లా కమిటీ

అధ్యక్షులు: ఆర్.వి.ఎస్. నారాయణ కార్యదర్శి: సిహెచ్. సుందరయ్య

తాడేపల్లి గూడెం డివిజన్ కమిటీ

అధ్యక్షులు: ఎస్. చంద్రయ్య
కార్యదర్శి: సిహెచ్. బాబూరావు

పాలకొల్లు డివిజన్ కమిటీ

అధ్యక్షులు: జి. సత్య నారాయణ
కార్యదర్శి: పి. కృష్ణారావు

నరసాపురం డివిజన్ కమిటీ

అధ్యక్షులు: ఎస్. వెంకటేశ్వర్లు
కార్యదర్శి: పి. నారాయణరావు

తణుకు డివిజన్ కమిటీ

అధ్యక్షులు: టి. మురళీ
కార్యదర్శి: డి. సీతారామయ్య

కొవ్వూరు డివిజన్ కమిటీ

అధ్యక్షులు: డి. రాధాకృష్ణ
కార్యదర్శి: జె. రాంబాబు

ఏలూరు డివిజన్ కన్వీనింగ్ కమిటి

మే దినోత్సవ శుభాకాంక్షలతో...

భీమవరం డివిజన్ కమిటి

అధ్యక్షులు : బి. వాసుదేవరావు
కార్యదర్శి : బి. సత్యనారాయణ

భీమవరం పట్టణ కమిటి

అధ్యక్షులు : బి. మల్లేశ్వరరావు
కార్యదర్శి : బి. వాసేదేవరావు

భీమవరం ఏరియా రైస్ మిల్ వర్కర్స్ యూనియన్

అధ్యక్షులు : గరికపాటి అయ్యన్న
కార్యదర్శి : బి. సత్యనారాయణ

ఆకివీడు రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్

అధ్యక్షులు : ఎ.తవిటి నాయుడు
కార్యదర్శి : బి. సత్యనారాయణ

ఎ.పి. ఆటో ట్రాలీ వర్కర్స్ యూనియన్, ఆకివీడు కమిటీ

అధ్యక్షులు : ఎస్.కె. బాజీ
కార్యదర్శి : కె. బ్రహ్మాజీరావు

ఆకివీడు పట్టణ కమిటి

అధ్యక్షులు : బి. సత్యనారయణ
కార్యదర్శి : ఎ. తవిటి నాయుడు

బజారు లాగుడు బండ్ల కార్మిక సంఘం, భీమవరం

అధ్యక్షులు : గండ్రెడ్డి సన్యాసిరావు కార్యదర్శి : జె.ఎన్. వి. గోపాలన్

ఉండి సివిల్ సప్లైయిస్ గోడౌన్స్ ముఠా వర్కర్స్ యూనియన్

అధ్యక్షులు : అయితం అప్పారావు కార్యదర్శి : జె.ఎన్.వి. గోపాలన్

డెల్టా పేపర్‌మిల్స్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్

అధ్యక్షులు : జి.ఎన్.వి. గోపాలన్
కార్యదర్శి : బిహెచ్. సుబ్బతాతరాజు

భారతీయ విద్యాభవన్స్ నాన్ టీచింగ్ స్టాఫ్ అసోషియేషన్

అధ్యక్షులు : జి.ఎన్.వి. గోపాలన్ కార్యదర్శి : ఆర్.వి. ఎస్. జగన్నాధం

రైల్వే గూడ్‌షెడ్ ముఠా వర్కర్స్ యూనియన్, ఆకివీడు

అధ్యక్షులు : పీతలవెంకన్న కార్యదర్శి : బి. సత్యనారాయణ

ఆకివీడు అట్టల ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్

అధ్యక్షులు : కె. శేషగిరిరావు కార్యదర్శి : బి. సత్యనారాయణ

అంతర్జాతీయం

మానవ కవచంగా మారిన అమెరికన్ యువతి



అమెరికా అంటే బుష్ బుష్ అంటే యుద్ధం- బాంబులు- రక్త ప్రవాహమే గుర్తుకు వస్తుంది. ఇరాకీ మహిళల ఆక్రందనలే వినిపిస్తాయి. కానీ అదే అమెరికాలో మానవుల మనగడకోసం తన ప్రాణాలను సహితం బలిపెట్టిన ఒక ఉద్ధత మహిళ ఉదంతం కూడ వెలుగులోకి వచ్చింది. మానవ బాంబులు తాము చనిపోతూ మానవ వినాశనాన్ని కోరుకుంటే మానవ కవచాలు తాము మరణించి మానవ రక్షణను కోరుకుంటాము. ఒక అమెరికాలోనే పూర్తి విరుద్ధమైన ప్రవృత్తులు వ్యక్తం అయినట్లు మానవ బాంబులకు పూర్తి విరుద్ధంగా మానవ కవచాలు రూపొందాయి. రాచల్ కోర్రీ 23 సం॥ల అమెరికన్ యువతి. పాలస్తీనాలో శాంతి నెలకొల్పడానికి పని చేస్తున్న కార్యకర్త. పాలస్తీనా ప్రజల ఇండ్లను ఇజ్రాయిల్ సైన్యం రాత్రిపూట బులడౌజర్లతో కూలకొడుతుంటే హెడ్‌లైట్ల వెలుగులు మెరిసే ఫ్లోరోసెంట్ జతలున్న నార్మింజరంగు జర్కిన్ ధరించిన ఆ యువతీ అడ్డు పోయినందుకు అదే బులడౌజర్‌తో ఆమెపైకి ఎక్కించి ప్రాణం తీశారు. పాలస్తీనాలో శాంతి కోసం మానవ కవచంగా ఉండి ప్రాణ త్యాగం చేసిన మొదటి సాహస మహిళ ఆమె.

టామ్ హరున్‌డల్ 21 సం॥ల లండన్ యువకుడు. శాంతి కోసం కృషి చేస్తున్న కార్యకర్త. ఇజ్రాయిల్ సైన్యం పాలస్తీనా ప్రజలపై కాల్పులు జరుపుతుంటే తన పసిపిల్లలను కాపాడుకోవడానికి అల్లాడుతున్న ఒక మహిళకు రక్షణగా నిలిచినందుకు అతనిపై ఇజ్రాయిల్ సైన్యం పేల్చిన తూటకు తలకు గాయం అయింది.

రాచెల్ కోర్రీ, టామ్ హరున్‌డల్ "అంతర్జాతీయ సంఘీభావ ఉద్యమం"లో సభ్యులు. ఈ సంస్థ అమెరికా, బ్రిటన్‌లకు చెందిన 20 నుండి 30 సం॥ల లోపు యువతీయువకులలో ఏర్పడింది. పాలస్తీనాలో శాంతి స్థాపన కోసం "మానవ కవచాలు"గా పని చేసే లక్ష్యం గల వారితో ఏర్పడింది.

"మానవ కవచాలు" అంటే పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ సైన్యం చేస్తున్న అక్రమాలకు ప్రత్యక్షంగా అడ్డుపడటం. ఇది ఒక కొత్త తరహా ఉద్యమం. ఇటీవల అమెరికా ఇరాక్‌పై చేస్తున్న దురాక్రమణ యుద్ధంలో కూడా "మానవ కవచాలు"గా ఉండడానికి అనేక దేశాల నుండి కార్యకర్తలు వచ్చారు.

భారతదేశం నుంచి కూడ ఐదుగురు వ్యక్తులు ఇరాకీలకు మానవ కవచాలుగా ఉండటానికి వెళ్ళారు. అయితే దౌత్య పరమైన సాంకేతిక ఇబ్బందులు ఏర్పడటంతో వారిని మధ్య నుంచె తిరిగి పంపించి వేశారు.

ఇజ్రాయిల్ సైన్యం "మానవ కవచాల" ఉనికిని సహించలేకనే వారిపై కూడ దాడులు చేస్తున్నది. ఇక్కడ రెండు విషయాలు స్పష్టం అవుతున్నాయి. ఒకటి అంతర్జాతీయంగా పాలస్తీనాలో శాంతి నెలకొనాలనే సంఘీభావం పెరిగి శాంతియుతంగా ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకునే వారు ఏర్పాడ్డారు. రెండవది ఇజ్రాయిల్ మాత్రం అంతర్జాతీయ సంఘీభావాన్ని కూడా లెక్కచెయకుండా దాన్ని అణచటానికి బరితెగించి పాలస్తీనాలో ఇజ్రాయిల్ ఆటకట్టించి శాంతి నెలకొనాలి. ❖

ఎల్‌సాల్వెడార్ ఎన్నికల్లో వామపక్షాల విజయం



సాన్ సాల్వెడార్ : ఎల్ సాల్వెడార్‌లో మేయర్ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో వామపక్షాల అభ్యర్థులు విజయం సాధించారు. సాన్ సాల్వెడార్ మేయర్ స్థానాన్ని వామపక్ష అభ్యర్థి జమోరా గెలుచుకున్నారు. సాధారణ ఎన్నికల్లో కూడా వామపక్షాలు విజయపథాన ఉన్నాయి. ఎల్ సాల్వెడార్ కాంగ్రెస్‌లోని 84 స్థానాలకు, 262 మేయర్ స్థానాలకు దేశవ్యాప్తంగా ఎన్నికలు జరిగాయి. 100కు పైగా మేయర్ స్థానాలను తాము గెలుచుకున్నట్లు ద ఫరబుందో మర్టీ నేషనల్ లిబరేషన్ (ఎఫ్‌ఎంఎల్‌ఎన్) ప్రకటించింది. కాంగ్రెస్ ఎన్నికల్లో కూడా నేషనలిస్ట్ రిపబ్లికన్ అలయెన్స్ కన్నా ముందంజలో ఉన్నట్లు ఫ్రంట్ తెలిపింది. "మేము విజయ పథాన ఉన్న విషయాన్ని మా ఆధిక్యతలే స్పష్టం చేస్తున్నాయి" అని సాన్ సాల్వెడార్‌లో విజయం సాధించిన ఎఫ్‌ఎంఎల్‌ఎన్ అభ్యర్థి కర్లోస్ రివాస్ జమోరా అన్నారు.

జాతీయం

విహెచ్‌పి అసాంఘిక కార్యక్రమాలను అణచి వేయాలి

చట్ట విరుద్ధమూ, ప్రజలను రెచ్చగొట్టే స్వభావమూ గలిగిన కార్యకలాపాలకు గాను అరెస్టయిన విశ్వహిందూ పరిషత్ నాయకుడు ప్రవీణ్ తొగాడియా, అజ్మీర్ చెరసాల నుంచి బయటకు వచ్చినప్పుడు ఆయనలో ఎలాంటి పశ్చాత్తాపమూ కన్పించలేదు. పైగా విషాన్ని చిమ్ముతూ



'హిందూరాష్ట్ర' కోసం తన పోరాటం కొనసాగిస్తానంటూ ప్రతిజ్ఞ చేశాడు. రాజ్యాంగాన్నీ, దేశ చట్టాలనూ బహిరంగంగా ధిక్కరిన్తూ విహెచ్‌పి ద్వారా త్రిశూలాల పంపిణీని కొనసాగిస్తామంటూ హూంకరించాడు. అయోధ్య వివాదం వలెనే త్రిశూలాల పంపిణీకి కూడా మతంతో ఎలాంటి సంబంధమూ లేదు. మతతత్వ భావాలను రెచ్చగొట్టేందుకూ అదే విధంగా రాజకీయంగానూ, ఎన్నికలలోను ప్రయోజనాలను పొందేటందుకై మత విభజనను సృష్టించేటందుకూ ఈ పంపిణీ కార్యక్రమాన్ని వుద్దేశించారు. 'హిందూత్వ' పదాన్ని వాడుకలోకి తెచ్చిన వి.డి. సావర్కార్ స్వయంగా ఒక ప్రకటన చేస్తూ హిందూ మతానికి హిందూత్వ అనేది పర్యాయపదం కాదని చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా పునరుద్ఘాటించవలసిన అవసరం ఎంతైనా వున్నది. ఇది రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసేందుకు వాడుతున్న రాజకీయ నినాదం తప్ప మరొకటి కాదు. కనుక త్రిశూలాల బహిరంగ పంపిణీ అనేది మతంతో ముడివేసుకొన్న చర్య కాదు. భారత రాజ్యాంగానికీ, దేశ చట్టాలకూ ఆధారమైన లౌకిక, ప్రజాతంత్ర పునాదులను కాపాడుకోవలసి వుంది. అలానే ఎవరైతే వీటిని వుల్లంఘిస్తున్నారో వారి నుండి ఆధునిక భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలను పరిరక్షించుకోవాల్సి ఉంది.

గుజరాత్‌లో లభించిన ఎన్నికల విజయంతో మదించిన అరెస్సెస్ కబంధుడు భారతదేశమంతటిలోను మోడీతత్వాన్ని ప్రవేశపెట్టాలని చూస్తున్నాడు. ప్రత్యేకించి ఈ ఏడాది చివరిలో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలో గుజరాత్ తరహా పరిస్థితిని సృష్టించే లక్ష్యంతోనే ఈ త్రిశూలాల పంపిణీ జరుగుతున్నది. ఆ విధంగా ఎన్నికల ప్రయోజనాలను పొందాలని బిజెపి చూస్తున్నది. రాజస్థాన్‌లో జాగ్రత్తగా ఎంపిక చేసుకొన్న మైనారిటీలు లేదా గిరిజన తెగలు నివసించే ప్రాంతాలలో త్రిశూలాల పంపిణీతో పాటు రెచ్చగొట్టే ప్రసంగాలను విహెచ్‌పి చేస్తున్నది. ఘర్షణలు జరగటానికి అవకాశమున్న ప్రాంతాలలో మత వుద్రిక్తతలను రెచ్చగొట్టేందుకే త్రిశూలాలను పంపిణీ చేసే పద్ధతిని చేపట్టింది. ఈ నిర్ణయాలకే వారు గట్టిగా కట్టుబడి వున్నారు. ఈ ఏడాది చివరిలో ఎన్నికలు జరగనున్న మరో రాష్ట్రమైన చత్తీస్‌ఘర్‌లో లక్ష త్రిశూలాలు పంపిణీ చేస్తానని విహెచ్‌పి ఇప్పుడు బెదిరిస్తున్నది.

ఇది ఇలా వుండగా విహెచ్‌పికి అరమరికలు లేని మద్దతును బిజెపి అందజేస్తున్నది. ప్రవీణ్ తొగాడియాకు స్వాగతం చెప్పేటందుకై విహెచ్‌పి నాయకులతోపాటు రాజస్థాన్ బిజెపి కార్యదర్శి సైతం అజ్మీర్ జైలు వద్దకు వచ్చాడు. దేని ప్రకారమైతే ప్రమాణం చేసి బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం కేంద్రాధికారాన్ని చేపట్టిందో ఆ రాజ్యాంగాన్ని సమున్నతంగా నిలబెట్టటానికి బదులుగా, త్రిశూలాలు ప్రమాదకరమైన ఆయుధాలు కావని ఉపప్రధాని, కేంద్ర హోంమంత్రి అయిన ఎల్.కె.అద్వానీ వ్యాఖ్యానించినట్లుగా వార్తలు వచ్చాయి.

ఆరెస్సెస్ రాజకీయ విభాగమైన బిజెపి తన ప్రభుత్వాధికారాన్ని వినియోగించి చట్ట విరుద్ధమూ, రాజ్యాంగ వ్యతిరేకమూ అయిన చర్యలను ప్రోత్సహిస్తున్న విషయం ఈనాడు స్పష్టమైంది. భారత రాజ్యాంగమూ, దేశ చట్టాలు వుపేక్షించదగినవి కాదు. వీటిని వుల్లంఘించేటందుకు ఎవరినీ అనుమతించరాదు. ఆధునిక భారత గణతంత్రపు లౌకిక ప్రజాతంత్ర పునాదులను తిరగదోడనప్పటికీ నిర్లక్ష్యం చేస్తున్న ఆరెస్సెస్ వంటి ధూర్తశక్తుల అసాంఘిక కార్యకలాపాలను అడ్డగించేటందుకై కఠిన చర్యలను సకాలంలో తీసుకోవడం ఎంతైనా అవసరం. ఒకవేళ బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆరెస్సెస్‌ను అంటిపెట్టుకొని వుంటూ దాని ప్రయత్నాలకు ప్రభుత్వ సహాయాన్ని అందిస్తున్నట్లయితే అప్పుడు ప్రజలే ముందుకు వచ్చి వారిని అధికారాన్నుంచీ, ప్రభుత్వాన్నుంచీ సాధ్యమైనంత దూరంగా వుంచటానికి చర్యలు చేపట్టాలి.

(పీపుల్స్ డెమొక్రసీ సంపాదకీయం)

మే దినోత్సవ శుభాకాంక్షలతో...

సూర్యవంశీ స్పిన్నింగ్ మిల్స్ వర్కర్స్ యూనియన్

రి.నెం. ఎ-908, అలియాబాద్ - శామీర్‌పేట (మండలం)



ప్రెసిడెంట్ : జి. రాంబాబు

వర్కింగ్ ప్రెసిడెంట్ : కె. హరిప్రసాద్

వైస్ ప్రెసిడెంట్ : యన్. నర్సింహ, డి. గణేష్

జనరల్ సెక్రటరీ : యం. కిష్టప్ప

డిప్యూటీ జనరల్ సెక్రటరీ : బి. నర్సింహ

అసిస్టెంట్ సెక్రటరీస్ : కె. రమేష్, బి. నరేందర్, బి. సబిత, ఎ. రమాదేవి, జి. విజయలక్ష్మి

ఆర్గనైజింగ్ సెక్రటరీస్ : బి. స్వామిరెడ్డి, సి.మల్లేష్ కె. గణేష్

ట్రెజరర్ : యస్. బాబూరావు

సమాలోచన

'పసిడి పాలన'కు పతన సాక్ష్యాలు

విజన్- 2020 ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మానసపుత్రిక. ఆయన అలా చెప్పుకుని నాలుగు సంవత్సరాలైంది. ఈ స్వప్న సాఫల్యం కోసం ఆయన కృషి ప్రారంభించి ఆయన మాటల్లోనే ఏడేళ్ళయింది.

విజన్-2020 ప్రపంచబ్యాంకు సూచించిన ఆర్థిక సంస్కరణల చేదు గుళికకు పూసిన తీపిపూత అని అది చదివిన వారికెవరికైనా అవగతమవుతుంది. కీలకరంగాలలో చివరికి విద్య, వైద్య రంగాలలో సైతం ప్రైవేటుకు పెద్దపీట వేసి ప్రజల బాగోగుల బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకోవడమే ఈ విజన్ లక్ష్యం. అలాంటి విజన్‌ను కలగన్న ముఖ్యమంత్రి తాను నిర్మించబోయే భవిష్యత్ "ఆంధ్రప్రదేశ్‌కు స్వర్ణాంధ్ర ప్రదేశ్" అని నామకరణం చేశారు. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాతల ఏడేళ్ళ పాలనలో రాష్ట్రం ఏ స్థాయిని సాధించిందో జనాభా లెక్కల సేకరణ విభాగం వారి తాజా గణాంకాలే కళ్ళకు కట్టాయి.

ఈ గణాంకాలను బట్టి 1990 నుంచి 2000 మధ్య పదేళ్ళలో రాష్ట్ర ప్రజల స్థితిగతులలో మార్పు లేదని స్థూలంగా అవగతమవుతున్నది. 2001 జనాభా వివరాల సేకరణకు ఏడాది ముందు 2000లో ఈ విభాగం రాష్ట్రంలో జరిపిన కుటుంబవారీ సర్వేలో తలతిరిగిపోయే కఠోర సత్యాలు బయటపడ్డాయి.

68 శాతం కట్టెల పొయ్యిలే :

ప్రతి గ్రామాన్ని ఇంటర్నెట్‌తో కలుపుతామని ఇ-గవర్నెన్స్‌తో రాష్ట్రాన్ని అకాశానికెత్తుతామని తరచూ డబ్బాకొట్టుకునే పాలకులు రాష్ట్రంలో 68 శాతం కుటుంబాలు ఇంకా కట్టెల పొయ్యిల మీదనే వంట చేసుకుంటున్నాయన్న అప్రియ వాస్తవానికి ఏమి సంజాయిషీ చెప్పుకుంటారు? ఎక్కడుంది మీ 'దీపం', మీ పాలనే రాష్ట్ర ప్రజలకు శాపం అంటే దానికి వారి వద్ద ఉన్న సమాధానం ఏమిటి?

అభివృద్ధికి తోడ్పడని పన్నులు :

పేదల సంక్షేమ పథకాల కింద వ్యయంలో భారీగా కోత పెట్టి మిగుల్చుకుంటున్న నిధులుగాని, మద్యనిషేధానికి తలకొరివి పెట్టి సంపాదిస్తున్న ఎక్సైజ్ ఆదాయంగాని, పెంచిన పన్నుల ద్వారా వస్తున్న అదనపు రాబడిగాని, రాష్ట్రాభివృద్ధికి బొత్తిగా వినియోగపడడం లేదని రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలలో వీసమెత్తు వికాసం కానరాకపోవడాన్ని బట్టే అవగతమవుతున్నది.

32 శాతం పూరిళ్ళు :

రాష్ట్రంలో 67 శాతం ఇళ్ళకు మరుగుదొడ్లు లేవు. 32 శాతం పైబడిన కుటుంబాలు ఇంకా తాటాకులు, గడ్డికప్పిన పూరిళ్ళలోనే నివసిస్తున్నారు.

అధోగతిలో పారిశుధ్యం :

68 శాతం కుటుంబాలకు మరుగుదొడ్లు లేవంటే మన రాష్ట్ర పారిశుధ్య సౌభాగ్యం ఎలా ఉందో వివరించాలా? పారిశుధ్యలేమి ఎన్ని అనర్థాలకు దారితీస్తుందో చెప్పాలా? మహారాష్ట్ర లో 16.81 శాతం, తమిళనాడులో 9.48 శాతం, కర్నాటకలో 9.24 శాతం షెడ్యూల్డు కులాల కుటుంబాలకు మరుగుదొడ్ల సౌకర్యం ఉండగా మన రాష్ట్రంలో 3.5 శాతం ఎస్సీ కుటుంబాలకు మాత్రమే ఈ సౌకర్యం ఉన్నది.

పథకాలు కావు- కనికట్టు విద్యలే !

పచ్చదనం, పరిశుభ్రత పేరుతో చేసిన హంగామా అంతా ప్రజల దృష్టి మళ్ళింపు పన్నాగమే తప్ప మరొకటి కాదు. ప్రజలకు అంతకుముందు వరకూ ఉన్న సౌకర్యాలన్నింటినీ ఊడబెరికి ఆ నొప్పి తెలియకుండా నీరు-మీరు, చదువుల పండుగ, ప్రజల వద్దకు పాలన, జన్మభూమి వంటి పేరు డాబు పథకాలతో ప్రభుత్వం కనికట్టు విద్యలు ప్రదర్శిస్తున్న సంగతిని సగటు పౌరుడు ఆకళింపు చేసుకున్నాడు.

టెలిఫోన్‌లు 8.6 శాతానికే :

కమ్యూనికేషన్ల రంగంలో అపూర్వమైన విప్లవం వచ్చింది. టెలిఫోన్ విలాసవంతమైన సౌకర్యంగా కాక నిత్య వినియోగ అవసరంగా మారిపోయింది. అయినా రాష్ట్రంలో టెలిఫోన్ సౌకర్యం కలిగిన కుటుంబాలు 8,6 శాతానికి మించి లేవు. రాష్ట్రంలోని దాదాపు సగం కుటుంబాలు ఒకే గతిలో కాపురం చేస్తున్నాయంటే మిగతా సౌకర్యాల ప్రస్తావనే అనవసరం. ఏడేళ్ళుగా ఈ ప్రభుత్వం ఏమి చేస్తున్నదని ప్రశ్నించడమూ అనవసరమే. మెజారిటీ కుటుంబాలు ఇంకా సైకిళ్ళు, రేడియోల స్థాయిలోనే ఉన్నాయి.

కిరోసిన్ దీపాలే దిక్కు:

ఇప్పటికీ 32.1 శాతం కుటుంబాలు కిరోసిన్ వెలుతురుతోనే రాత్రులు గడపవలసి వస్తున్నదంటే మన 'తెలుగు' వెలుగు ఎంత దేదీప్యమానంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. 'తెలుగు దేశా'ధీశుల హయాంలో వెలసిన నాలుగుబాటల హైటెక్ రోడ్ల మీద రాష్ట్రానికి వచ్చింది మరింత రుణభారం, పేదరికమే తప్ప ప్రగతి ఎంతమాత్రం కాదని ఈ కుటుం సర్వే గణాంక వివరాలు సందేహాతీతంగా చాటి చెబుతున్నాయి.

ఇరిగేషన్‌ను నిర్లక్ష్యం చేసి వ్యవసాయాధార గ్రామీణాంధ్రప్రదేశ్‌ను ఇనుపగజ్జెల తల్లి ఇల్లుగా మార్చివేసిన ఘనత తెలుగుదేశం పాలకులకే దక్కుతుంది.

జనాభా లెక్కల సేకరణ విభాగంవారి కుటుంబ సర్వే అద్దంలో రాష్ట్రం అభివృద్ధిపథంలో నత్తకు పాఠాలు నేర్పుతున్న దృశ్యం ఇంత చక్కగా కనిపిస్తుండగా డిస్కోతెక్‌లకు మద్యం లైసెన్సు లిచ్చి టూరిజం పరిశ్రమను పెంచి పోషిస్తామని చెప్పుకోవడం కంటే సిగ్గుపడవలసిన విషయం వేరేముంటుంది?

విచ్ఛిన్నమైన సంక్షేమ కవచం :

రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు ఇంకా అల్పాదాయ వర్గంగానే కొనసాగుతున్నాయి. మధ్యతరగతి కొనుగోలు శక్తి పడిపోయి ఆకలి చావులు, ఆత్మహత్యలు పెరిగిపోతున్న రాష్ట్రంలో సంక్షేమ కవచాన్ని తునాతనకలు చేసి చార్జీలు విపరీతంగా పెంచివేసి యువతరాన్ని నిరుద్యోగంలోకి నెట్టివేసే చర్యలకు సంస్కరణలని ముద్దుపేరు పెట్టి తైతక్కలాడడం ప్రజలను నిలువునా ముంచడం కాక మరేమిటి?

వరుస కరువులు :

ప్రభుత్వం ఎన్ని గొప్పలు చెప్పుకున్నా గ్రామీణ ప్రజల బతుకుల్లో ఇసుమంత వికాసం లేకపోగా నానాటికీ మరింత అధ్వాన్నంగా మారుతున్నాయి. వరుస కరువుల వల్ల సాగునీటి ఆధారం కొరవడి వ్యవసాయం దారుణంగా దెబ్బతినిపోయింది. దానిమీద ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవించే కుటుంబాలలో కల్లోలం రేగుతున్నది.

ఎంతకాలం భరించాలి :

అటు విదేశీ పెట్టుబడులూ రాక, ఇటు స్వదేశీ పెట్టుబడులూ పెరగక, ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేటు పాలబడిపోయి ఉద్యోగావకాశాలు సన్నగిల్లి యువతరం నిరుద్యోగం కోరల్లో చిక్కుకుపోయింది. ఇటువంటి దుస్థితిలోని రాష్ట్రానికి సంస్కరణలు మూలిగే నక్కమీద పడిన తాడిపండు చందమేనన్న సంగతిని ఎంతగా అరిచిగీపెట్టినా ఈ బధిరాంధ ప్రభుత్వం చెవికి ఎక్కడం లేదు. కళ్ళకు కనిపించడం లేదు. ప్రజల గుండెల మీద బండవేసి అంతటితో ఆగక దానిపైన ఎక్కి తొక్కుతుంటే వారు దానిని ఎంతకాలం భరిస్తారనేదే ప్రశ్న.

(వార్త సౌజన్యంతో)

"సింగరేణి" ఎన్నికలలో సిఐటియును గెలిపించండి!

సింగరేణిలో మే 14న యూనియన్ గుర్తింపు ఎన్నికలు జరుగుతున్నాయి. అవి కార్మికుల భవిష్యత్‌కు సంబంధించి అత్యంత కీలకమైనవి. ప్రభుత్వాలకు యాజమాన్యానికి లొంగిపోయి ద్రోహపూరిత ఒప్పందాలు చేసుకున్న యూనియన్లు కార్మికుల పక్షాన నికరంగా పోరాడుతున్న సిఐటియు ఈ ఎన్నికలలో పోటీ చేస్తున్నాయి. ప్రపంచబ్యాంకుతో చంద్రబాబు ప్రభుత్వం చేసుకున్న ఒప్పందంలో భాగంగా 2007 నాటికి సింగరేణిని ప్రైవేటుపరం చేయాలనే కుట్రతోనే గుర్తింపు యూనియన్ కాలాన్ని 4 సం॥లకు పెంచింది. కార్మికుల హక్కులను, యాజమాన్యానికి తాకట్టుపెట్టే యూనియన్‌ను గెలిపించుకుంటే, ఈ 4 సం॥ములు తమ పని "నల్లేరు మీద బండి లా" సాఫీగా సాగుతుందని యాజమాన్యం భావిస్తున్నది. కనుక గత అనుభవాలను నెమరువేసుకుని సరైన తీర్పును ఇవ్వండి. ప్రైవేటీకరణ అనుకూల, అవకాశవాద, లొంగుబాటు దారులసు ఓడించండి. వేతనం ఒప్పందాలలో, ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటంలో సమరశీలంగా పోరాడుతున్న సిఐటియుకు ఓటేసి మరింత శక్తిని ఇవ్వవలసిందిగా కోరుతున్నాము.

లొంగుబాటుదారులను ఓడించేందుకు ఇదే తగిన సమయం.

సంస్కరణల పేరుతో యాజమాన్యం యధేచ్ఛగా దాడి చేస్తున్నది. ఉద్యోగులను కుదిస్తూ, పనిభారం పెంచుతున్నది. హక్కులను కాలరాస్తున్నది. ఇప్పటి వరకు మనం చేసిన పనులన్నింటిని అవుట్ సోర్సింగ్, ఆఫ్ లోడింగ్ పేర్లతో కాంట్రాక్టర్ల పరం చేస్తున్నది. ప్రైవేటు ఎస్‌డిఎల్ యంత్రాలు, సర్ఫేసు మైనర్లతో విచ్చలవిడి యాంత్రీకరణ చేస్తూ ఉద్యోగభద్రతకు ముప్పు తెస్తున్నది. సర్ఫేసు డిపార్ట్‌మెంట్లను మూసివేస్తున్నది. క్రొత్త క్రొత్త సర్క్యులర్లతో కార్మికులను అభద్రతకు గురిచేస్తూ భయభ్రాంతులు చేస్తున్నది. ఈ నేపథ్యంలో యాజమాన్య కార్మిక వ్యతిరేక చర్యలకు నిరసిస్తూ సింగరేణి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చారిత్రాత్మక సమ్మె జరిగింది. సమ్మెను పాశవికంగా అణచివేసేందుకు చంద్రబాబు సర్కారు కోల్‌బెల్ట్ అంతా అప్రకటిత ఎమర్జెన్సీ పెట్టింది. టిఎన్‌టియుసి నాయకత్వం, యాజమాన్యం కుమ్మక్కై సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు పడరాని పాట్లు పడ్డారు. అరెస్టులను, జైళ్ళను ఖాతరు చేయకుండా కార్మికులు సమ్మె చేస్తుంటే ఎఐటియుసి, ఐఎన్‌టియుసి నాయకులు మంత్రివర్గ సబ్ కమిటీ వద్ద లొంగిపోయారు. సమస్యల పరిష్కారం కోసం పట్టుదలతో సమ్మె చేసిన కార్మికుల విశ్వాసాన్ని వమ్ము చేశారు. 2001 సం॥ములో కూడా గెలిచిన సంఘాల పేరుతో ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, ఐఎఫ్‌టియు, హెచ్‌ఎంఎస్ నాయకులు మాత్రమే జెఎసిగా ఏర్పడినాయి. ఇది సరైన విధానం కాదని అన్ని యూనియన్లు కల్సి పోరాడదామని సిఐటియు చెబితే ఓడిన సంఘాలను కలుపుకోమన్నారు. 13 రోజుల సమ్మె చేసి విఆర్‌ఎస్‌డిపెండెంట్ హక్కును సమాధి చేస్తూ అగ్రిమెంట్ చేసి డిపెండెంట్ ఉద్యోగాలకు మంగళం పాడారు. ప్రైవేటు ఎస్‌డిఎల్ యంత్రాలను 6 నెలలకు అంగీకరిస్తూ ఒప్పందం చేశారు. ఈ తప్పుడు ఒప్పందాలను ఆసరాగా చేసుకుని యాజమాన్యం కార్మికులపై మరింత దాడి చేస్తున్నది. కనుక ప్రైవేటీకరణ అనుకూల ఐఎన్‌టియుసి నాయకులను, లొంగుబాటు ఎఐటియుసి నాయకులను, యాజమాన్య తొత్తులుగా వున్న టిఎన్‌టియుసి నాయకులను ఓడించి, సరైన గుణపాఠం చెప్పాల్సిందిగా సిఐటియు కోరుతున్నది.

సిఐటియుకు వేసే ఓటు- ఐక్యపోరాటానికి బాట.

రాబోయే 4 సం॥రాలు మనకు చాలా గడ్డుకాలం. ప్రభుత్వం-యాజమాన్యం కార్మికులపై విరుచుకుపడే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితుల్లో కార్మిక వ్యతిరేక చర్యలను ప్రతిఘటించే యూనియన్ గుర్తింపులో వుండాలి. కార్మికుల ఐక్యత పట్ల అచంచల విశ్వాసంతో అందరిని కలుపుకుని పోరాడే యూనియన్ ఉండాలి. వేతన ఒప్పందాలు, ప్రైవేటీకరణ లాంటి విషయాలలో స్పష్టమైన విధానం కలిగిన యూనియన్ ఉండాలి. ప్రభుత్వం- యాజమాన్యం వద్ద చర్చలలో లొంగుబాటుతో కాకుండా, సమర్థవంతంగా కార్మికుల వాణిని వినిపించే ధైర్యం గల యూనియన్ గుర్తింపులో ఉండాలి. వీటన్నింటిని గమనంలోకి తీసుకొన్నప్పుడు ఐక్యత- పోరాటం నినాదమే ఆయుధంగా పనిచేస్తున్న సమరశీల సంస్థగా సిఐటియు నేడున్నది. సింగరేణిలో ఐక్యపోరాటానికి సిఐటియు శక్తి మేరకు కృషి చేస్తున్నది. అందుకే సిఐటియుకు మీరు వేసే ఓటు, సమైక్య పోరాటానికి గట్టి రహదారిని వేస్తుంది. అలాంటి ఐక్యపోరాటాలతోనే సింగరేణిని కాపాడుకోగలం. మనం హక్కులను రక్షించుకోగలం. అందుకే సిఐటియుకి ఓటు వేయండి.

7వ వేతన ఒప్పందం సాధనే సిఐటియు లక్ష్యం

ది. 1-7-2001 నుండి మనకు రావల్సిన 7వ వేతన ఒప్పందం సాధించటం, బొగ్గు గనుల ప్రైవేటీకరణ బిల్లును వెనక్కి కొట్టే లక్ష్యంతో సిఐటియు పోరాడుతుంది. రాబోయే వేజ్ బోర్డులో గని కార్మికుల బేసిక్, డిఏ, ఇంక్రిమెంట్లు, అలవెన్స్‌లు, హెచ్‌ఆర్ఎ, ప్రమోషన్ తదితర విషయాలలో కార్మికులకు ప్రయోజనం కలిగే విధంగా సిఐటియు కృషి చేస్తుంది. ఆఫ్ లోడింగ్ పేరుతో విచ్చిలవిడి కాంట్రాక్టీకరణను, సర్ఫేసు డిపార్ట్‌మెంట్ల మూసివేతలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తాం. సంవత్సరాల తరబడి యాక్టింగ్‌లు చేస్తున్న వారిని ఆయా క్యాటగిరీ/గ్రేడ్‌లలో రెగ్యులరైజ్ చేయించేందుకు పోరాడతాం. బదిలీ ఫిల్లర్లతో సహా అందరికి మైన్ యావరేజ్ ఇచ్చేలా కృషి చేస్తాం. ఉత్పత్తికి, సేఫ్టీకి ప్రత్యేకంగా మైనింగ్ స్టాఫ్‌ను కేటాయించి, యాక్సిడెంట్లను నివారించేలా యాజమాన్యంపై ఒత్తిడి తెస్తాం. టెక్నీషియన్లకు చార్జీ అలవెన్స్‌ను శాస్త్రీయంగా వర్తింపజేసేందుకు కృషి చేస్తాం. ఒకే ఏరియాలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్నారనే నెపంతో అక్రమంగా ట్రాన్స్‌ఫర్లు చేయాలనే యజమాన్యం చేస్తున్న కుట్రలకు, పెద్ద సైజు టబ్బులతో పనిభారం పెంచే విధానాలకు, సర్ఫేసు వారిని బలవంతంగా అండర్ గ్రౌండ్‌కు పంపే చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం. మన శ్రమతో కంపెనీకి వస్తున్న కోట్లాది రూపాయల లాభాలతో క్రొత్త బావులు ప్రారంభించాలని, వెనుకబడిన ఈ ప్రాంతంలో నిరుద్యోగులకు ఉపాధి సౌకర్యాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఐక్యపోరాటాన్ని నిర్మిస్తాం. నిరంతరం కార్మికులపై మానసిక ఒత్తిడిని పెంచుతున్న యాజమాన్యం చర్యలను ఆపు చేయించేందుకు కృషి చేస్తాం. ఈ క్రమంలో ఎన్ని అవరోధాలొచ్చినా, కార్మికుల పక్షానే నికరంగా నిలబడతారు.

కనుక సిఐటియు పట్ల విశ్వాసం ఉంచండి. "ఉదయిస్తున్న సూర్యుడు" గుర్తుకు ఓటేయండి. సింగరేణిలో ఉద్యమకాంతులు వెదజల్లేందుకు సిఐటియుకు అవకాశం ఇవ్వవల్సిందిగా కోరుతున్నాము.

మే దినోత్సవ శుభాకాంక్షలతో...

సిఐటియు

కర్నూలు జిల్లా కమిటీ

కర్నూలు నగర కమిటీ

నంద్యాల డివిజన్ కమిటీ

బేతంచర్ల డివిజన్ కమిటీ

నందికోట్కూరు డివిజన్ కమిటీ

డోన్ డివిజన్ కమిటీ, పత్తికొండ డివిజన్ కమిటీ

ఎమ్మిగనూర్ డివిజన్ కమిటీ, ఎస్.డబ్ల్యూ.ఎఫ్. రీజియన్ కమిటీ

అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ

గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ

పి.ఏ.సి.ఎస్. ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కమిటీ

మెడికల్ & హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కమిటీ

మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ

గ్రామ సేవకుల సంఘం జిల్లా కమిటీ

ఆదోని డివిజన్ కమిటీ

ఆత్మకూరు డివిజన్ కమిటీ



ఊరు ఇడువమన్నాది కరువు

వల్లవి : ఊరు ఇడువమన్నాది కరువు
ఉరితాడై ఉన్నాది పరువు
నవ ధాన్యాల మాట లేదు పల్లెల్లో
వలవల ఏడ్పుల వలసల బాటల్లో

చరణం : వట్టి కరువులో వడదెబ్బ పాలైనా
పచ్చి కరువులో తడిసి ముద్దయినా
అప్ప తెచ్చి తెచ్చి తేరుకోలేదన్న
అన్నదాత పేరు మాసిపోయిందన్న
వ్యవసాయమన్నదీ వనవాసమయ్యిందే

॥ఊరు॥

ఎడ్లబండి మువ్వ మూగబోయినాది
కర్రు నాగలి కొలిమి బూజుపట్టినాది
సేద్యబావి బోరు చిన్నబోయినాది
సేను సెలక అరక దిక్కులేకున్నాది
వడగండ్ల వానతో కడగండ్ల పాలాయెనే

॥ఊరు॥

నల్లరేగడి నేల నోరెళ్ల బెట్టింది
నింగివాన చినుకు నేల రాలనంది
భూమిలోని మొలక తొంగి చూడాకుంది
బువ్వ గింజ గింజ కడు దూరమయ్యింది
నీళ్ల చుక్కాలేక పల్లెండి పోయింది

॥ఊరు॥

వరదనాపలేదు వలసలాపలేదు
ఆనకట్ట తేడు ఆదుకొనా బోడు
కరువు నిధులన్నీ మింగి బలిసిన జాడు
కనికట్టు సర్కారు కరుణ జూపలేదు
సకల బాధలకు మూలం సర్కారు
దాన సంగతి తేల్చగ కదలాలి ఊరూరు

- ఆర్.ఎ.వాసు

కుక్కకాటుకు చెప్పు దెబ్బ

"గీ కంపెన్లల్ల బాధలు మితిమీరుతున్నయ్ భయ్!... మేనేజ్‌మెంట్ బెనిఫిట్లు ఎట్లనన్న లెవ్వుగనీ, మీదికెళ్ళి కార్మికులకు గీ సూపర్‌వైజర్ల, మేనేజర్ల బాధలు, ఎట్టి సాకిర్లు ఎక్కువైనయ్!..." అన్నాడు యాదగిరి చాయ్‌గ్లాస్ అందిస్తూ.

"ఏమైంది గురూ?... మనవాళ్ళు ఎవరైనా ఏ ఆపదలోనైనా ఇరుక్కున్నారా?..." అడిగాడు ప్రసాద్ చాయ్‌గ్లాస్ అందుకుంటూ.

ఇద్దరూ గరంచాయ్ తాగుతూ, బండి పక్కనే వున్న వేప చెట్టుకింద కూర్చున్నారు.

"అవ్ భయ్!... మన పక్క కంపిన్ల ముత్యం రెడ్డి వున్నడు సూడు?... గవాడే... మస్తు పరేషాన్ల ఇరుక్కున్నడు భయ్!..." అన్నాడు యాదగిరి చాయ్ తాగుతూ.

"ఎవరు?...ఆ పొట్టి కుర్రాడా?.. బోరంపేట వూరు నుంచి సైకిల్ మీద వస్తూ వుంటాడు!... అతనేనా?..." అడిగాడు ప్రసాద్ తాను కూడా చాయ్ చప్పరిస్తూ.

"అవ్ భయ్!... గా పొట్టేడే... పుట్టెడు బాధలు పడుతాండు. వాళ్ళ బోరంపేట వూళ్ళె పాలు మంచిగ దొర్కుతయ్ గద!... గట్లనే కోళ్ళు గూడ జర అగ్గువల దొర్కుతయనుకోరాదు. గవాళ్ళ జీయంం గాడొక్క రోజున వాన్ని బిలిచి, 'ఏందివయా రెడ్డీ... మీ వూర్ల గిట్ల అన్ని మంచిగ దొర్కుతయట గదా?...' అన్నడట. వాడు భీ సంబురపడి 'అవ్ సార్!...' అన్నడట. 'జర్రంత రేపాదివారం ఇంట్ల సిన్న పార్టీ వున్నది. నువ్వు నాకు అయిదారు కోళ్ళు పట్టుకరావాలె!...' అన్నడట. 'అచ్ఛా సాబ్!... గదెంత బాగ్యం!,... తప్పకుంట తెస్త!...' అన్నడట ముత్యం రెడ్డి" వివరించాడు యాదగిరి ఖాళీ చాయ్ గ్లాస్ కింద పెట్టి బీడీ అంటిస్తూ.

"మరి కోళ్ళను తెచ్చాడా గురూ?" అడిగాడు ప్రసాద్ తాను కూడా బీడీ అంటిస్తూ.

"అవ్ భయ్!.... ఆదివారం నాడు కోళ్ళను సైకిల్‌కు కట్టుకొని పోయి సీద దొరసానికి ఇచ్చిండు. గా దొర్సాని గా కోళ్ళను జూసి జర కోసి, బూరు పీకియ్యిమనె. గా ముత్యం రెడ్డి గట్లనే జేసిండు. 'ఇగ నువ్వు గిప్పుడేం బోతవ్?... ఈడానే తిందువ్ తియ్!...' అన్నదామె. గా మాటకు వాడు మస్తు ఖుషీగై పోయిండనుకోరాదు. ఇగ గా ఖుషీల వానితోని గా గిన్నెల పని, గీ నీళ్ళ పని... అన్ని పనులు జేయించింది గా దొర్సాని. పార్టీ అంతయి, పెద్దోళ్ళంత బోయినంక, అంబటాళ్ళకు... గూర్ఖగానికి, పని పోరికి, ముత్యం రెడ్డికి కూసుండబెట్టి అన్నం బెట్టింది. 'ఏందివయా రెడ్డీ!... కోళ్ళు సక్కగ వున్నయ్. నువ్వియాల మాకు మంచిగ సాయం జేసినవ్!..." అన్నది దొర్సానమ్మ. మన మత్యం గానికి జర షరం అన్పిచ్చి నగిండు. 'అరే!... నగుతవేమయ్యా!...' అనుకుంట ఆమె భీ నగింది. గంతల్నే జీయం సాబ్ వచ్చిండాడికి. కోళ్ళ రేటు అడిగిండు. ముత్యంగాడు జెప్పిన రేటు ఇని పరేషానైండ్లు, పెండ్లాం మొగుడు. ఒకరి మొఖం ఒకలు చూసుకున్నరు. గంత తక్కువ రేటుకే దొరుకతయా?... అని పరేషానైండ్లు...' ఇంక మీ వూళ్ళె ఏం దొరుకతయ'ని దొర్సాని అడిగింది. 'పాలు భీ మస్తుగ దొర్కుతయ'ని ముత్యంగాడు సంబురంగ చెప్పిండు. గంతే ఇగ... గండ్లనే మన ముత్యంగాని పని మటాష్ అయింది..." అన్నాడు యాదగిరి బీడీ పొగ బలంగా పీలుస్తూ.

"ఏమైంది గురూ?... ఊళ్ళల్లో పాలు బాగానే దొరుకుతాయ గదా?..." అన్నాడు ప్రసాద్ బీడీ పొగ వదులుతూ.

"ఇగ ఇనరాదు భయ్ మల్ల!... ముత్యం రెడ్డి... పాలు, కోళ్ళు, కోడిగుడ్లు, కూరగాయలు తెచ్చిచ్చుడు షురు జేసిండు. రోజు పొద్దుగాల పాలు జీయం ఇంట్ల ఇయ్యాలె. దొర్సానమ్మ ఏమైన పని జెప్పుతె చెయ్యాలె. అటెంక... ఉరుక్కుంట డ్యూటీకి రావాలె. పోనీ... గింతనే అయితె మంచిగనే వుండు. సంవత్సరం అయినంక వుళ్ళె పాలోడు రేట్లు బెంచిండు. గదే జీయంకు ముత్యంరెడ్డి సెప్పుతె జీయం నమ్మడు. 'అన్ని నువ్వే దొంగ మాటలు జెప్పుతానవ్!...' అంటడు. ఊళ్ళె నుంచి పాలాయనను తోలు కొచ్చిండు. 'హమ్మ... గాయినే పాలాయనని నమ్మకమేంది?... నీ దోస్తుగావచ్చు!...' అంటడు. 'మల్ల!... పాలు బంద్ జేద్దమా సార్!...' అంటె, 'అహాఁ!... గట్టెట్ల బంద్ జేత్తవ్?... దొర్సానమ్మ ఊకుంటదా?... అన్ని పాత రేట్లకే బరాబర్ గావాలె. నాటకాలొద్దు. జర్రంత అట్లిట్లయితె గేట్‌బంద్ జేయిస్త...' అంటడు. ఇంగ ముత్యం రెడ్డిగానికి దిక్కుదోసలె. గా పాలోని కాళ్ళు ఏళ్ళు పట్టుకొని కొన్ని రోజులు రేటు పెంచకుంట ఆపిండు. అటెంక ఇంక ముత్యం గాని జీతంల కెళ్ళి పైసలేసిచ్చి పాలు తెస్తుండు. ఇగ జెప్పు భయ్ వాడు ఏం జెయ్యాల్నో?..." అన్నాడు యాదగిరి మరో బీడీ అంటిస్తూ.

"ఇలాంటి విషయాల్లో మరీ అంత అమాయకం గా వుండకూడదు గురూ!... కుక్క కాటుకు చెప్పుదెబ్బే జవాబు కావాలి. నాకు కూడా ఇలాంటి సంఘటన ఒకటి జరిగింది. చెబుతాను విను గురూ!... పటాన్‌చెరులో ఓ కంపెనీ వుంది. నేను ఇక్కడికి వచ్చే ముందు అందులో కొన్ని రోజులు పని చేశానులే!... దాని ఎం.డి.గాడు ఓ పెద్ద హవులా. ఏ కాస్త కోపం వచ్చినా ఎదురుగ ఎవరు కన్పిస్తే వాళ్ళను కొడుతాడు. అదేమని ఎవరైనా అడిగితే, నేను మీకు పెడుతున్నా, కొడుతున్నా, పెట్టే చేయి కొట్టినా ఫర్వాలేదు అంటాడు వాడు. ఒకరోజు ఫిట్టర్‌నీ, మరో రోజు వెల్డర్‌నీ, ఇంకో రోజు హెల్పర్‌నీ... ఇలా రోజూ ఎవరినో ఒకరిని కొడుతూనే వుంటాడు. వాడు కొట్టడం సరే... కార్మికులు కూడా నోరు మూసుకుని దెబ్బలు తింటూ పని చేయడం అలవాటు చేసుకున్నారు. అక్కడ కూడా అంతా వూరు వాళ్ళు కదా? అమాయకంగా దెబ్బలు తినే వారు.

ఒకరోజు నేను కేబుల్ మిషన్ మీద సీరియస్‌గా పని చేస్తున్నా, వచ్చి ఏదో అడిగాడు. 'నా దగ్గర లేద'న్నాను. 'ఏమిటా నిర్లక్ష్య సమాధానం?...' అన్నాడు. 'నేనే మన్నాను?...' అన్నాను. దానికే వాడికి కోపం వచ్చింది. వెంటనే మిషన్ మీద వున్న స్పానర్ అందుకుని నా మీదకు లేపాడు. ఒక్క క్షణం ఆగితే అది నా భుజం మీద పడేదే. కానీ ఆ వెంటనే నేను... ' అరే ... ఆగరా!...' అన్నాను. వాడు బిత్తరపోయి వెనక్కి తిరిగి చూశాడు. వెనుకెవరూ లేరు. నేనన్నది వాడినే అని తెలుసుకున్నాడు. గుడ్లురిమి చూశాడు. 'ఎంత కండకావరంరా నీకు?...' అని మళ్ళీ స్పానర్ లేపాడు. 'అరే పందికొడుకా!... అది నా వంటి మీదపడాలి... నీ రక్తం కళ్ళ జూస్తాను నాయాళ్ళు!...' అన్నాను. అంతే... పరుగులాంటి నడకతో యమ స్పీడుగా వెళ్ళి వాడి ఆఫీసులో పడ్డాడు. అప్పటి నుంచి మరెవరి మీదకు చేతులెత్తలేదు..." అన్నాడు ప్రసాద్.

సైరన్ మోగగానే ఇద్దరూ బీడీలు కింద పడేసి గబగబా కంపినీలోకి వెళ్ళి పోయారు.

- పులుగు శ్రీనివాస్

Printed & Published by Sri.M.A.Gafoor On behalf of CITU A.P. State Committe from N.Y.B Smaraka Kendram, 1-1-1-60/4, Musheerabad, Hyderabad - 20, Type setting & Printing at Prajasakti Daily Printing Press, RTC'X' Roads, Hyderabad - 20. Editor Y. Siddaiah.

With Best Compliments

On the occasion of May Day

KUSHAIGUDA INDUSTRIAL EMPLOYEES UNION, Kushaiguda

COSMIC ENGINEERING EMPLOYEES UNION, Kushaiguda

SINDARE EMPLOYEES UNION, Kushaiguda

CHERALAPALLY INDUSTRIAL EMPLOYEES UNION, Cheralapally

SURANA TECOMES EMPLOYEES UNION, Cheralapally

DUCAN INDUSTRIES EMPLOYEES UNION, Cheralapally

LAXMI CONSTRUCTION EMPLOYEES UNION, Cheralapally

ARML EMPLOYEES UNION, Cheralapally

MALLAPUR INDUSTRIAL EMPLOYEES UNION, Mallapur

X.L. TELECOMES EMPLOYEES UNION, Mallapur

N.R. TECH EMPLOYEES UNION, Mallapur

HARD CASE EMPLOYEES UNION, Mallapur

A.P. FOOD EMPLOYEES UNION, Nacharam

INDIA LEAF SPRING LTD. KARMIKA UNION, Nacharam

VOITH INDIA EMPLOYEES UNION, Nacharam

NACHARAM INDUSTRIAL EMPLOYEES UNION, Nacharam

HINDUSTAN COCO COLA EMPLOYESS UNION, Moulali

MADHURA POLYMERS WORKERS UNION, Cheralapally

TRADINT PHARMA EMPLOYEES UNION, Mallapur

ECIL EMPLOYEES UNION

B.C.W. UNION EAST ZONE

AUTO EMPLOYEES EASTZONE

RICKSHAW WORKERS EASTZONE

CITU EAST ZONE COMMITTEE

KLV01A357

With Best Compliments

Ph:24530109

SRH

SRI ROHINI

HOSPITAL & POLY CLINIC

9-6-1/2, Sagar Road, Champapet, Hyderabad - 500 079.

X-Ray, ECG
Ultra Sound Scanning
& Diagnostic Centre

Dr. B.S. SRINIVAS
Director

మనసు ఫౌండేషన్

పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVOIA 352
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	25-8-2023
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	37
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Manika
పేజీలు విడదీసినది	Manika
స్కాన్ చేసినది	Manika
పరీక్ష చేసినది	AMRUTHA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	NO
పరిస్థితి	good